ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నేడు బెంగళూరులో సిఎల్‌పి సమావేశం
కర్నాటకలో కాంగ్రెస్ నూతన ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం

ప్రధాని మోదీకి తన ప్రభుత్వ మనుగడపైనే దృష్టి : రాహుల్ 07

సంపుటి 09, సంచిక: 179 | శనివారం | 30-05-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## 'నైరుతి' మరింత ఆలస్యం

● 4-5 తేదీల్లో కేరళకు రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ● ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం ● జూన్‌లో సాధారణం కంటే ఎక్కువ నెలవారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు : ఐఎండి



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాక మరింత ఆలస్యం కానుంది. రానున్న ఏడు రోజుల్లో రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వాతావరణ శాస్త్ర డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. వాస్తవానికి ఈ నెల 28వ తేదీన రుతుపవనాలు కేరళను తాకే అవకాశముందని ఐఎండి తొలుత వెల్లడించింది. సాధారణంగా, కేరళలో జూన్ 1వ తేదీన నైరుతి రుతుపవనాలు ప్రారంభమవుతాయి, ఇది దేశంలో నైరుతి రుతుపవన కాలం ప్రారంభానికి నాంది పలుకుతుంది. ఈ రుతుపవన కాలంలో భారతదేశంలో 92 శాతం దీర్ఘకాల సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఏప్రిల్ 13న వాతావరణ కార్యాలయం తెలిపింది. నైరుతి రుతుపవనాలపై తన రెండవ అంచనా సందర్భంగా భారత వాతావరణ శాఖ ఈ పరిశీలనలను వెల్లడించింది. జూన్‌లో ఎల్ నినో పరిస్థితులు బలహీనంగా, సెప్టెంబర్‌లో మధ్యస్థం నుండి బలంగా ఉండే అవకాశం ఉందని శుక్రవారం ఐఎండి పేర్కొంది. ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో తటస్థ ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ పరిస్థితులు ఎల్ నినో పరిస్థితుల వైపు పరివర్తన చెందుతున్నాయి. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడటం వల్ల దేశంలో తరువాయి 8లో



# 13 వేల వాహనాలు
# 2 లక్షలకు పైగా సిబ్బంది

## రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు

● యాసంగి ధాన్యం కొనుగోళ్లలో మరోసారి అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ ● ఇప్పటివరకు రాష్ట్రంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి ● ఇది దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం సేకరణలో 60 శాతం వాటా ● కనీస మద్దతు ధర కింద తెలంగాణలో ఇప్పటివరకూ రైతుల ఖాతాల్లో రూ.11,050 కోట్లు జమ ● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా జరుగుతున్న యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ మరోసారి అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు పూర్తైందని, ఇది దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం యాసంగి ధాన్యం సేకరణలో దాదాపు 60 శాతం వాటా అని తెలిపారు. సీజన్ ముగిసే నాటికి తెలంగాణ వాటా 75 శాతానికి చేరుకునే అవకాశముందని వెల్లడించారు. ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 13 వేల రవాణా వాహనాలు, రెండు లక్షలకుపైగా సిబ్బందిని వినియోగించినట్లు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రస్తుతం దేశ ఆహార ధాన్యాల సేకరణ వ్యవస్థకు ప్రధాన ఆధారంగా మారిందన్నారు. యాసంగి సీజన్‌లో తెలంగాణలో 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 8లో

సేంద్రియ ఉత్పత్తులతోనే
## ఆరోగ్యం పదిలం

● సేంద్రియ వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలి : మంత్రి తుమ్మల

సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని వ్యవసాయ శాఖ మంత్కరి తుమ్మల నాగేశ్వర్ రావు రైతులకు సూచించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, అందుకే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లోని శుక్రవారం జరిగిన ఆర్గానిక్ మేళా ప్రదర్శనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా తరువాయి 8లో

'క్యూర్' పరిధిలో
## 'లక్ష ఇళ్లు'

● నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ● తొలి విడత పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణానికి అనుమతి ● ఎల్‌ఐజి ఫ్లాట్లకు ఉచితంగా భూమి 'యుడిఎస్' రూ. 5 లక్షల భారీ సబ్సిడీ

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర పరిధిలో దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో అందుబాటు ధరల్లో ఎల్‌ఐజి, ఎంఐజి ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా లోఇన్‌కమ్ గ్రూప్ (ఎల్‌ఐజి), మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ (ఎంఐజి) ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో కెపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో చేపట్టిన తరహాలోనే, జిహెచ్‌ఎంసి, సైబరాబాద్, తరువాయి 8లో

ఉద్యోగుల బకాయిలు
## రూ.2000 కోట్లు

● విడుదల చేసిన ప్రభుత్వం ● రిటైర్డ్ ఉద్యోగుల జిపిఎఫ్ బకాయిలు మొత్తం 100 శాతం క్లియర్ ● డిప్యూటీ సిఎం కార్యాలయం ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం రూ.2000 కోట్లను శుక్రవారం విడుదల చేసింది. విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జిపిఎఫ్) బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి 2025 మే నెల వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా ప్రభుత్వం చెల్లించింది. 'ముందస్తు ప్రణాళికలు, పటిష్టమైన కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ.4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది' అని డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది. తద్వారా తరువాయి 8లో



నీట్‌-యుజి పేపర్ లీక్ లోపాలకు...
## 'జవాబుదారీతనం' ఉండాల్సిందే




● సుప్రీంకోర్టు స్పష్టీకరణ ● ప్రధాని స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని సొలిసిటర్ జనరల్ వెల్లడి

**న్యూఢిల్లీ :** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై అత్యున్నత న్యాయస్థానం మరొకసారి తీవ్ర ఆందోళనను వ్యక్తంచేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతం లోపాల కోసం జవాబుదారీతనం ఉండాల్సిందేనని శుక్రవారం సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. ఇలాంటిది జరిగితే అది కేవలం విద్యార్థులకు మాత్రమే తరువాయి 8లో

లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు
## సర్ సమస్య కావచ్చు

● ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలి ● వలసపోయినవారి ఓట్లు పోకుండా జాగ్రత్త వహించాలి ● 'సర్' కోసం 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇంచార్జీలను నియమించాలి ● టిపిసిసి పిఎసి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన ● రాజకీయ దురుద్దేశంతో బిజెపి సర్ చేపడుతోంది : మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారని, వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలన్నారు. మహిళలకు కూడా ఎస్‌ఐఆర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చని, ఎస్‌ఐఆర్ వల్ల దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉందన్నారు. టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ(పిఎసి), టిపిసిసి సలహా కమిటీ సమావేశం టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్‌లో జరిగింది. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు సి.దామోదర రాజనర్సింహ, మంత్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌లను నియమించాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి సూచించారు. అసెంబ్లీ ఇంఛార్జ్‌లు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనన్నారు. ఇంఛార్జ్‌లు కరెక్ట్‌గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చన్నారు. రాజ్యసభ సభ్యులు, ఎంఎల్‌సిలకు హైదరాబాద్ పరిధిలో తరువాయి 8లో

బిఆర్‌ఎస్ ప్రభుత్వం కంటే
## ఎక్కువ ఇళ్లు నిర్మిస్తాం



● ఆ తరువాత ఎన్నికల్లో పోటీ చేస్తా ● కెటిఆర్ రాజకీయాలకు దూరంగా ఉంటారా? ● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ ● గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల హామీలు మాటలకే పరిమితమయ్యాయి ● అవినీతి, అక్రమాలపై కెటిఆర్ మాట్లాడటం హాస్యాస్పదం ● క్యూర్ పరిధిలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కట్టిన ఇళ్ల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తేనే తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి ప్రకటించారు. కాంగ్రెస్ ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కెటిఆర్ రాజకీయాలకు దూరంగా ఉంటారా ? అని ప్రశ్నిస్తూ, దమ్ముంటే సవాల్ స్వీకరించాలని సవాల్ చేశారు. హైదరాబాద్‌లో అర్బన్ ఇందిరమ్మ ఇండ్ల డిజైన్‌లపై శుక్రవారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గురించి మాట్లాడే ధైర్యం లేక హైదరాబాద్ ఇండ్ల అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణంపై సవాల్ విసిరితే దాన్ని స్వీకరించే ధైర్యం కెటిఆర్‌కు లేదన్నారు. కాంగ్రెస్ తరువాయి 8లో

శుభ్ మన్ గిల్ సెంచరీ
## ఫైనల్‌కు దూసుకెళ్లిన గుజరాత్ టైటాన్స్

క్వాలిఫయర్ 2లో రాజస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో విజయం
31న అహ్మదాబాద్ వేదికగా ఆర్‌సిబితో అమీ తుమీ



**ముల్లాన్‌పూర్ :** క్వాలిఫయర్ 1లో కంగుతిన్న గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోర్‌తో సవాల్ విసిరినా శుభ్మన్ గిల్(104) శతకంతో కదం తొక్కి విజయాన్నందించాడు. సాయి సుదర్శన్(58)తో సెంచరీ భాగస్వామ్యంతో గెలుపు పునాది వేసిన గిల్ ఔటైనా.. ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(17 నాటౌట్) లాంఛనం ముగించాడు. మే 31 ఆదివారం ఆర్సీబీతో అమీ తుమీకి సిద్ధమైంది గుజరాత్. ఎలిమినేటర్లో పంజా విసిరిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2లో తేలిపోయింది. ముల్లన్‌పూర్‌లో వైభవ్ సూర్య వంశీ(96) విధ్వసంతో 214 రన్స్ కొట్టినా.. బౌలర్ల వైఫల్యంతో ఆ జట్టును ముంచింది. భారీ ఛేదనలో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శుభ్మన్ గిల్ శతకంతో రెచ్చిపోగా మూడో ఫైనల్ ఆడాలనుకున్న రాజస్థాన్ కల చెదిరింది. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ ఛేదనను గుజరాత్ ఓపెనర్లు శుభ్మన్ గిల్(104), సాయి సుదర్శన్(58)లు దూకుడుగా మొదలెట్టారు. ఆర్చర్ వేసిన తొలి ఓవర్లోనే నాలుగు ఫోర్లతో 19 రన్స్ రాబట్టారు. అయితే..14 పరుగుల వద్ద ఫెరీరా క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన సుదర్శన్ కెప్టెన్తో కలిసి రెచ్చిపోయాడు. ఇద్దరూ తరువాయి 12లో



ఐదు రోజుల్లో 30 వేలకు చేరవచ్చు తాజా అధ్యయనం అంచనా

తీవ్రమైన వేడితో ఒక్కరోజే
## 3400 అదనపు మరణాలు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా వడగాలులు బీభత్సం సృష్టిస్తున్న వేళ ఓ అధ్యయనం దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. దేశంలో తీవ్రమైన ఎండ, వడగాలులు నమోదైన రోజు సగటున సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని తాజా అధ్యయనం అంచనా వేసింది. ఇదే పరిశోధన మరో భయంకర విషయాన్ని కూడా చెప్పింది. వడగాల్పుల తీవ్రత వరుసగా ఐదు రోజుల పాటు కొనసాగితే, ఆ మరణాల సంఖ్య ఏకంగా 30,000 వరకు చేరుకునే అవకాశం ఉందని అధ్యయనం హెచ్చరించింది. పర్యావరణ మార్పులు దేశంలోని ప్రజల మరణాలకు ఎలా కారణం అవుతున్నాయనేది ఈ అధ్యయనం స్పష్టం చేసింది. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ'కి చెందిన 'ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్' పరిశోధకులు పియూష్ నారంగ్, అశోక్ గాడ్గిల్ ఈ అధ్యయనం చేశారు. భారత్‌లోని అన్ని జిల్లాల్లో మరణాలను అంచనా వేసేందుకు ఈ బృందం దేశంలోని 10 నగరాల్లో తీవ్రమైన ఎండ, తరువాయి 12లో

## రైతు డిస్కం వ్యవసాయానికి ఎండ్రిన్

● రైతులను చీకట్లోకి నెట్టే 'ఉరి డిస్కం' ● ప్రతిపాదిత రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీపై ప్రతిపక్షాలు విమర్శ ● నాణ్యమైన విద్యుత్ అందించేందుకే : కాంగ్రెస్ ● రైతులకు ప్రయోజనం చేకూర్చేలా డిస్కం ఉండాలి : పశ్య పద్మ




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ' (రైతు డిస్కం) ఏర్పాటుపై తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్ (ఇఆర్‌సి) శుక్రవారం సంస్థ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించింది. రైతు డిస్కం ఏర్పాటు రైతులను చీకట్లలోకి నెట్టే 'ఉరి డిస్కం'గా ప్రతిపక్ష బిఆర్‌ఎస్ వాదన వినించింది. రైతు డిస్కమ్‌తో వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టేనని, రైతుల భవిష్యత్‌ను ఆగం చేయడమేనని టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కామ్‌ను తీసుకువస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపి చామల కిరణకుమార్ రెడ్డి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ చెప్పారు. రైతులకు ప్రయోజనం కల్పించేలా తరువాయి 12లో

# కర్నాటకలో 'కుర్చీ' మార్పు

కర్నాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుకై కాంగ్రెస్ అధిష్టానవర్గం దాదాపు సంవత్సరకాలంగా చేస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను కూర్చోబెట్టేందుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ నాయకత్వం మంగళవారం ఆ నాయకులిద్దరినీ ఢిల్లీ పిలిపించుకుని వారికి తమ నిర్ణయాన్ని స్పష్టం చేసింది. ఇది వాస్తవానికి 2023 మే నెలలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తదుపరి కాంగ్రెస్ అధినాయకత్వం సలహాపై సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య చెరి రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవి పంచుకునేందుకు కుదిరిన అంగీకారమే. అయితే రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ఉభయులపై అనుచరుల ఒత్తిళ్లు, తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చే వ్యూహాలు వంటి అంశాలపై అంతర్గత చర్చల్లో భిన్నాభిప్రాయాలు వల్ల ఆ నిర్ణయం అమలుకు అదనపు సమయం అవసరమైంది. అధిష్టానవర్గం నిర్ణయం శిరోధార్యమంటూనే సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా పూర్తి పదవీ కాలం పూర్తిచేయాలన్న ఆకాంక్ష వ్యక్తం చేస్తూ వచ్చారు. సిద్ధరామయ్య బలమైన ఒబిసి నాయకుడు కాగా, శివకుమార్ బలమైన వక్కళిగ సమాజం నాయకుడు, సమర్థుడైన ఆర్గనైజర్, పిసిసి అధ్యక్షుడు. ఈ రెండు సామాజిక విభాగాల విశ్వాసం కొనసాగింపులోనే కాంగ్రెస్ భవిష్యత్ ఆధారపడి ఉంది. అన్నీ బేరీజు వేసుకుని, సిద్ధ రామయ్య పెద్దరికాన్ని గౌరవిస్తూనే ముఖ్యమంత్రి మార్పు నిర్ణయాన్ని ఆయనకు తెలియజేసింది. నిబద్ధతగల నాయకునిగా సిద్ధరామయ్య దాన్ని వెంటనే అంగీకరించటం ఈ పరివర్తన సజావుగా, కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలకు దెబ్బతగలకుండా జరుగుతోంది. సిద్ధరామయ్య గురువారం ఉదయం బెంగళూరులో మంత్రులు, ఎమ్మెల్యేలను అల్పాహారానికి పిలిచి, తాను వైదొలుగుతున్న విషయాన్ని తెలియజేశారు. శాసనసభాపక్షం కొత్త నాయకుణ్ణి లాంఛనంగా ఎన్నుకోవలసి ఉన్నప్పటికీ – అది అందరికీ తెలిసిన రహస్యమే కాబట్టి – కాబోయే ముఖ్యమంత్రి అంటూ తన పక్కనే ఉన్న శివకుమార్ వైపు వ్రేలు చూపించారు. మధ్యాహ్నం 3గంటలకు గవర్నర్ థవార్‌చంద్ గెహ్లోట్‌ను కలిసేందుకు లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ ఇండోర్ వెళ్ళి ఉన్నందున ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా లేఖ అందజేశారు. అనంతరం విలేకరులతో ముచ్చటిస్తూ, పార్టీ అధిష్టానవర్గం రాజ్యసభకు వచ్చి, జాతీయ రాజకీయాల్లో పాత్ర వహించాలని ప్రతిపాదించిందని, అయితే తనకు ఆ ఆసక్తి లేదని, రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని, ఎమ్మెల్యేగా మిగతా పదవీ కాలం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని వినమ్రతతో చెప్పినట్లు తెలిపారు. మతోన్మాద శక్తులపై పోరాటానికే తన జీవితాన్ని వెచ్చిస్తానన్నారు. మంత్రిపదవులు, పిసిసి పునర్వ్యవస్థీకరణ, వచ్చేనెల 18న అసెంబ్లీ నుంచి రాజ్యసభకు జరిగే ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల విషయాలపై ఢిల్లీలో అధిష్టానవర్గం ముఖ్యులు శుక్రవారం సిద్ధరామయ్య, శివకుమార్‌లతో చర్చించారు.

ముఖ్యమంత్రి పదవి మార్పు రాష్ట్ర కాంగ్రెస్‌లో తరం మార్పు, యువతరానికి బాధ్యతల బదిలీ. పాత–కొత్త తరం నేతల మధ్య అవగాహన, సామరస్యం కొనసాగింపు. శనివారం కాంగ్రెస్ శాసనసభాపక్షం లాంఛనంగా శివకుమార్‌ను శాసనసభాపక్షం నేతగా ఎన్నుకుంటుందని, జూన్ 1వ తేదీన ఆయన ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పబడుతున్నది. మంత్రివర్గం కూర్పుపై స్పష్టత రావలసి ఉంది.

77 సంవత్సరాల సిద్ధరామయ్య మైసూరు జిల్లావాసి. వెనుకబడిన తరగతులకు చెందిన కురుబ కులానికి చెందిన ఆయన ఎమర్జెన్సీకాలంలో సోషలిస్టుపార్టీ భావాలతో రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో స్థానిక సంస్థల ఎన్నికలతో, ఎన్నికల క్షేత్రంలో అడుగుపెట్టారు. ఆయన 1983లో చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి లోక్‌దళ్ అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. అటుతర్వాత దేవగౌడ నాయకత్వంలోని జనతాదళ్(సెక్యులర్)లో చేరారు. అయితే మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, దళితులతో కూడిన అహింద సామాజిక కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నాలు కొనసాగిస్తూ 2005లో ఆ పార్టీనుంచి బహిష్కరణకు గురైనారు. 2006లో కాంగ్రెస్‌లో చేరారు. ఇక వెనుతిరిగి చూడలేదు. 2013 నుంచి 2018 వరకు తొలిసారి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2023 మే నెలలో రెండవ పర్యాయం ముఖ్యమంత్రి అయినారు. 2026 జనవరి 7 నాటికి 2792 రోజులు పదవీకాలం పూర్తిచేసి, అంతకుముందు కాంగ్రెస్ ముఖ్యమంత్రి దేవరాజ్ అర్స్ దీర్ఘకాల రికార్డును అధిగమించారు. రెండు పర్యాయాలు – 2008 నుంచి 2013 వరకు, తిరిగి 2019 నుంచి 2023 వరకు ప్రతిపక్ష నాయకునిగా పనిచేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఇచ్చింది. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తనకు లభించిన అవకాశాలకుగాను సిద్ధరామయ్య గురువారంనాడు పత్రికాగోష్టిలో సోనియాగాంధి, రాహుల్‌గాంధిలకు పలుమార్లు ధన్యవాదాలు తెలియజేయటం ఆయన సంతృప్తికి, విధేయతకు నిదర్శనం. ముఖ్యమంత్రి పదవి మార్పుపై దాదాపు సంవత్సరకాలంగా పలు దఫాలు కాంగ్రెస్ అధిష్టానం ఆధ్వర్యంలో సంభాషణలు జరిగినప్పటికీ ఉపముఖ్యమంత్రి శివకుమార్ ఎన్నడూ తన ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య నొచ్చుకునే విధంగా మాట్లాడిన సందర్భం లేదు. గురువారం అల్పాహార విందు సందర్భంగా కూడా శివకుమార్ సిద్ధరామయ్య పాదాలకు నమస్కరించి, ఆత్మీయ ఆలింగనం చేసుకోవటం ఆయన చూపే గౌరవానికి ప్రతిబింబం. రెండు బలమైన గ్రూపుల కూర్పుతో కూడిన మంత్రివర్గం సజావుగా పనిచేయటానికి, 2028 ఎన్నికల్లో మతోన్మాద బిజెపికి అవకాశమివ్వకుండా కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ఈ సఖ్యత, సామరస్యం ఎంతో అవసరం. ●



## భారత్‌లో నాకు మద్దతు ఎక్కువ

ఇండియాలో నాకు మద్దతు ఎక్కువగా ఉంది. ఫాలోవర్లు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. భారత్ మాకు కీలకమైన భాగస్వామి. ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఇజ్రాయెల్‌ను వేరుగా చూస్తున్నాయి. కానీ భారత్‌లో మాత్రం మాకు మంచి గుర్తింపు ఉంది. భారత్‌లో ఇజ్రాయెలీలకు అమితమైన ప్రేమ ఉంది. ఇతర దేశాల కన్నా ఇండియాలో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు.

- ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ

## ఔషధ రంగంలో అక్రమాలు- సమాజానికి పెనుముప్పు

ఒకప్పుడు మెడికల్ షాపు అంటే ప్రజలకు నమ్మకం. జ్వరం వచ్చినా, చిన్న అనారోగ్యం వచ్చినా, డాక్టర్ తరువాత ప్రజలు విశ్వసించిన ప్రదేశం మందుల దుకాణమే. ఆ దుకాణంలో అడుగుపెడితే డెట్టాల్, స్పిరిట్, మందుల వాసనలు మనసుకు ఓ భరోసా కలిగించేవి. అర్హత కలిగిన బి.ఫార్మసీ, డి.ఫార్మసీ చదివిన వ్యక్తులే మందులు ఇచ్చేవారు. ఒక నియంత్రణ ఉండేది. ఒక క్రమశిక్షణ ఉండేది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మెడికల్ షాపులు ప్రతి వంద మీటర్లకు ఒకటి కనిపిస్తున్నాయి. అర్హతలేని వ్యక్తులు ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. ఫార్మసిస్టు లేని షాపుల్లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నిద్రమాత్రలు, షెడ్యూల్ ఎచ్ మందులు చాక్లెట్లలా అమ్ముతున్నారు. ప్రిస్క్రిప్షన్ అడగడం లేదు. బిల్లు ఇవ్వడం లేదు. ఇది కేవలం చట్ట ఉల్లంఘనే కాదు – ప్రజల ప్రాణాలతో చేసే ప్రమాదకర వ్యాపారం. ఫార్మసీ విద్యను అభ్యసించిన వేలాది యువతకు నేడు సరైన గౌరవం, ఉపాధి, భద్రత దక్కడం లేదు. అనేక చోట్ల ఫార్మసిస్టుల సర్టిఫికెట్లను నెలకు కొన్ని వేల రూపాయలకు అద్దెకు తీసుకుని దుకాణాలు నడుపుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. షాపు బోర్డుపై ఫార్మసిస్టు పేరు ఉంటుంది కానీ లోపల మందులు ఇచ్చేది అనుభవం లేని వ్యక్తే. ఇది ప్రజారోగ్యానికి అతిపెద్ద ముప్పు. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే, కొన్ని ప్రాంతాల్లో ఫార్మసిస్టు మరణించిన తర్వాత కూడా వారి లైసెన్సులను కొనసాగిస్తూ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు రావడం. ఇది కేవలం అక్రమం కాదు, మానవత్వానికే అవమానం. మరోవైపు ఫార్మసీ రంగంలో పనిచేసే ఉద్యోగులకు సరైన జీతాలు, పీఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, ఆరోగ్య భద్రత వంటి కనీస హక్కులు కూడా లభించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో మెడికల్ షాపులపై నమ్మకం తగ్గుతోంది. అందుకే చాలామంది ఆన్‌లైన్ మెడిసిన్ యాప్స్, ఇంటర్నెట్ సలహాలు, ఏఐ ఆధారిత సమాచారంపై ఆధారపడుతున్నారు. కానీ అక్కడ కూడా ప్రమాదాలు లేకపోలేదు. డాక్టర్ సలహా లేకుండా మందులు వాడటం, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం, స్వీయ వైద్యం వంటి సమస్యలు మరింత పెరుగుతున్నాయి. ఇది భవిష్యత్తులో ఆరోగ్య విపత్తుకు దారితీయొచ్చు. ఇతర రాష్ట్రాలను పరిశీలిస్తే పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఫార్మసిస్టులకు గౌరవప్రదమైన జీతాలు, క్రమబద్ధమైన విధానాలు అమలులో ఉన్నాయి. విదేశాల్లో అయితే అర్హత కలిగిన ఫార్మసిస్టు లేకుండా మెడికల్ షాపు నడవడం అసంభవం. అక్కడ ప్రిస్క్రిప్షన్ లేకుండా సాధారణ మందు కూడా ఇవ్వరు. మన దేశంలో మాత్రం నియంత్రణలు క్రమంగా బలహీనపడుతున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి.

ప్రస్తుతం అవసరం ఏమిటంటే ఔషధ రంగంలో సమగ్ర సంస్కరణలు. ప్రతి మెడికల్ షాపులో అర్హత కలిగిన ఫార్మసిస్టు తప్పనిసరిగా ఉండాలి. బయోమెట్రిక్ హాజరు, సిసిటివి పర్యవేక్షణ, కఠిన తనిఖీలు ఉండాలి. షెడ్యూల్‌ఎచ్ మందుల విక్రయంపై కఠిన నియంత్రణ అవసరం. నకిలీ మందులపై ప్రత్యేక దళాలు పనిచేయాలి. ఫార్మసిస్టుల సంక్షేమానికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి హక్కులు తప్పనిసరి చేయాలి.

మందు అనేది ప్రాణాలను కాపాడేదిగా ఉండాలి గానీ ప్రాణాలు తీసేదిగా మారకూడదు. ఫార్మసిస్టు అనేది కేవలం ఒక సర్టిఫికెట్ కాదు – అది ప్రజారోగ్య బాధ్యత. ప్రభుత్వాలు, డ్రగ్ కంట్రోల్ అధికారులు, సమాజం ఇప్పటికైనా మేల్కొనాలి. లేదంటే రేపు నకిలీ మందుల బారిన పడేది సామాన్య ప్రజలే కాదు – ప్రతి కుటుంబం కావచ్చు. ప్రజల ఆరోగ్యం మీద రాజీపడే సమాజం ఎప్పటికీ అభివృద్ధి చెందదు. కాబట్టి లాభంకోసం మందులు అనే ధోరణి ముగిసి, ప్రజల ప్రాణాల కోసం వైద్యం అనే విలువ తిరిగి రావాల్సిన సమయం ఆసన్నమైంది.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,

## ప్రపంచ శాంతి, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలో

# అయిప్సో 75 ఏళ్ళ మహోజ్జ్వల ప్రస్థానం



పల్లభ్ సేన్‌గుప్తా
ప్రెసిడెంట్, వరల్డ్ పీస్ కౌన్సిల్

ప్రపంచ శాంతి, సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావం, ప్రజాస్వామ్యం, మానవ గౌరవం అనే ఆశయాలకు అంకితమైన అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం (అయిప్సో) 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ మైలురాయి కేవలం వేడుక చేసుకునే సందర్భం మాత్రమే కాదు. ఇది 1951వ సంవత్సరం మే 14న దీని స్థాపనకు స్ఫూర్తినిచ్చిన ఆదర్శాల పట్ల ఆత్మపరిశీలన, పునరుద్ఘాటన, పునరుత్తేజంతో కూడిన నిబద్ధతకు సైతం ఒక సందర్భం.

భారతదేశ వలస పాలన వ్యతిరేక స్వాతంత్ర్య పోరాట అత్యుత్తమ సంప్రదాయాలను అయిప్సో సగర్వ వారసత్వంగా పొందింది. ఒంటరిగా స్వాతంత్ర్య సంగ్రామాన్ని నిర్వహించలేమని మన జాతీయ విమోచన ఉద్యమం అనేక తరాల భారతీయులకు బోధించింది. ప్రపంచంలో ఎక్కడైనా వలసవాదం, అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటం, ప్రతి చోటా న్యాయం, సమానత్వం, స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటంతో విడదీయరానిదిగా ఉంటుంది. అంతర్జాతీయ సంఘీభావం స్వతంత్ర భారతదేశపు ప్రజాస్వామ్య, ప్రగతిశీల చైతన్యంలో ఒక అంతర్భాగంగా మారింది. అయిప్సో ఆవిర్భావం ఒక చారిత్రాత్మక అంతర్జాతీయ సందర్భంలో జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజం ఓటమి, సోవియట్ యూనియన్ చేసిన వీరోచిత త్యాగాలు, సామ్యవాద దేశాల ఆవిర్భావం, అణ్వాయుధాలకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రపంచ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం ఒక బలమైన ఆకాంక్షను సృష్టించాయి. హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణు బాంబు దాడుల ఫలితంగా చోటుచేసుకున్న భయంకరమైన విధ్వంసం, అణుయుద్ధం క్రూరత్వాన్ని బహిర్గతం చేసి, మరో ప్రపంచ విపత్తును నివారించాలనే శాంతికాముక ప్రజల సంకల్పాన్ని బలపరిచింది. అదే సమయంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని వలస ప్రజలు సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారు.

ఈ వాతావరణంలోనే 1951లో ప్రముఖ దేశభక్తులు, మేధావులు, కళాకారులు, రాజకీయ నాయకులు ఏకమై అఖిల భారత శాంతి మండలి (ఆల్ ఇండియా పీస్ కౌన్సిల్)ను ఏర్పాటు చేశారు. ఇది తరువాతి కాలంలో అఖిల భారత శాంతి, సంఘీభావ సంస్థ (అయిప్సో)గా రూపాంతరం చెందింది. డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, అరుణా అసఫ్ అలీ, అజయ్ ఘోష్, ఎ. కె. గోపాలన్, డి. డి. కోసాంబి, బల్ రాజ్ సాహ్ని, పృథ్వీరాజ్ కపూర్, వి. కె. కృష్ణ మీనన్, ముల్క్ రాజ్ ఆనంద్ వంటి ప్రముఖులు ఈ చారిత్రాత్మక ఘట్టానికి పునాది వేయడంలో సహాయపడ్డారు.

దశాబ్దాలుగా అయిప్సో భారతదేశంలోని అత్యంత బలమైన శాంతి, సంఘీభావ ఉద్యమాలలో ఒకటిగా ఆవిర్భవించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా అణగారిన ప్రజలకు, జాతీయ విమోచన పోరాటాలకు నిరంతరం అండగా నిలిచింది. అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా వీరోచిత వియత్నాం ప్రజలు జరిపిన పోరాటానికి మద్దతుగా అయిప్సో పెద్ద ఎత్తున సంఘీభావాన్ని సమీకరించింది. అయిప్సో బంగ్లాదేశ్ విమోచన పోరాటానికి మద్దతు ఇచ్చింది. క్యూబాపై సామ్రాజ్యవాద దురాక్రమణ యత్నాలకు వ్యతిరేకంగా గళం విప్పింది. దక్షిణాఫ్రికాలోని వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమానికి బలమైన అండగా నిలిచింది. సహారావీ ప్రజల పోరాటానికి మద్దతు ఇచ్చింది. స్వతంత్ర మాతృభూమి కోసం పాలస్తీనా ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అచంచలమైన సంఘీభావం అందించింది. నేటికీ పాలస్తీనా ప్రజల అభేద్యమైన హక్కుల కోసం, దేశాల మధ్య, ముఖ్యంగా దక్షిణాసియా దేశాల మధ్య శాంతి, స్నేహం కోసం, క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా నిరోధాన్ని వ్యతిరేకిస్తూ అయిప్సో ప్రచారోద్యమాన్ని కొనసాగిస్తోంది.

మహోన్నత వ్యక్తులలో ఒకరైన అయిప్సో వ్యవస్థాపక సభ్యుడైన రమేశ్ చంద్ర చేసిన సేవలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచ శాంతి సంఘం ఛైర్మన్‌గా, ప్రచ్ఛన్న యుద్ధంలోని అత్యంత క్లిష్టమైన దశాబ్దాలలో అంతర్జాతీయ శాంతి ఉద్యమాన్ని విస్తరించడంలో,బలోపేతం చేయడంలో రమేశ్ చంద్ర అసాధారణ పాత్ర పోషించారు. సామ్రాజ్యవాద యుద్ధాలు, వలస ఆక్రమణ, జాత్యహంకారం, అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ఆయన నేతృత్వంలో ప్రపంచ శాంతి సంఘం ఖండాలవ్యాప్తంగా లక్షలాది మందిని ఏకం చేసే ఒక శక్తివంతమైన వేదికగా మారింది. ఆయన అవిశ్రాంత కృషి, శాంతి ఆశయాన్ని జాతీయ విమోచన, సామాజిక న్యాయం, ఆర్థిక సార్వభౌమత్వం కోసం జరిగే పోరాటాలతో జత చేసింది. ఆయన భారతదేశంలోనూ, విదేశాలలోనూ అనేక తరాల కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చారు. అంతర్జాతీయంగా భారత శాంతి ఉద్యమం ప్రతిష్టను, ప్రభావాన్ని పెంపొందించడానికి గణనీయంగా దోహదపడ్డారు.





అయిప్సో స్థాపించి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ, దాని శక్తి, ప్రాముఖ్యత ఇంకా పెరుగుతూనే ఉంది. ఈ సంస్థ శాంతి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, అణగారిన ప్రజల హక్కులకు సంబంధించిన సమస్యలను నిరంతరం లేవనెత్తుతూ వస్తోంది. అయిప్సో సమావేశాలు, సెమినార్లు, సంఘీభావ ప్రచారాలు, జన సమీకరణలు ఈ ఉద్యమ నిరంతర చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి. అదే సమయంలో సమకాలీన ప్రపంచం తీవ్రమైన, అపూర్వమైన సవాళ్లను విసురుతోంది. విజ్ఞాన, సాంకేతిక రంగాలలో పురోగతి సాధించినప్పటికీ, మానవాళి యుద్ధం, ఆకలి, అసమానత, దోపిడీలతో బాధపడుతూనే ఉంది. సామ్రాజ్యవాద జోక్యాలు, సైనిక కూటములు, దురాక్రమణ యుద్ధాలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి. అణ్వాయుధాలు మానవ నాగరికతకు ప్రమాదంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక ఆధిపత్యం, వనరులపై నియంత్రణ కోసం జరిగే పోటీ ప్రాంతాల వారీగా సంఘర్షణలను తీవ్రతరం చేశాయి. జాతివివక్ష, మతతత్వం, మత ఛాందసవాదం, మెజారిటీ రాజకీయాలు సమాజాలను విషపూరితం చేస్తూ, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తున్నాయి. ప్రస్తుత కాలంలో భారతదేశం కూడా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. మన సమాజంలోని లౌకిక స్వరూపం విభజనవాద, మతతత్వ శక్తుల వల్ల ఒత్తిడికి గురవుతోంది. ప్రజాస్వామ్యం, సమానత్వం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలు అంతకంతకూ దాడికి గురవుతున్నాయి. విద్వేష రాజకీయాలు ప్రజలను మత, కుల ప్రాతిపదికన విభజించడానికి ప్రయత్నిస్తాయి. ఆర్థిక అసమానతలు పెరుగుతుండగా, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల హక్కులు హరించుకుపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో అయిప్సోను బలోపేతం చేయాల్సిన కర్తవ్యం మరింత అత్యవసరంగా మారింది. నేటి శాంతి పరిరక్షణను, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ విలువల పరిరక్షణ నుండి వేరు చేయలేము. సమాజంలోని అన్ని వర్గాలలో, ముఖ్యంగా యువతలో అయిప్సో తన కార్యకలాపాలను విస్తృతం చేయాలి. మత విద్వేషం, నిరంకుశత్వం, సైనికవాదం, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా శాంతికాముకులైన, ప్రజాస్వామ్య, దేశభక్తి కలిగిన శక్తుల మధ్య విస్తృత ఐక్యతను నిర్మించాలి. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలను నూతన సంకల్పంతో పరిరక్షించాలి.

శాంతి,సంఘీభావం అనే ఆశయం చుట్టూ ఏకమైన ప్రజలు సంఘటనల గమనాన్ని ప్రభావితం చేయగలరని అయిప్సో చరిత్ర నిరూపిస్తుంది. ఈ సంస్థ 75 సంవత్సరాల ప్రస్థానం అంతర్జాతీయవాదం, సామూహిక కార్యాచరణ శాశ్వత శక్తికి నిదర్శనం. హింస, అసహనం, పెరుగుతున్న ప్రపంచ అస్థిరతతో నిండిన ఈ యుగంలో, శాంతి, సంఘీభావం, సహకారం అనే సందేశం మునుపెన్నడూ లేనంతగా ప్రాసంగికత కలిగి ఉంది.

ఈ చారిత్రక వార్షికోత్సవం సందర్భంగా, దశాబ్దాల త్యాగం, పోరాటం ద్వారా ఈ ఉద్యమాన్ని నిర్మించి, పోషించిన వారందరికీ మేము నివాళులర్పిస్తున్నాము. శాంతి, ప్రజాస్వామ్యం, మానవ విముక్తి పతాకాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి వారి వారసత్వం మనకు స్ఫూర్తినిస్తుంది.

అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం 75వ వార్షికోత్సవం ఒక నూతన కార్యాచరణకు పిలుపుగా నిలవాలి. భారతదేశం నలుమూలల ఉన్న శాంతికాముక ప్రజలందరూ ఏకమై ఈ చారిత్రక ఉద్యమాన్ని బలోపేతం చేయాలి. తద్వారా మనమందరం కలిసి మన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవచ్చు. మన సమాజంలోని లౌకిక, ప్రజాస్వామ్య స్వరూపాన్ని కాపాడుకోవచ్చు. సామ్రాజ్యవాదాన్ని, యుద్ధాన్ని వ్యతిరేకించవచ్చు. శాంతి, న్యాయం, సంఘీభావం, మానవ సౌఖ్యంపై ఆధారపడిన ప్రపంచం కోసం కృషి చేయవచ్చు.

**(ఈ నెల 14న అయిప్సో 75వ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా)**

# ఆర్థిక వ్యవస్థ గర్భంలో యుద్ధం!



మారుపాక అనిల్ కుమార్
9440482429

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే యుద్ధాలు కేవలం సరిహద్దుల మధ్య జరిగే సైనిక ఘర్షణలే కావు. ప్రతి యుద్ధం వెనుక ఒక ఆర్థిక ప్రయోజనం, ఒక మార్కెట్ ఆధిపత్యం, ఒక వనరుల దోపిడీ దాగి ఉంటుంది. ఆధునిక ప్రపంచంలో ఆర్థిక యుద్ధం అనేది గోళీలు, బాంబులు లేకుండానే దేశాలను బలహీనపరచే కొత్త రూపంగా మారింది. నేడు ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న పోటీ – డాలర్ ఆధిపత్యం, చమురు మార్కెట్లు, కార్పొరేట్ నియంత్రణ, రుణ విధానాలు, వాణిజ్య ఒప్పందాలు – ఇవన్నీ మన ఆర్థిక వ్యవస్థ గర్భంలో నడుస్తున్న యుద్ధాలే. ఈ యుద్ధం ప్రభావం సామాన్య ప్రజల జీవితాలపై తీవ్రంగా పడుతోంది.

**యుద్ధాల వెనుక ఆర్థిక ప్రయోజనాలు** :చరిత్రలో జరిగిన అనేక యుద్ధాలకు మూల కారణం సంపదల స్వాధీనం. వలస పాలకులు ఆసియా, ఆఫ్రికా దేశాలను ఆక్రమించింది మానవత్వం కోసం కాదు; అక్కడి సహజ వనరులు, బంగారం, మసాలాలు, ఖనిజ సంపదల కోసం. బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని పాలించిన కాలంలో భారత సంపదను దోచుకుని తమ పరిశ్రమలను అభివృద్ధి చేసుకున్నారు. భారతదేశంలో ఉన్న చేతివృత్తులు, స్థానిక పరిశ్రమలు క్రమంగా నాశనమయ్యాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ రాజకీయాల్లో అమెరికా, యూరప్, రష్యా, చైనా వంటి శక్తివంతమైన దేశాలు ప్రపంచ మార్కెట్లపై ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నాయి. ఇప్పటి యుద్ధాలు తుపాకులతో మాత్రమే జరగడం లేదు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ వంటి ఆర్థిక సంస్థల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలపై రుణాల పేరుతో ఒత్తిడి పెడుతున్నారు. దేశాల ఆర్థిక విధానాలను కూడా కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్పిస్తున్నారు. ఒకదేశం అప్పుల్లో చిక్కుకుంటే, దాని ఆర్థిక స్వాతంత్ర్యం కూడా క్రమంగా దెబ్బతింటుంది.

**పెరుగుతున్న ధరలు — ప్రజలపై ఆర్థిక దాడి :** భారతదేశంలో సామాన్య ప్రజల జీవితాలపై ఆర్థిక యుద్ధం స్పష్టంగా కనిపిస్తోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి ప్రతి వస్తువు ధర పెరుగుతోంది. మార్కెట్లో కూరగాయల నుండి విద్యుత్ బిల్లుల వరకు ప్రతిదీ భారంగా మారింది. ద్రవ్యోల్బణం పెరిగినా కార్మికుల జీతాలు మాత్రం అదే స్థాయిలో ఉండిపోతున్నాయి.రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, ఆయిల్ ఇవి అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. కానీ రైతు పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర రావడం లేదు. అప్పుల భారం, ప్రకృతి విపత్తులు, మార్కెట్ అస్థిరత రైతులను ఆత్మహత్యల దిశగా నెడుతున్నాయి. ఒకవైపు కార్పొరేట్ వ్యవసాయ విధానాలు పెరుగుతుండగా, మరోవైపు చిన్న రైతు జీవితం సంక్షోభంలో పడుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది ప్రజల జీవన హక్కులపై జరుగుతున్న మౌన యుద్ధం.

**కార్పొరేట్ ఆధిపత్యం — ప్రజా సంపదల స్వాధీనం:** ఇటీవలికాలంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వేగంగా జరుగుతోంది. బ్యాంకులు, విమానాశ్రయాలు, గనులు, పోర్టులు, రైల్వేలు, విద్యుత్ రంగాలు క్రమంగా కార్పొరేట్ వర్గాల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్రజల పన్నులతో నిర్మించిన సంస్థలు కొద్దిమంది వ్యాపారవేత్తల లాభాల సాధనంగా మారుతున్నాయి. ప్రైవేటీకరణ వల్ల సేవల ధరలు పెరుగుతాయి. విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక అవసరాలు కూడా వ్యాపార వస్తువులుగా మారిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడి, ప్రైవేట్ విద్యాసంస్థలు భారీ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కొరత ఉండగా, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలపై లక్షల రూపాయల భారం మోపుతున్నాయి.చిన్న వ్యాపారులు, చేతివృత్తిదారులు నష్టపోతుండగా, ఈకామర్స్ దిగ్గజాలు మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి. స్థానిక కిరాణా దుకాణాలు మూతపడుతున్నాయి. చేతివృత్తులు క్షీణిస్తున్నాయి. ఇది కూడా ఆర్థిక యుద్ధంలో భాగమే.

**నిరుద్యోగం – యువతపై మానసిక యుద్ధం:**దేశంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. లక్షలాది మంది యువకులు పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్నా, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలు తగ్గిపోతున్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలు పెరగడంతో ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది.యువతలో నిరాశ, ఆత్మవిశ్వాస లోపం పెరుగుతోంది. ఒక కుటుంబం పిల్లల చదువుకు అప్పులు చేసి, చివరకు ఉద్యోగం రాకపోతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుంగిపోతుంది. నిరుద్యోగం కేవలం ఉద్యోగం లేకపోవడం కాదు; అది మానసిక ఒత్తిడి, కుటుంబ సంక్షోభం, సామాజిక అస్థిరతకు కారణమవుతోంది. ఒకవైపు కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు ఇస్తూ, మరోవైపు సంక్షేమ పథకాలపై కోతలు విధించడం ప్రజల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తోంది. భారతదేశంలో ఆర్థిక అసమానత కేవలం ధనిక–పేద మధ్యే కాదు; అది కుల ఆధారంగా కూడా నిర్మితమైంది. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు ఇప్పటికీ భూమి, విద్య, ఉపాధి అవకాశాల నుండి దూరంగా ఉన్నారు. శతాబ్దాలుగా కొనసాగిన కుల ఆధిపత్యం వల్ల సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది.

రిజర్వేషన్లపై దాడులు, ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల వెనుకబడిన వర్గాల అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం కూడా సామాజిక అసమానతను పెంచుతోంది.సామాజిక న్యాయం లేకుండా ఆర్థిక సమానత్వం సాధ్యం కాదు. కాబట్టి ఆర్థిక వ్యవస్థలోని యుద్ధం కుల ఆధిపత్యంతో కూడా ముడిపడి ఉంది. దళితులు, ఆదివాసీలు ఆర్థిక స్వావలంబన సాధించకుండా అడ్డుకునే విధానాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.ప్రజల అసలు సమస్యలైన నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సంక్షోభం నుండి దృష్టి మళ్లించడానికి మత విద్వేషాలు, జాతి భావోద్వేగాలు రెచ్చగొట్టబడుతున్నాయి. మీడియా కూడా కార్పొరేట్ నియంత్రణలో ఉండటంతో ప్రజా సమస్యలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు.టెలివిజన్ చర్చల్లో ప్రజల ఆర్థిక సమస్యల కంటే మత వివాదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.మతం పేరుతో ప్రజలను విభజిస్తూ, ఆర్థిక దోపిడీని దాచిపెట్టడం నేటి పాలక వర్గాల ప్రధాన ఆయుధంగా మారింది. ప్రజలు తమ అసలు సమస్యలను మర్చిపోయేలా భావోద్వేగ రాజకీయాలు నడపడం ప్రమాదకర ధోరణి.

**ప్రత్యామ్నాయం — ప్రజా కేంద్రిత ఆర్థిక విధానాలు:** ఈ ఆర్థిక యుద్ధానికి ప్రత్యామ్నాయం ప్రజా కేంద్రిత ఆర్థిక విధానాలే. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి. రైతులకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలి. నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలు వేగంగా చేపట్టాలి.విద్య, వైద్యం పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉండాలి.

కార్పొరేట్ దోపిడీపై నియంత్రణ అవసరం. పన్నుల వ్యవస్థలో సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించి, భారీ సంపద కలిగిన వర్గాలపై అధిక పన్నులు విధించాలి.దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు భూమి, విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలి. సబ్‌ప్లాన్ నిధులను కచ్చితంగా అమలు చేయాలి. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజల ఐక్య పోరాటాల ద్వారా ఈ ఆర్థిక యుద్ధాన్ని ఎదుర్కోవచ్చు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, దళితులు కలిసి ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉంది.

**ముగింపు:**మన దేశంలో నడుస్తున్న సంక్షోభం కేవలం ఆర్థిక సమస్య కాదు; అది సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నింటినీ ప్రభావితం చేస్తున్న యుద్ధం. బుల్లెట్లు వినిపించకపోయినా, ధరల పెరుగుదలతో, నిరుద్యోగంతో, ప్రైవేటీకరణతో, అసమానతలతో ప్రజల జీవితం ముక్కలవుతోంది. ఈ యుద్ధాన్ని గుర్తించడం, దాని అసలు స్వరూపాన్ని ప్రజలకు తెలియజేయడం, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాటం చేయడం అత్యవసరం. ప్రజల అవసరాలు కేంద్రంగా పెట్టిన ఆర్థిక విధానాల ద్వారానే సమానత్వం, సామాజిక న్యాయం, నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. లేకపోతే ఆర్థిక వ్యవస్థ గర్భంలో నడుస్తున్న ఈ యుద్ధం మరింత తీవ్రమై, సామాన్య ప్రజల జీవితాలను మరింత సంక్షోభంలోకి నెడుతుంది.

## తెలుగు సమాజం గర్వించదగిన మహనీయుడు

# సురవరం ప్రతాపరెడ్డి

### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతి వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి అని, నిజాం పాలనలో తెలుగు మాట్లాడడానికే భయపడుతున్న రోజుల్లో గోలకొండ పత్రికను స్థాపించి, ప్రజలను చైతన్య పరిచేందుకు విశేషంగా కృషి చేశారని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు జాతి వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి 130వ జయంతి ఉత్సవాలు సాహితీ వైజయంతి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లోని సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో గురువారం జరిగాయి. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డికి సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య పురస్కారాన్ని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రదానం చేశారు. సభలో ముఖ్య అతిథులుగా ముప్పవరపు వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, శాంతా వసంతా ట్రస్ట్ వ్యవస్థాపకులు, పద్మ భూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత రెడ్డి పాల్గొన్నారు. సభకు ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షతన వహించారు. తొలుత సురవరం ప్రతాప రెడ్డి చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ తెలుగుజాతిని ప్రభావితం చేసిన వారిలో అత్యంత ప్రముఖులు సురవరం ప్రతాప రెడ్డి అని కొనయాడారు. తెలుగు జాతి వైతాళికులు అనగానే కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, సురవరం ప్రతాప రెడ్డి గుర్తుకు వస్తారన్నారు. సాహిత్యంపై మక్కువ, చరిత్రపై పట్టుదల కలిసినప్పుడు ఆయన గోల్కొండ కవుల సంచిక అనే అపూర్వ గ్రంథాన్ని వెలువరించారని తెలిపారు. తెలంగాణలో కవులు లేరని కొందరు అన్నప్పుడు ఆయన ఆ మాటకు సమాధానం అక్షరాల్లో రాసి చూపారని, మొత్తం 354 మంది కవుల జీవిత విశేషాలను సేకరించి, వారిని ప్రపంచానికి పరిచయం చేశారంన్నారు. అది కేవలం పుస్తకం కాదని, తెలంగాణ సాహిత్యానికి అద్దం పట్టిన చరిత్ర అని కొనియాడారు. ప్రస్తుత కాలంలో పత్రికలు (మీడియా రంగం) రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సత్యాన్ని తక్కువగా, అసత్యాన్ని ఎక్కువగా ప్రసారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా విలువలు క్షీణిస్తే, ప్రజాస్వామ్యం కూడా క్షీణిస్తుందని ఆయన హెచ్చరించారు. కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మొట్టమొదటిసారిగా సురవరం ప్రతాప రెడ్డి 1926లో 'గోలకొండ' అనే పత్రిక స్థాపించారన్నారు. తెలుగుకు ఆదరణ లేని రోజుల్లో తెలుగు పత్రికను స్థాపించడం పెద్ద విప్లవమని కొనియాడారు. తెలుగు వారు అనగానే గుర్తొచ్చే వారిలో సురవరం ప్రతాప రెడ్డి ముందు వరసలో ఉంటారన్నారు. ప్రతాప రెడ్డి కథనాలు, రచనలు, వ్యాసాలు తవ్వే కొద్ది వెలుగులోకి వస్తున్నాయన్నారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ నిజాం రాజుల పరిపాలనలో తెలుగుపై ఉన్న వివక్షతను పక్కనబెట్టి, తెలుగు జాతి సాంస్కృతిని దీవిటీలా వికసింపజేసిన మహనీయుడు సురవరం ప్రతాప రెడ్డి అన్నారు. ప్రతాప రెడ్డి లాంటి వారు యుగానికి ఒక్కరే పుడతారని పేర్కొన్నారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాప రెడ్డి పురస్కారాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిజాం నవాబుల చేతిలో బందియై చీకట్లో ఉన్న తెలంగాణను వెలుగులోకి నడిపిన మహానుభవుడు సురవరం ప్రతాప రెడ్డి అని అన్నారు. తెలంగాణ జాతిని నడిపించడానికి ఆయన తెలుగు వైతాళికుడు అయ్యాడని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



- 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సుదర్శన్ రెడ్డి

# పకడ్బందీగా 'సర్'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాలో చేర్చాలని, అదే సమయంలో అనర్హుల పేర్లను జాబితా నుంచి పూర్తిగా తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం త్వరలో రాష్ట్రంలో నిర్వహించబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుండి శుక్రవారం అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఇఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులు (డిఇఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఎఇఆర్ఓలు), బిఎల్ఓ (బిఎల్ఓలు) సూపర్‌వైజర్లు తదితర క్షేత్రస్థాయి అధికారుల బాధ్యతలను, అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని ఆయన నిశితంగా వివరించారు.

**చట్టపరమైన నిబంధనలు – సాంకేతికతపై అవగాహన**

శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నోడల్ అధికారి (ఎస్‌టిఎన్‌ఓ) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను, అమలు చేయాల్సిన వివిధ దశలను అధికారులకు వివరించారు. అనంతరం ఐటి ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ ఇసినెట్ మాడ్యూల్స్, ప్రిడ్రాఫ్ట్, పోస్ట్ డ్రాఫ్ట్ దశలు, బిఎల్ఓ యాప్ పనితీరు, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేసే విధానంపై సాంకేతిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు అడిగిన సందేహాలను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, డిప్యూటీ సిఇఓ కార్యాలయ రాష్ట్ర నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్'లో విధులు నిర్వహించే ఇఆర్ఒ,ఎఇఆర్ఒలకు

# ఒక నెల ప్రత్యేక వేతనం

### తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సెన్సిటీవ్ ఇంటెన్సీ రివిజన్) 'సర్'లో విధులు నిర్వహిస్తున్న ఓటరు నమోదు అధికారులు (ఇఆర్ఒ), సహాయ ఓటరు నమోదు అధికారులకు (ఎఇఆర్ఒ)ఒక నెల వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టిజిటిఎ) ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తరహాలోనే 'సర్'లో విధులు నిర్వహించే ఇఆర్ఒ, ఎఇఆర్ఒలకు ఒక నెల ప్రత్యేక వేతనం ఇవ్వాలని లచ్చిరెడ్డి కోరారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి బిఎల్ఒలు, సూపర్‌వైజర్లకు చెల్లించాల్సిన పారితోషికం ఇప్పటి వరకు కూడా అందలేదని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. భారత ఎన్నికల సంఘం సవరణ ప్రకారం పారితోషికం బిఎల్ఒలకు రూ.12వేలు, బిఎల్ఒ సూపర్‌వైజర్లకు రూ.18వేలు, ఎఇఆర్ఒలకు రూ.25వేలు, ఇఆర్ఒలకు రూ.30వేల చొప్పున చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంతో పాటు ఓటరు జాబితాకు సంబంధించిన ఇతర సందర్భాలలో పని చేస్తున్న బిఎల్ఒలు, సూపర్‌వైజర్లకు భారత ఎన్నికల సంఘం పారితోషికాన్ని పెంచిందని ఆయన గుర్తు చేఉశారు. అలాగే ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలకు కూడా పారితోషికాన్ని పెంచుతూ ప్రతిపాదించిందని లచ్చిరెడ్డి తెలిపారు. ఈ లెక్కల ప్రకారమే పారితోషికం, గౌరవ వేతనాల చెల్లించాలని, అందుకు తగిన అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. తాము ప్రస్తావించిన అంశాలపైన సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, సాధ్యమైనంత త్వరలోనే అన్ని అంశాలపైన సానుకూల నిర్ణయం వస్తుందని లచ్చిరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు రాధా, ప్రధాన కార్యదర్శి రమేష్‌పాక, ప్రతినిధులు రాణాప్రతాప్, హేమమాలిని, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలను ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా

# ప్రభుత్వం చరిత్రాత్మక చర్యలు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం అమలు చేస్తున్న మైక్రో అకడమిక్ ప్లానింగ్, వారాని ఒకసారి మాక్ టెస్టులను, ప్రత్యేక అకడమిక్ మానిటరింగ్, నిపుణులైన అధ్యాపకులు ఇచ్చిన ప్రత్యేక శిక్షణ వల్లనే ఫలితాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర ఎస్సి,ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇ ఐఎ స్) ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి 'సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ), నాన్‌సీఒఇ,ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను మంత్రి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.అర్.అంబేడ్కర్ సచివాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకు ల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారని గుర్తు చేశారు. మొత్తం అన్ని గ్రూప్‌లలో ఉన్న సీట్లలో 93.21 శాతం భర్తీ జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఎంపిసి గ్రూప్ 21,447, బైపిసి గ్రూపునకు 17,400, ఎంఇసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్టు మంత్రి అడ్లూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ఫేజ్1లో ఎంపికైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో జూన్ 7లోపు సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి వై.జె. విజయ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి (ఎఫ్‌ఎసి) కంభంపాటి శారద, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ మధు నాయక్, డిప్యూటీ సెక్రటరీ సహజ, సూపరింటెండెంట్ మృణాళిని, డిపిఒ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


| గ్రూపుల వారీగా సీట్ల భర్తీ వివరాలు | |
|---|---|
| ఎంపిసి | 8,440 సీట్లకు గాను 8,156 సీట్లు భర్తీ 96.63 శాతం, |
| బైపిసి | 8,280 సీట్లకు గాను 7,425 సీట్లు భర్తీ : 90.00 శాతం, |
| ఎంఇసి | 520 సీట్లకు గాను 377 సీట్లు భర్తీ : 72.00 (శాతం)% |
| సిఇసి | 1,520 సీట్లకు గాను 1,500 సీట్లు భర్తీ : 98.68 శాతం. |
| హెచ్ఇసి | 280 సీట్లకు గాను 257 సీట్లు భర్తీ : 98 శాతం, |
| వొకేషనల్ కోర్సు | 700 సీట్లకు గాను 686ర సీట్ల భర్తీ |



రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ (ఆర్‌టిఐ)గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్, జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌టిఐ ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పి.వి శ్రీనివాస్, దేశాల భూపాల్ తదితరులు.

# మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి మృతి

### పలువురు రాజకీయ నాయకులు సంతాపం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు గాదె వెంకట రెడ్డి (86) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరెడ్డి మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం ప్రకటించారు. 1940 జూలై 10వ తేదీన ప్రకాశం జిల్లా ఇంకొల్లు మం డలం పావులూరు గ్రామంలో జన్మించారు. ఎల్‌ఎల్‌బి పూర్తి చేసిన ఆయన రాజకీయాల్లోకి వచ్చి.. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో పర్చూరు ని యోజకవర్గం నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా రెండు సార్లు మద్దుకూరి నారాయణరావుపై పోటీ చేసి ఓట మి పాలయ్యారు. ఆ తర్వాత 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఓటమి పాలైన ఆయన 1991 ఉప ఎన్నికల్లో, 1994 సార్వత్రిక ఎన్నికల్లో పర్చూరు ఎంఎల్ఎగా విజయం సాధించా రు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎంఎల్‌ఏగా గెలిచి వైఎస్సార్, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయశాఖ మంత్రిగా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. 2016లో కాంగ్రెస్‌ను వీడి టిడిపిలో చేరిన వెంకటరెడ్డి 2020లో ఆ పార్టీకి కూడా రాజీనామా చేసి వైఎస్ఆర్‌సిపిలో చేరారు.

**సిఎం రేవంత్ రెడ్డి సంతాపం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి గారు మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిథ్యం వహించిన వెంకట్ రెడ్డి మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని సిఎం గుర్తు చేసుకున్నారు. సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచిన వెంకట్ రెడ్డి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వెంకట్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని, వెంకట్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

**టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన గాదె వెంకట్ రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాన్ని పొందారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మంత్రిగా సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు. ప్రజా సమస్యలపై లోతైన అవగాహన, విలువలతో కూడిన రాజకీయాలు, నిరాడంబర జీవనశైలి, అందరితో ఆత్మీయంగా మెలిగే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో అనుభవం, పరిపక్వత కలిగిన గాదె వెంకట్ రెడ్డి మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు.



## జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటనకె..

# 31న 'డిమాండ్ డే'

### ఆర్‌టిసి జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆర్‌టిసి విలీన అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని కోరుతూ మే 31 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి 'డిమాండ్ డే' పాటించాలని ఆర్‌టిసి జెఎసి పిలుపునిచ్చింది. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జెఎసి నాయకులు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల చిరకాల వాంఛను రాష్ట్రముఖ్యమంత్రి నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని, కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘంచే ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేయటం జరిగిందని, మే 1 వ తేదీన ముఖ్యమంత్రి కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో ముందుగా విలీనం కావాలో ఎన్నికలు కావాలో చెప్పాలని కోరగా కార్మిక సంఘాలన్నీ ఏక కంఠంతో ఎలక్షన్ల కంటే ముందు విలీనమే కావాలని వ్రాతపూర్వకంగా ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికులలో తీవ్ర గందరగోళం నెలకొన్నదని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కోకన్వీనర్ బి.యాదగిరిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎం.ఎస్.అలీ, డి.గోపాల్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, మనోహర్, ఎ.ఎస్.రెడ్డి, జనార్దన్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు రక్షణ ఏదీ?

### మోదీకి గుల్జార్ సింగ్ గోరియా సూటి ప్రశ్న!



**ఒంగోలు :** దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులకు రక్షణ లేకుండా పోతుందని, వారిపై బహిరంగంగా దాడులు చేయడమే కాకుండా హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు చేయడం లాంటివి పెరిగిపోతున్నాయని అన్నారు. ఉదాహరణకు మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరిగిన దాడులు, దుర్మార్గపు చర్యలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్న మోదీ మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఇలాంటి ఘటనలు దేశంలో చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్నాయని అన్నారు. బేటి పడావో బేటి బచావో అని సూక్తులు చెప్పి ఆడపిల్లలకు రక్షణ లేకుండా చేసారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో మాట్లాడారు. భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండవ రోజు ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ లో జరుగుతున్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన రిపోర్టును పెడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదరికం, నిరుద్యోగం ప్రపంచ దేశాల్లో భారత్ ను చిట్ట చివరిగా నిలిపిన ఘనత ఆయనదేనన్నారు. నెలకు ఒక వ్యక్తికి ఐదు కేజీల బియ్యం ఇచ్చినంత మాత్రాన పేదరికం రూపుమాపినట్లా అని ఆయన మోదీ ని ప్రశ్నించారు! మిగతా నిత్యవసర వస్తువులు ధరల మాట ఏమిటని, పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరల పెరుగుదలకు నిలకడ లేకుండా చేసి, ధరల పెరుగుదలకు కారణం అవుతున్నారని అన్నారు. పేదవాడు అన్ని రాష్ట్రాల్లో సరైన భోజనం తినలేకపోతున్నాడని అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా దళిత,గిరిజన వాడల్లో పెంచి పోషిస్తున్నారని, వారికి సరైన విద్య అందించి ఉద్యోగాలు కల్పించాల్సినటువంటి పరిస్థితి లేకుండా చేస్తున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు రక్షణ లేకుండా చేస్తూ, అడ్డు వచ్చిన గిరిజనులు, ఆదివాసీలపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. పేదవాడికి ఇంటి స్థలం కోసం ఇప్పటికీ ప్రభుత్వాలను అర్రులు చాచి అడగాల్సిన అవసరం వస్తున్నదని, ప్రభుత్వ భూములన్నీ ఆధానీ,అంబానీ లాంటి వ్యక్తులకు అప్పచెప్తున్నారని అన్నారు.వ్యవసాయ కార్మిక సంఘాన్ని ప్రతి గ్రామంలో యూనిట్లు ఏర్పాటు చేసి దళితులను, గిరిజనులను, మహిళలను,ఇతర పేదలను సంఘంలో చేర్చుకొని మన ఉద్యమాల్లో వారిని భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. రాజకీయాల్లో కూడా వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వార్డు మెంబర్లుగా, సర్పంచులుగా ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలుగా పోటీ చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు మనకెందుకు అని అనుకోకూడదు అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పరిపాలన సవ్యంగా జరగాలంటే మన సంఘం బలం పెరగాలన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో దళిత, గిరిజన వాడల్లో సరియైన మౌలిక వసతులు లేవు అని అన్నారు. మోడీ ఆర్భాటం తప్ప అభివృద్ధి లేదని ఆయన దుయ్యబట్టారు. దేశ వ్యాప్తంగా లక్షకు పైగా ప్రైమరీ పాఠశాలలు మూత పడ్డాయి.ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా వట్టి మాటలకే పరిమితమైందని, ప్రభుత్వ భూములు అన్ని కూడా పేదలకు భూ పంపిణీ చేయకుండా, పరిశ్రమల పేరుతో వృధా చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఇటీవల ఏప్రిల్ మాసంలో జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పాదయాత్ర కార్యక్రమం అనంతపురంలో జరిగిందని, ఇలాంటి ఉద్యమాలు దేశవ్యాప్తంగా జరగాలని, జి.రాం జి చట్టానికి వ్యతిరేకంగా పోరాడి రద్దు అయ్యే వరకు విశ్రమించకుడని అన్నారు. పాత చట్టం ప్రకారం పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించడానికి అవకాశం ఉంటుందని, కానీ చాలా రాష్ట్ర ప్రభుత్వాలు జి రాంజీ చట్టాన్ని సమర్థించడం దురదృష్టకరము అన్నారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు ఎన్ పెరియా స్వామి, సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా, బికేఎంయు జాతీయ కార్యదర్శి విఎస్ నిర్మల్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆర్ వెంకట్రావు, ఆర్ విజయ, బి కే ఎం యు జాతీయ కార్యవర్గ సభ్యులు టి వెంకట్రాములు, బీహార్ రాష్ట్ర కార్యదర్శి జానకి పాస్వాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సిహెచ్ ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, సి.సుబ్రహ్మణ్యం, టి.కృష్ణప్ప, కాబోతు ఈశ్వరరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్రము నుండి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు,అక్కపెల్లి బాపు,జాతీయ సమితి సభ్యులువిజయ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**నీటి పారుదల సర్కిల్, ఆర్మూర్.**
**టెండర్ నోటీస్**
టెండర్ నోటీసు నంబర్. 09/2026-27 తేదీ: 28.05.2026 రామన్నపేట (గ్రా), వెల్పూర్ (మండలం), నిజామాబాద్ (జిల్లా) ఉడిపి వాగు ఆనకట్ మరమ్మతులకిగాను రూ.36.84 లక్షలకు లభ్యమగు తేదీ: 28.05.2026 నుండి 04.06.2026 వరకు టెండర్ ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, నీటి పారుదల సర్కిల్, ఆర్మూర్.
DIPR R.O. No. : 3212-PP/CL/ADVT/2026-27, Date: 29-05-2026

**MALKAJGIRI MUNICIPAL CORPORATION :: L.B.NAGAR CIRCLE-13**
**OPEN TENDER CUM AUCTION NOTICE**

| | | | |
|---|---|---|---|
| వేలం నెంబర్. 03/ DC/ EEC-13/ LBNR/ MMC/ 2026-27, తేదీ: 29. 05. 2026 | యం.యం.సి, ఎల్.బి.నగర్, డివిజన్ నెం.13 పరిధిలో గల వార్డు నెం.41, హస్తినాపురం మోడల్ మార్కెట్టుకు చెందిన 8 షాపులకు సంబంధించి (8 షాపులలో SC-1, ST-1, SLF/TLF-1, మరియు జనరల్ కేటగిరీ-5 షాపులు కేటాయించటమయినది) అద్దె ప్రాతిపదికన ఇచ్చుటకు టెండర్-కమ్-బహిరంగ వేలం వేయుటకు, వేలం షెడ్యూల్ దరఖాస్తును డిప్యూటీ కమిషనర్ కార్యాలయము, ఎల్.బి.నగర్ సర్కిల్-13, యం.యం.సి నుండి పొందవచ్చును. | దరఖాస్తు స్వీకరణ తేదీ: 01-06-2026 మధ్యాహ్నం 03.00 గం.వరకు | టెండర్ షెడ్యూల్ ఫారం ఇచ్చుటకు తేదీ: 08/06/2026 నుండి తేదీ: 12/06/2026 మధ్యాహ్నం 03.00 గం. వరకు టెండర్ షెడ్యూల్ సీల్డ్ కవర్ స్వీకరణకు చివరి తేదీ: 17/06/2026 మధ్యాహ్నం 1.00 గం. వరకు. బహిరంగ వేలం మరియు టెండర్ తెరుచు తేదీ: 17/06/2026 మధ్యాహ్నం 03.00 గంటలకు. కమీషనర్, యం.యం.సి, హైదరాబాద్ వారి పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ (DD) Rs.160/- టెండర్ షెడ్యూల్ ధరను చెల్లించ వలెను. |

Sd/- Deputy Commissioner, L.B.Nagar Circle-13, MMC.
DIPR R.O. No. : 3207-PP/CL/ADVT/2026-27, Date: 29-05-2026

# తడిసిన ధాన్యంతో రైతులు.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

కొనుగోలు ప్రక్రియలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/ పానుగల్ :** వర్షాల వల్ల ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి తరలించడం జరుగుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పానుగల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో తడిసిన ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి పరిశీలించారు. అకాల వర్షాల వల్ల పెద్ద మొత్తంలో వరి ధాన్యం బస్తాలు తడిసిన నేపథ్యంలో వాటిని ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రధానంగా లారీల కొరత సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ఇసుక, ఫ్యాక్టరీల కోసం వినియోగించు లారీలన్నింటిని పట్టుకుని ధాన్యం తరలించడానికే తీసుకురావాలని ఆదేశించారు. ముందుగా వీపనగండ్ల , పానుగల్ పరిధిలోని కొనుగోలు కేంద్రాలకు లారీలను అత్యవసరంగా తరలించాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేతేపల్లి శివారులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి కొనుగోలు ప్రక్రియ ఆలస్యం చేయడంపై నిర్వాహకులపై మండిపడ్డారు. కొనుగోళ్లను వేగంగా చేపట్టి వెనువెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తే ఎవరిపై నైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో మిల్లర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవు అన్నారు. అనంతరం మెహ్రాన్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన మంత్రి ధాన్యం అన్‌లోడింగ్ పై పలు సూచనలు చేశారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. వీపనగండ్లలో ధాన్యం దించుకోవడానికి అనుకూలంగా ఉన్న గోదామును మరమ్మతుల కోసం మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్,చ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, జెడ్పిటిసి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము యాదవ్, బ్రహ్మం, పుల్లారావు, భాస్కర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం తరుగు లేకుండా కొనాలి

సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలంలో శుక్రవారం అకాల వర్షానికి కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, అందుబాటులో ఉన్న రైతు వేదికలకు ధాన్యాన్ని తరలించాలని సిపిఐ అనుబంధ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ డిమాండ్ చేశారు. సిపిఐ నేతలతో కలిసి బొల్లారంలో కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యంను పరిశీలించారు. కాంటా వేసిన ధాన్యంతో పాటు చేయని ధాన్యం కూడా వర్షానికి తడిసి ముద్దయిందన్నారు. కేంద్రాల్లో ధాన్యం పోసి నెల దాటినా లారీలు, మిల్లుల కొరత పేరుతో ధాన్యం కొనుగోలు జాప్యం సరికాదన్నారు. నెల రోజులుగా రైతులు కేంద్రాల్లో పగలు రాత్రి ధాన్యం కాపలా కాయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోదాములు మిల్లుల కొరత ఉంటే ప్రతి మండలంలో పెద్ద సంఖ్యలో ఉన్న రైతు వేదికలను ధాన్యం తరలించాలని, తరలింపుకు స్థానికంగా ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వాలన్నారు. హమాలీల కొరత ఉంటే రైతులే ధాన్యం తరలిస్తారని హామాలి చార్జీలు రైతులకే చెల్లించాలన్నారు. కేంద్రాల్లో ఇప్పటికే రెండు, మూడు సార్లు వర్షాలు వచ్చి ధాన్యం తడిసిందని, వర్షాలు కొనసాగే పరిస్థితి కనిపిస్తోందని ధాన్యం అరబెట్టడం, కాపలా రైతులకు కష్టంగా మారిందన్నారు. తడిసిన ధాన్యాన్ని తేమ పేరుతో కాంట, తరలింపు ఆపొద్దన్నారు. జిల్లాలో వారం రోజుల్లో ధాన్యం పూర్తిగా కొనకుంటే లేదంటే రైతులను సమీకరించి ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి చర్మారెడ్డి, సీనియర్ నేత వేమన్న తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా.. మట్టి తరలింపుపై ఆగ్రహం



**ప్రజాపక్షం/మాగనూర్:** మండల పరిధిలోని కొల్పూర్ గ్రామంలో గత పది రోజులుగా అక్రమ మట్టి , ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రోజుకు 20 నుంచి 30 ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున ట్రాక్టర్లు గ్రామ శివారు నుంచి మట్టిని తరలిస్తున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు సంబంధిత జీపీఓకు సమాచారం అందించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు సైతం మౌనం వహించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడమే కాకుండా, గ్రామంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నామయని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు అని గ్రామస్తులు వాపోయారు. అక్రమ రవాణాను అడ్డుకొని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పొలాల్లో అక్రమ మట్టి, రాళ్ల డంపింగ్

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటరామిరెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్:** నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్లు రైతులను నిర్లక్ష్యం చేస్తూ పంట పొలాల్లో దౌర్జన్యంగా కాలువల్లో తవ్విన మట్టి రాళ్లను. రైతులను ఎలాంటి సమాచారం లేకుండా వాళ్ల పంట పొలాల్లో డంపింగ్ చేయడంతో కాచ్వార్ గ్రామం రైతులు, భూ నిర్వాసితులు సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాంట్రాక్టర్లు అక్రమంగా డంపింగ్ చేస్తున్న పంట పొలాలను భూ నిర్వాసితుల సంఘం బృందం జిల్లా నాయకులు జి. వెంకరామిరెడ్డి, గోవింద్ రాజ్, చింతలి అంజప్పలు గురువారం పరిశీలించడం జరిగింది. భూసేకరణలో భాగంగా 20 మీటర్ల పరిధిలో కాలువ పనులు నిర్వహించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు పక్కనే ఉన్నటువంటి రైతుల భూములను అదనంగా 15 మీటర్ల దాకా ఆక్రమించుకోవడం జరిగిందని తెలిపారు. వర్షపు నీరు వెళ్లాల్సిన దగ్గర కాంట్రాక్టర్లు అడ్డంగా మొరం వేయడంతో రాఘవేందర్ రెడ్డి అనే రైతు మూడు ఎకరాల వరకు పంట పొలంలో నీళ్లు ఆగి వర్షాకాలం పంట వేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటయ్య గౌడ్ ప్రవీలమ్మ, వడ్డే శివరాములకు సంబధించిన ఆరు ఎకరాల భూమిలో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాలువల్లో తీసిన రాళ్లను, మట్టిని పొలాల్లో వేశారు. కాంట్రాక్టర్ల దౌర్జన్యం నిర్లక్ష్యం కారణంగా సాయి రెడ్డి, వెంకటేశ్వరమ్మ, గోపాల్, రెడ్డి అంజప్ప, మహేందర్, బాలప్పలు సుమారు 15 ఎకరాల తమ పంట పొలాల్లో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని. తక్షణమే కాంట్రాక్టర్ పై జిల్లా అధికారులు చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు ఇంత నిర్లక్ష్యంతో వ్యవహరించి రైతుల సమానాన్ని పరీక్షంచవద్దని ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి హెచ్చరించారు. రైతులకు న్యాయం చేయకపోతే కాంట్రాక్టర్లకు వ్యతిరేకంగా ఆందోళన వేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా గోవిందరాజు చింతల అంజప్ప మాట్లాడుతూ రైతులంతా ఏకమై కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని నిలదీయడానికి ముందుకు రావాలన్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే రైతులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## మక్తల్ ఎస్ఐగా పి.రాజు బాధ్యతలు




**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఎస్ఐ పి.రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు దామరగిద్ద ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి మక్తల్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఇంతకుముందు మక్తల్ ఎస్సైగా విధులు నిర్వహించిన భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి (విఆర్)బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై పి.రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌ని కార్యాలయంలో పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

## త్వరలో అందుబాటులోకి చిట్యాల–గజరందొడ్డి బ్రిడ్జి

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్:** పనులను వేగవంతం చేసి బ్రిడ్జిని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాల వద్ద నూతనంగా చేపడుతున్న చిట్యాల–గజరందొడ్డి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నిర్మాణ నాణ్యతను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనుల్లో వేగం పెంచాలని మంత్రి సూచించారు. వర్షాలకు ముందు బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు మరింత వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.గణేష్ కుమార్, ఆనంద్ గౌడ్, శివరాంరెడ్డి, నజీర్ పాషా, బీజేపీ నాయకులు చిట్యాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



**ప్రజాపక్షం/వంగూరు:** నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి వంగూరు గేట్ సమీపంలోని ఫర్టిలైజర్ షాపులను ఎస్సై మాధవ రెడ్డి తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ విత్తనాలు ఎరువులు విక్రయించిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. తప్పనిసరిగా షాప్ లో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని షాప్ యజమానులకు సూచించారు. రైతులకు నాణ్యమైన ఇన్ పుట్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులకు సన్మానం

**ప్రజాపక్షం/ పెబ్బేరు :** కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నూతన మండల సారథులుగా పెబ్బేరు పట్టణ అధ్యక్షుడిగా దయాకర్ రెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షుడిగా రామిరెడ్డి ని నియమించిన సందర్భంగా వనపర్తి జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గందం రాజశేఖర్ వారిని సన్మానించారు. పార్టీ పట్ల వినయ విధేయతలతో పార్టీ శ్రేణులందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, బునియాదిపురం నరేందర్, రాంపురం సత్యనారాయణ రెడ్డి, బాలరాజు, అయ్యవారిపల్లి లక్ష్మణ్ నాయుడు నాయకులు ఆషన్న, నాయుడు, బాలరాజు, రమేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

## ప్రాథమిక పాఠశాల భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

రూ.80 లక్షలతో అరబిందో ఫార్మా ఆధ్వర్యంలో హరిజనవాడ పాఠశాల నిర్మాణం

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత బజార్ బాదేపల్లి సిఎస్ఆర్ ఫౌండేషన్ (అరబిందో ఫార్మా) వారి సౌజన్యంతో నిర్మించనున్న హరిజనవాడ ప్రాథమిక పాఠశాల భవనానికి జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా తో పాటు అరబిందో ఫార్మా ప్రతినిధులతో కలిసి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య వాతావరణం కల్పించేందుకు సిఎస్ఆర్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నామని అన్నారు. హరిజనవాడలో నిర్మించనున్న ఈ నూతన పాఠశాల భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, అరబిందో ఫార్మా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ముఖ్య అతిథులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు పోలీసు గౌరవ వందనం ఏర్పాటు చేయాలని, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు., ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ సంక్షేమ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, మధు మోహన్, ఆర్డిఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏఓ భూపాల్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/ ఏదుల :** ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సుఖేందర్ రెడ్డి ని నియమించినందుకు ఆయన ఏదుల మండల అన్ని గ్రామాల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అధ్యక్షుడిగా నన్ను నియమించడం పట్ల నా హృదయం ఆనందంతో నిండిపోయింది. ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా ప్రజలకు, పార్టీకి మరింత దగ్గరగా పని చేసే అవకాశంగా భావిస్తున్నాను. నాపై విశ్వాసం ఉంచిన పార్టీ అధిష్ఠానం, మా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి కి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్య శీలారెడ్డి కి జిల్లా నాయకత్వానికి, ముఖ్యంగా నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేది సాధారణ కార్యకర్తకు గౌరవం ఇచ్చే పార్టీ అలాంటి పార్టీలో నాకు ఈ అవకాశం రావడం గర్వకారణం. ఇకపై మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలే నా అజెండా రైతులు కష్టాలు, యువత నిరుద్యోగం, మహిళల సమస్యలు, పేద ప్రజల ఇబ్బందుల పై నిరంతరం పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు గిట్టుబాటు ధరలు పెంచాలి



**ప్రజాపక్షం/ఉట్కూర్:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల (ఎంఎస్పీ) పెంపు రైతులకు సరిపోదని నిరసిస్తూ, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయూకేఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎంఎస్పీ ఆర్డర్ ప్రతులను దహనం చేశారు. అనంతరం సంఘం జిల్లా నాయకుడు సి.అంజప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 202627 సంవత్సరానికి 14 రకాల ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచినప్పటికీ, అది రైతుల ఉత్పత్తి వ్యయాలకు అనుగుణంగా లేదన్నారు. అధికారంలోకి రాకముందు స్వామినాధన్ కమిటీ సిఫారసుల ప్రకారం సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి వ్యయంపై ఆధారపడి ఎంఎస్పీ నిర్ణయిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఆ వాగ్దానాన్ని చేయడంలో విఫలమైందని విమర్శించారు. విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు, కూలీల విత్తనాలు, డీజిల్, విద్యుత్, సాగునీటి ఖర్చులు భారీగా పెరిగినా వాటిని పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా ఎ2+ ఎఫ్ఎల్ విధానం ప్రకారం ఎంఎస్పీ నిర్ణయించడం రైతులకు అన్యాయమని అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేపడుతున్నప్పటికీ కేం ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నబాలు, శీల కృష్ణయ్య, బొక్కి బాలకృష్ణ, కొల్లూరు జైపాల్, కొత్తగూడిసె నరసింహ, గుర్రాల నర్సింహులు, రైకల్ అంజప్ప, బోయ అంజప్ప, కప్పకండ్ల లక్ష్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/గద్వాల రూరల్:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుమోహన్ అన్నారు. శుక్రవారం ధరూరు మండలం భీంపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతంను పరిశీలించి ఎప్పటికప్పుడు తూ కం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జీలకు సూచించారు. లారీల కొరత లేకుం డా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపీఎంఎస్ ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చే యాలని, గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ధరూరు తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## వనపర్తిలో 31న బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి బహిరంగ సభ




**ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 31న ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో, బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి ఆధ్వర్యంలో '' 'ఎవరి కులం ఎంతో వారికంత వాటా' అనే నినాదంతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు జెఎసి వనపర్తి జిల్లా కన్వీనర్లు చిలుక బాల రాజ్ సాగర్, వీరపాగ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రాంతంలో వేల సంవత్సరాల నుండి కొనసాగుతున్న అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ వల్ల 90 శాతం జనాభా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి సబ్బండ కులాలు తరతరాలుగా దోపిడీకి గురవుతూ, బానిసలుగా బతుకుతూ తమ జీవితాలను ధ్వంసం చేసుకున్నారని ఆరోపించారు. మూడున్నర కోట్ల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టిల కటిక పేదరికం, అణిచివేత బద్దలు కావాలంటే ప్రజల్లో ఒక రాజకీయ భూకంపం రావాలని వారు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం సమరం సాగాలని, రాజ్యాధికార యుద్ధం రగిలించాలని, అదే అసలైన ప్రజాస్వామ్యానికి, గణతంత్ర రాజ్యానికి పునాది అవుతుందని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరాం లు కోరుకున్న బహుజన రాజ్యం స్థాపన కోసం ప్రజలంతా నడుం బిగించాలని కోరారు. ఈనెల 31న నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని జెఎసి నాయకులు అశోక్, కురుమన్న, కొండన్న యాదవ్ పిలుపునిచ్చారు.

## బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వంగూరు:** మండల పరిధిలోని నిజాంబాద్ గ్రామానికి చెందిన పెరమలి లింగమయ్య, ఆనంద్‌లు ద్విచక్ర వాహనంపై అచ్చంపేట నుండి వస్తుండగా ఉప్పునుంతల మండలం తిరుమలపూర్ గేట్ సమీపంలో రోడ్డుపై వడ్ల కుప్పలు ఉండడంతో ద్విచక్ర వాహనం కింద పడడంతో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా హైదరాబాదు ఈఎన్‌టి హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ లక్ష్మమ్మ కుమారుడు కార్తీక్‌రెడ్డి వారిని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఉపసర్పంచ్ సురేష్, గ్రామస్తులు ఉన్నారు.



## జూన్ 2న పేదలకు డబుల్‌బెడ్రూమ్‌లు పంపిణీ

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న పట్టణంలోని అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణి చేయనున్నట్లు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని శ్రీనివాస్‌నగర్ గుమస్తాల కాలనీలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించి పెండింగ్ పనులను ఈనెల 30లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ లబ్ధిదారులు గృహప్రవేశం చేసే నాటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మిషన్ ద్వారా తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఫ్యాన్ల బిగింపు పనులు పూర్తి కావాలన్నారు. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేందుకు పార్కుల అభివృద్ధి, మొక్కలు నాటడం, వాటర్ ప్లాంట్ల ఏర్పాటు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, పంచాయతీ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శివారెడ్డి గూడెం గ్రామపంచాయతీకి ఉత్తమ ఇ- గవర్నెన్స్ అవార్డు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అస్సాం రాష్ట్రం గౌహతిలో శుక్రవారం జరిగిన సేవాసే సమృద్ధి జాతీయ సదస్సులో శివారెడ్డి గూడెం గ్రామపంచాయతీకి 2025 సంవత్సరానికి ప్రకటించిన ఉత్తమ ఇ గవర్నెన్స్ అవార్డును ఆ గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, అధికార బృందం కలిసి అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర నుంచి శివారెడ్డి గూడెం ఉత్తమ డిజిటల్ సేవలకు గాను ఈ అవార్డు అందుకున్నారు. భారత ప్రభుత్వ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ సేవలపై జాతీయ సదస్సు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ఉత్తమ సేవలు కనబరిచిన గ్రామాల నుండి అధికారులు సర్పంచులు ఉన్నతాధికారులు కలెక్టర్లు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లి మండలంలో శివారెడ్డి గూడెం అనే గ్రామ పంచాయితీని ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి ఒకే ఒక గ్రామం ఎంపిక కావడం పట్ల జిల్లా కలెక్టర్ శివరేడ్డిగుడెం గ్రామ పంచాయతీని సిబ్బందిని అవార్డు అందుకున్న సర్పంచ్‌ను అభినందించారు. జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జిల్లా పంచాయతీ అధికారి, డిపిఓ డివిజనల్ పంచాయతీ అధికారి, డిఎల్పిఓ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, మండల పంచాయతీ అధికారి,పంచాయతీ కార్యదర్శి అండ్ టీం ఈ సదస్సులో పాల్గొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తరపున గ్రామ ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు

పర్యావరణాన్ని పాడు చేయకండి- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ:** రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం అయన జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గిరక బావి గూడెంలో రైతులు వరి కొయ్యలను పొలంపైనే తగలబెడుతున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని,దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని,వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కొయ్యలను తగలబెట్ట వద్దన్నారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు. ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ఉన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షనా అభియాన్ ఉద్ఘాటన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన శిక్షణ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయాలు, అంత్యోదయ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవ చేయాలన్నారు. సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వం వంటి లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. గ్రామస్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ భావజ్వాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండురంగాచారి, మన్మథరెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, రంగరాజు రుక్మారావు, గజ్జెల వెంకట్‌రెడ్డి, డాక్టర్ తండు మురళీధర్ రెడ్డి, చల్లమల్ల నరసింహ, గోగుల రమేష్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

# రోడ్డుపై ధాన్యం పోసి తగులబెట్టిన రైతులు

అధికారుల తీరుపై రైతులు ఆందోళన



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సెంటర్ ఇంచార్జీ అవకతవకలకు పాల్పడుతూ ఇష్టానుసారంగా తరుగును తీస్తూ రైతులను ఇబ్బందులు పెడుతుండడంతో విసిగిపోయిన రైతులు శుక్రవారం గుండాల మండల చౌరస్తాలో ధాన్యాన్ని తీసుకువచ్చి తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు తేమ పేరుతో 20 రోజుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో మరోవైపు అకాల వర్షాల వలన ధాన్యం తడిసి రంగు మారి, మొలకెత్తే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసి తాలు, తరుగు పేరుతో సగానికి సగం ధాన్యాన్ని తొలగిస్తూ ట్రక్ షీట్ ఇవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు నిర్వహిస్తున్న నిరసన వద్దకు చేరుకున్న మాజీ జెడ్పిటిసి రామకృష్ణారెడ్డి అధికారులతో ఫోన్లో మాట్లాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సెంటర్ ఇంచార్జ్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు చేస్తున్న నిరసన వద్దకు చేరుకున్న సిఈవో నాగయ్య, పిఏసిఎస్ చైర్మన్ బిక్షంలు సెంటర్ ఇంచార్జ్‌పై చర్యలు తీసుకుంటామని రైతులకు తెలపడంతో రైతులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో చందు, రాంమల్లు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

దాతారుపల్లి కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మండల పరిధిలోని దాతరపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. శుక్రవారం దాతారు పల్లి గ్రామంలోని గొల్లగుడిసెల మెయిన్ రో నిర్మించనున్న నూతన కల్వర్టు పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. తీరనున్న రవాణా కష్టాలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ దాతారు పల్లి గ్రామ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న కల్వర్టు కల నెరవేరిందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గొల్లగుడిసెల మెయిన్ రో వరద నీరు చేరి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలతో పాటు రైతులకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కల్వర్టు నిర్మాణానికి చొరవ చూపినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత భాస్కర్, ఉప సర్పంచ్ నరసింహ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, వార్డ్ మెంబర్, ముదిగొండ నరేష్, మేడబోయిన స్వామి, మేడబోయిన శ్రావణిచంద్రశేఖర్, నరసింహ, మేకల బాలమని శ్రీశైలం, శివప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని ఆనంద్ గౌడ్, చుక్కల చంద్రయ్య, స్వామి పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** విధుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి వైద్యులు వైసిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోజువారీ ఓపీకి ఎంత మంది రోగులు వస్తున్నారో,వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై, పిహెచ్‌సిలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సంఖ్య ఎంత ఉందో, క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా లేదా అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో పిహెచ్‌సిలో ఎన్ని ప్రసవాలు జరిగాయనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజల్లో ప్రభుత్వ దవాఖానలపై విశ్వాసం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్ డాక్టర్ అమరావతి తహసిల్దార్ లావణ్య, ఎంపిడిఓ రాములు నాయక్ వైద్యసిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పెనుగొండ పెద్ద నర్సయ్య మృతి సిపిఐకి తీరనిలోటు



**ప్రజాపక్షం/కోదాడ:** కామ్రేడ్ పెనుగొండ పెద్ద నర్సయ్య మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన పెనుగొండ పెద్ద నర్సయ్య ఉదయం పది గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయి సమాజిక వర్గంలో పుట్టి సామాన్య జీవితాన్ని గడించి, చిన్నతనంలోనే కమ్యూనిస్టు పార్టీ ఆదర్శాలకు ఆకర్షితులై పార్టీలో చేరి సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా, విద్యా కమిటి చైర్మన్‌గా, పార్టీ మండల బాధ్యతల్లో పనిచేసి పార్టీ విస్తరణకు కృషి చేశారని అన్నారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని, అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్న ఆయన జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖఖ తాళ్లూరి వెంకటయ్య, బెజవాడ వినోద్, మండల కార్యవర్గ సభ్యులు ఎస్‌డి మహమ్మద్, తాళ్లూరి పెద్ద మల్లయ్య, నేలపట్ల జనార్ధన్, సిపిఎం మండల కార్యదర్శి నాగటి చిన్నరాములు, బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి శ్రీనివాస్, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్‌కె ఖాజామియా, బత్తిని బిక్షం, దొంతగాని మల్లయ్య పాల్గొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పు నివాస గృహాలు బుగ్గిపాలు

**ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) :** వరి కొయ్యలకు నిప్పు అంటిచగా ప్రమాదవశాత్తు నివాస గృహాలకు అంటుకొని కాలిబూడిదైన సంఘటన శుక్రవారం మద్దిరాల మండలంలోని కుక్కడం ఆవాస ప్రాంతమైన దసురు తండలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు అంటించడంతో సుమారు 20 నుండి 30 ఎకరాల వరకు వరి కొయ్యలు కాలుకుంటూ వచ్చి దసురు తండకు చెందిన ధరావత్ శ్రీను, ధరావత్ కమల, ధరావత్ బాలు నివాస గృహాలకు నిప్పు అంటుకొని వంట సామాగ్రి, నిత్యవసర సరుకులు కాలి బూడదయ్యాయి. బాధితులు సర్వం కోల్పోయామని వాపోతున్నారు. వరి కొయ్యలకు నిప్పు అంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### వరి కొయ్యలకు నిప్పు...గడ్డివాముల దగ్ధం

**ప్రజాపక్షం/మునగాల :** వరి కొయ్యలకు నిప్పు అంటించగా ప్రమాదవశాత్తు పక్కన రైతు పొలంలో ఉన్న గడ్డివాములకు మంటలు వ్యాపించి గడ్డివాము దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలోని వెంకటాపురం శివారులో చోటుచేసుకుంది. పంటల అవశేషాలు దహనం చేయవద్దని ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రజలు పట్టించుకోకుండా నిప్పు పెట్టడంతో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వరి కొయ్యలకు అంటించిన నిప్పు గడ్డివాముకు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేయడంతో హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది.







## 3న నకిరేకల్‌లో టియుడబ్ల్యుజె జిల్లా మహాసభలు

డివిజన్ అధ్యక్షుడు జిల్లా యాదయ్య పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జూన్ 3న నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆసంఘం నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు జిల్లా యాదయ్య, ప్రధాన కార్యదర్శి కత్తుల యాదగిరిలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే సమావేశంలో వారు మాట్లాడుతూ.. నల్లగొండ డివిజన్‌లో చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రచారానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,చిన్న పత్రికల జర్నలిస్టులు,ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, గృహ నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ జిల్లా మహాసభ వేదిక కానుందని ఈమాసభకు మహాసభకు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం, తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి,టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామ నారాయణ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డిలుహాజరవుతున్నట్లు తెలిపారు.సమావేశంలో సంఘం నాయకులు చింత యాదగిరి, తెల్గమల్ల దశరథ్,బోగారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం సభ్యత్వం అందజేశారు.



## ధాన్యం తరలింపులో జాప్యంతో రైతులకు మరింత నష్టం



సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి రైతుల సమస్యలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, హమాలీ, రవాణా సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఎలాంటి నాణ్యతా ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా భేషరతుగా స్వీకరించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా రైతులకు మరింత నష్టం కలుగుతోందన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చండూరు ఆర్‌డిఓ శ్రీదేవితో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్యచారి,జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల బిక్షం రెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, కల్లెట్ల లింగయ్య, గోని వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వేంల :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం చివ్వేంల మండలం వల్లభాపురంలోని జగన్మాత పారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీ ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** మహిళను ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకవెళ్ళి ఆమెను బెదిరించి బంగారపు పుస్తెల తాడు దొంగతనం చేసిన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి అతని నుండి 18 గ్రాముల పుస్తెలతాడును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆటోను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 27వ తేదీన పట్టణంలోని ఖమ్మం అండర్ పాస్ వద్ద చివ్వేంల వెళ్ళేందుకు ధనలక్ష్మి అనే మహిళ వాహనం కోసం ఎదురుచూస్తుండగా అటుగా వచ్చిన ఆటోను ఆపి ఎక్కింది. ఆటో డ్రైవర్ భూతం మహేష్ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్ళి ఆమె మెడపై ఉన్న 18 గ్రాముల బంగారపు పుస్తెలతాడును చోరీ చేశాడు. అదేరోజున ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సిసి ఫుటేజ్ ఆధారంగా ఆటో నంబర్ ఏపి24 టిసి 5480గా గుర్తించి ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామానికి చెందిన భూతం మహేష్‌గా గుర్తించారు. సూర్యాపేట పట్టణ కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. అతని నుండి చోరీచేసిన 18 గ్రామాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును త్వరితగతిన చేధించడంలో కృషి చేసిన సిబ్బంది శ్రీరాములు, రామనర్సయ్య, టెక్నికల్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## విద్యాభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నాబార్డ్ నిధుల రూ.31.60 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతులకు ఆయన శంకు స్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్ధన్, సైదులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటీలో మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా పట్టణ మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన రూ.4కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కమిషనర్ సునితారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, కౌన్సిలర్లు మురళిమోహన్, దిలీప్, బచ్చలి నరేష్, కోఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, నాయకులు నల్లమోని శ్రీధర్, కృష్ణారెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, బాలరాజ్ గౌడ్, ముబారక్ అలీఖాన్, సోలీపూర్ అనిల్, చందులాల్, రాయికల్ శ్రీనివాస్, రవితేజ, జయమ్మ, గౌసియా, అనిత, శైలజ, విజయ, భాను, సునీత, స్వప్న, నీరజ, సంగీత, గౌరమ్మ, బాలమణి, జ్యోతి పాల్గొన్నారు

## పార్టీలకు అతీతంగా చెత్త డంపింగ్ యార్డును అడ్డుకుందాం : శేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** పార్టీలకు అతీతంగా చెత్త డంపింగ్ యార్డును అడ్డుకుందామని కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తూరు మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డును అడ్డుకునేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నామని, ఇప్పటికే 12గ్రామ పంచాయతీల్లో తీర్మాణాలు సైతం చేశామని, దాంతో గ్రీన్ ట్రిబ్యునల్ లో కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో హరినాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎర్రోళ్ల జగన్, భాసునాయక్, గోవింద్‌నాయక్, ఉప్పల దయానంద్ గుప్తా, చిట్టేడి నరసింహారెడ్డి, సుమిత్ర మల్లారెడ్డి, శాంతి విష్ణునాయక్, మీనాక్షి దశరథ్ నాయక్, బోకుల శ్రీరాములు, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఉప సర్పంచులు ఎస్‌డి సిరాజ్, దొబ్బల యాదయ్య, కాంగ్రెస్‌నాయకులు లింగారం సురేష్ గౌడ్, వార్డు సభ్యులు పిప్పల గణేష్, వద్దేశివ నందు, కొమరబండ స్రవంతి మైపాల్, సభావత్ కవిత వెంకట్‌గౌడ్, జ్యోతి నరసింహా, భ్యాగరి మల్లేష్, రాశుల జంగయ్య, మాజీ ఎంపిటిసి రొయ్యల భాష, రొయ్యల అక్బర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల సవరణపై అవగాహన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జూన్ 24 నుండి జులై 25 వరకు నిర్వహించబడుతున్న ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుటకు పార్టీ నాయకులు అవగాహన కలిగి ఉండాలని ఎల్‌బి నగర్ అసెంబ్లీ ఇంచార్జీ సామ రంగారెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్‌ఐఆర్ ఓటర్ ప్రత్యేక సవరణపై ప్రజలకు అవగహన కల్పిచాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో నందికొండ గీతారెడ్డి, రఘురాంనేత, ప్రసన్న, విష్ణువర్ధన్‌రావు, శ్రీధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్, మహేష్ గౌడ్, భార్గవ్ తేజ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం పనిచేయాలి

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జ్యోషి



ప్రజాపక్షం/షాబాద్ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పోలీసులు నిరంతరం పని చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జ్యోషి అన్నారు. శుక్రవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లోఉన్న ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వాటిని పరిష్కరించిన రికార్డు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరుణ్ జ్యోషి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పోలీస్‌లపై నమ్మకం కలిగేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిపి యోగేష్ గౌతమ్, ఎసిపి కిషన్, సిఐ కాంతారెడ్డి, ఎస్సై సతీష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాలొన్నారు.

## జిహెచ్‌ఎంసిలో కొత్త హెల్త్ స్కీమ్.. కోసం డేటా సేకరణ వేగవంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం ప్రత్యేకంగా ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను అత్యవసరంగా సేకరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన జి.ఓ ఆధారంగా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారితుల పూర్తి వివరాలను ఐఎఫ్ఎమ్ఐఎస్‌హెచ్‌ఆర్ మాడ్యూల్‌లో మే 31లోపు తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అన్ని డ్రాయింగ్ అధికారులు తమ పరిధిలోని ఉద్యోగుల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో సేకరించి, సంతకం, ముద్రతో సమర్పించాలని సూచించారు.

# ముందస్తు చర్యలతో వరద ముప్పు తగ్గించవచ్చు

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వర్షాకాలంలో తలెత్తే వరద ముప్పు సమస్యలను చాలా వరకు నివారించవచ్చని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తెలిపారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తే రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించవచ్చన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీస్, జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్, ఐఎండి, టిజిడిపిఎస్, యుబిడి, జలమండలి తదితర శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వరద కాలువల్లో పూడికతీత పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ పనులకు హైడ్రా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. జిహెచ్‌ఎంసి పరిధిలో మొత్తం 523 వాటర్ లాగింగ్ పాయింట్లు ఉన్నాయని, అందులో 105 మేజర్, 157 మీడియం, 261 మైనర్ పాయింట్లు ఉన్నాయని వివరించారు. ఈ ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చెట్లు విరిగి రహదారులపై పడకుండా ముందుగానే ప్రమాదకర చెట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి యుబిడి విభాగానికి సూచించారు. నగరంలోని జలాశయాల్లో నీటి నిల్వలను తగ్గించి ఉంచేలా ఇరిగేషన్ శాఖ చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల సూచనల మేరకు సమస్యల పరిష్కారానికి జిహెచ్‌ఎంసి చర్యలు తీసుకుంటుందని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్ తెలిపారు. వర్షాకాలంలో తలెత్తే ట్రాఫిక్ సమస్యలపై జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయెల్ డేవిస్‌తో పాటు డిసిపిలు, ఏసిపిలు వివరించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. గత ఏడాది నగరంలో తలెత్తిన సమస్యలు, నాలాల విస్తరణ, పూడికతీత పనుల పురోగతిపై హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్.సుదర్శన్, ఆర్‌ఎఫ్ఒ జయప్రకాశ్, డిఎఫ్ఒలు గౌతమ్, శ్రీధర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల సహకారంతోనే అనేక రంగాల ప్రజలకు సేవలు

విశాఖపట్నం మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి సత్యనారాయణ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఖాతాదారుల సహకారంతోనే అనేక రంగాల ప్రజలకు సేవలు అందించి వారి ఆర్థికంగా అదుకోవడంలో విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు పరిపూర్ణంగా పనిచేస్తుందని విశాఖపట్నం మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ జె.వి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నాగోల్ బ్రాంచ్ మహాజనసభను అలాకాపురిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో జనరల్ బాడీ సమావేశం ఈమని ఆవని (బ్రాంచ్ ఇన్చార్జ్ అధ్యక్షత వహించారు. సమావేశానికి విశాఖపట్నం మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ జె.వి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. జె ప్రసాద్, సి.ఆర్.సుకుమార్, జోనల్‌మేనేజర్ పెద్ద ప్రసాద్, నాగోల్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. చంద్రశేఖర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎం, నారాయణ రెడ్డి, ఏ. గోవిందరావు, పి, సుధాకర్‌రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, నాగ జ్యోతి, దీపక్‌సింగ్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంసిలో నీటి నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో నీటి నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. నాగోల్, నేతాజీ నగర్, శృంగేరి కాలనీ, ఈస్ట్ యాదవ్ నగర్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాగోల్ బ్రిడ్జి సమీపంలోని మూసీ నదిని పరిశీలించిన కమిషనర్, నదిలో లార్వా సాంద్రతను తనిఖీ చేయగా సున్నాగా నమోదైనట్లు తెలిపారు. దోమల నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం ఈస్ట్ యాదవ్ నగర్‌లోని వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శృంగేరి కాలనీలో తొలగించిన జివిపి ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, ఆక్రమణలను పూర్తిగా తొలగించి ప్రాంతాన్ని పరిశుభ్రంగా నిర్వహించిన సిబ్బంది పని తీరును ప్రశంసించారు. నేతాజీ నగర్‌లోని వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, రహదారి పక్కన పేరుకుపోయిన మురుగు, చెత్తను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను మరింత వేగవంతం చేయాలని సూచించారు.



### ఎంఎంసిలో స్థాయీసంఘం సమావేశంలో..

### 30 అజెండా అంశాలపై చర్చ

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) స్థాయీసంఘం సమావేశం శుక్రవారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మొత్తం 30 అజెండా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజా సేవల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజి వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, క్రీడల మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, పారిశుధ్య అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, పరిపాలన అదనపు కమిషనర్ వేణుగోపాల్, చీఫ్ సిటీ ప్లానర్ బి. ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి కార్పొరేషన్‌లో అధికారుల బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పలువురు మున్సిపల్ కమిషనర్లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం ప్రత్యేక గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ జి.రాజును సెలవు అనంతరం తిరిగి విధుల్లోకి అనుమతిస్తూ నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. దీంతో ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.నిత్యానంద్‌కు ఆ బాధ్యతల నుంచి తప్పించారు. అలాగే ప్రత్యేక గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామిని హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించగా, ఇన్‌చార్జ్‌గా ఉన్న దినేష్ సింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్‌ను ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వడంతోపాటు, అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.శైలజను రిలీవ్ చేశారు. మరోవైపు గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్ పి. తాన్యకు మౌలాలి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో జకియా సుల్తానాకు అప్పగించిన అదనపు బాధ్యతలు రద్దు చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని కమిషనర్ కార్యాలయం వెల్లడించింది.

## చార్మినార్ జోనల్ కమిషనర్‌కు సత్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలోని చార్మినార్ జోనల్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కన్నం సత్యనారాయణను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రాజేష్ ఖన్నా మాట్లాడుతూ కన్నం సత్యనారాయణ గంగపుత్ర నిరుపేద మత్స్యకార కుటుంబంలో జన్మించి, ఈ స్థాయికి ఎదగడం సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించే వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లకు సంబందించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అట్టహాసం గా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు.అలాగే అవసరమైన ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, వివిధ శాఖలకు సంబంధించిన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధిస్తారు




మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/షాద్‌నగర్/కేశంపేట:** యువత చదువుతోపాటు క్రీడల పట్ల కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేస్తే విజయం సాధించడంతోపాటు భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని వివరించారు.

### అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. గతంలో చేసుకున్న లబ్దిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా ఇచ్చామని, ప్రస్తుతం కొనసాగుతుందని, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేసేందుకు మహిళా సమాఖ్య భవనాలను సైతం నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. గ్రామాలను అనుసందానంగా లింక్ రోడ్లను సైతం వేస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమాగల్ల రమేష్, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గూడ వీరేష్, మహిళా అధ్యక్షురాలు రాణి, సర్పంచ్‌లు సురేష్‌రెడ్డి, నాగేష్, బొజ్జం సంతోష శ్రీశైలం, కవిత కరుణాకర్‌రెడ్డి, హైమావతి జగదీష్, భాస్కర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గిరి యాదవ్, కోడూరు రాములు, తైద పర్వతాలు, కోడూరు నర్సింలు, ప్రకాష్ గౌడ్, కిరణ్, రావుల పెంటయ్య, భీమయ్య, రూప్ల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గర్భిణీలు, బాలింతలతోపాటు చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మహిళా వారోత్సవాల సందర్భంగా జిల్లా మహిళా, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిని ప్రభావితం చేస్తుందని, లోపపోషణ వల్ల పిల్లల ఎదుగుదల దెబ్బతింటుందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు ఇంటి వద్ద లభించే వస్తువులతో తయారు చేసిన లోకాస్ట్ ఆటబొమ్మలు, విద్యా సామగ్రిని ప్రదర్శించారు. వినూత్నమైన, ప్రేరణాత్మక ఆటబొమ్మలను తయారు చేసిన అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులను ప్రశంసిస్తూ అదనపు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఒలు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రథమ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళా వారోత్సవాలలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో లోన్ మేళా, జీవనోపాదుల ఆస్తుల పంపిణీ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి, మహిళా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత, డిఆర్‌డిఎ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రాహుల్, ఖర్గేలతో సిద్ధరామయ్య భేటీ

**● తన కుమారుడికి కీలక మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి ● నేడు బెంగుళూరులో సిఎల్‌పికి సమావేశం**

**న్యూఢిల్లీ/ బెంగళూరు :** కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య గురువారం సిఎం పదవికి రాజీనామా చేశారు. అయితే శుక్రవారం ఆయన ఢిల్లీలో పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను కలిశారు. సిద్ధరామయ్యతో పాటు ఆయన కుమారుడు యతీంద్ర కూడా ఉన్నారు. సోనియా గాంధీ నివాసమైన 10, జనపథ్‌లో రాహుల్ గాంధీతో జరిగిన ఈ సమావేశం చాలా ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చానని, తద్వారా కర్ణాటకలో పరివర్తనకు మార్గం సుగమం చేశానని సిద్ధరామయ్య మాజీ పార్టీ అధినేతతో చెప్పినట్లు తెలిసింది. ఆయన తన భవిష్యత్ ప్రణాళికలు, దక్షిణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు గురించి కూడా రాహుల్ గాంధీతో చర్చించినట్లు తెలిసింది. పార్టీ నాయకత్వం అందించిన రాజ్యసభ నామినేషన్‌ను సిద్ధరామయ్య ఇప్పటికే తిరస్కరించారు. తాను కర్ణాటకలోనే ఉండాలనుకుంటున్నానని, పార్టీ హైకమాండ్ సూచించిన కేంద్ర ప్రభుత్వ పాత్రపై తనకు ఆసక్తి లేదని కూడా ఆయన చెప్పారు. సమావేశానికి సోనియా గాంధీ హాజరు కాకపోవడంతో, సిద్ధరామయ్య రాహుల్ గాంధీని మాత్రమే కలిశారని వర్గాలు తెలిపాయి. రాష్ట్రానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు ఆయన రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపి, కోరిన విధంగా తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు తెలియజేశారని ఆ వర్గాలు తెలిపాయి.

కొత్త కర్ణాటక మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు తన కుమారుడికి, తన విధేయులకు స్థానం కల్పించాలని సిద్ధరామయ్య కోరుతున్నారని వారు తెలిపారు. రాహుల్ గాంధీతో సిద్ధరామయ్య గంటసేపు జరిపిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



రణదీప్ సుర్జేవాలా మాట్లాడుతూ 'ఇది చాలా ఆహ్లాదకరమైన సమావేశం. వారు పలు రాజకీయ అంశాలపై చర్చించారు' అని అన్నారు. కర్ణాటకలో అధికార మార్పిడి సజావుగా జరుగుతుందా అని అడగ్గా, ఆయన, 'కచ్చితంగా. రాష్ట్రంలో సజావుగా సాగే అధికార సంప్రదాయానికి ఎలాంటి ఆటంకం లేదు' అని బదులిచ్చారు. పదవీ విరమణ చేస్తున్న ముఖ్యమంత్రి ఆ తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి, కర్ణాటకలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు, పార్టీలో తన భవిష్యత్ పాత్ర గురించి చర్చించారు. 'ప్రజా జీవితానికి సిద్ధరామయ్య చేసిన సేవలకు కర్ణాటక, కాంగ్రెస్ కృతజ్ఞతతో ఉంటాయి' అని ఖర్గే, సిద్ధరామయ్యతో ఉన్న తన ఫోటోలను పంచుకుంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు. అదే విధంగా సిద్ధరామయ్య, కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌ను ఆయన నివాసంలో కలుసుకుని, కర్ణాటకలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై చర్చించారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, కర్ణాటక సీనియర్ మంత్రి కె.జె. జార్జ్‌లతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. శివకుమార్ కూడా రోజంతా ఖర్గే, వేణుగోపాల్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీ హైకమాండ్‌తో సమయాన్ని నిర్ధారించుకున్న తర్వాత కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్షం (సిఎల్‌పి) సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అయితే శనివారం సాయంత్రం 4 గంటలకు బెంగళూరులో సిఎల్‌పి సమావేశం ఏర్పాటు చేశామని, ఈ సమావేశానికి వేణుగోపాల్, సుర్జేవాలా హాజరవుతారని కాంగ్రెస్ నాయకుడు సలీం అహ్మద్ తెలిపారు. ఈ సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని ప్రకటించే నిర్ణయాన్ని వెల్లడిస్తారని, ఆ తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమ షెడ్యూల్‌ను ఖరారు చేస్తారని అహ్మద్ చెప్పారు.

**సిద్ధరామయ్య రాజీనామా ఆమోదం**

కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించారు. గురువారం నాడు గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, సిద్ధరామయ్య బెంగళూరులోని లోక్ భవన్‌లో ఉన్న గవర్నర్ ప్రత్యేక కార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. 'భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) కింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, కర్ణాటక గవర్నర్‌గా నేను, థావర్‌చంద్ గెహ్లాట్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించాను. తక్షణమే ఆయన నేతృత్వంలోని మంత్రి మండలిని రద్దు చేస్తున్నాను' అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా తన విధులు కొనసాగిస్తారని ఆయన తెలిపారు.

ట్విషా శర్మ మృతి కేసు..

# భర్త, అత్తకు సిబిఐ రిమాండ్



**భోపాల్ :** సంచలనం సృష్టించిన ట్విషా శర్మ మృతి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన ముద్దాయిలుగా ఉన్న ట్విషా భర్త సమర్థ్ సింగ్, అత్త గిరిబాలా సింగ్‌కు సిబిఐ రిమాండ్ విధించింది. దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 2 వరకు ఇద్దరికీ సిబిఐ రిమాండ్ కొనసాగనుంది. ఈ కేసులో గిరిబాలా సింగ్‌ను గురువారం సాయంత్రం సిబిఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందే భర్త సమర్థ్ సింగ్‌ను కూడా అరెస్ట్ చేసింది. దీంతో ఇద్దరినీ ఐదు రోజుల కస్టడీకి అప్పగించాలని మధ్యప్రదేశ్ హైకోర్టును సిబిఐ కోరింది. దీనికి హైకోర్టు అంగీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. జూన్ 2 వరకు ఇద్దరూ కస్టడీలోనే ఉంటారు. అవసరమైతే కస్టడీ పొడిగించాలని సిబిఐ కోరే అవకాశం ఉంది. ఈ పరిణామంపై ట్విషా శర్మ లాయర్ అనురాగ్ శ్రీవాస్తవ స్పందించారు. ఇద్దరు నిందితులు కస్టడీలో ఉండటంతో ప్రస్తుతం కేసు విచారణ సరైన దిశలోనే వెళ్తుందని ఆయన అన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కావాలని సెషన్స్ కోర్టులో గిరిబాలా పిటిషన్ దాఖలు చేయగా అనుమతించింది. ఈ బెయిల్‌ను సవాలు చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టును సిబిఐ ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు గిరిబాలా ముందస్తు బెయిల్‌ను రద్దు చేసింది. దీంతో ఆమెను సిబిఐ అరెస్టు చేసింది. అంతకుమందు గత వారం నాటకీయ పరిణామాల మధ్య, హత్య జరిగిన 10 రోజుల తర్వాత భర్త సమర్థ్ సింగ్ పోలీసులకు లొంగిపోయాడు. అతడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కూడా కోర్టు కొట్టివేసింది. నటి, మోడల్ అయిన ట్విషా శర్మ ఈ నెల 12న అనుమానాస్పదంగా మరణించింది. ఆమె మృతికి భర్త, అత్తలే కారణమని ట్విషా శర్మ తల్లిదండ్రులు ఆరోపించారు. మరోవైపు ఆమె మృతదేహానికి రెండుసార్లు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం, పది రోజుల తర్వాత ఆమెకు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

# ప్రధాని మోదీకి తన ప్రభుత్వ మనుగడపైనే దృష్టి

**● సిబిఎస్‌ఇ వైఫల్యంపై మౌనం ఎందుకు ● విద్యామంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు**
**● లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు గురించి పట్టింపే లేదు ● ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ**

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోమారు విరుచుకుపడ్డారు. సిబిఎస్‌ఇ వైఫల్యంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం, విద్యాశాఖ మంత్రిపై చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. ఈ చర్య ఆయనకు తన ప్రభుత్వ మనుగడ గురించే తప్ప లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు గురించి కాదని స్పష్టం చేస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ యువతకు నిజం తెలుసుకునే హక్కు ఉన్నందున, సిబిఎస్‌ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్, సిఒఇఎంటికి కాంట్రాక్టు అప్పగించడంపై తాను మొదటి రోజు నుంచే స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నానని రాహుల్ శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. మీడియా నివేదికలను షేర్ చేస్తూ వాటిని జాగ్రత్తగా చదవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'సిబిఎస్‌ఇ మూడుసార్లు ఒఎస్‌ఎం టెండర్లను పిలిచింది. మొదటిసారి ఒక్క బిడ్ కూడా రాలేదు. రెండోసారి అర్హత కలిగిన బిడ్డర్ లేరు. చివరకు, సిఒఇఎంటి ఉత్తీర్ణత సాధించే వరకు సాంకేతిక ప్రమాణాలను తగ్గించారు. స్కానింగ్ రిజల్యూషన్‌ను తగ్గించారు. రోబోటిక్ స్కానర్ అవసరాన్ని తొలగించారు. సిఎంఎంఐ సర్టిఫికేషన్‌ను లెవెల్ 5 నుండి లెవెల్ 3కి తగ్గించారు. జవాబు పత్రాల్లోని తప్పులకు విధించే జరిమానాలను తొలగించారు. భారతదేశపు అతిపెద్ద ఐటి సేవల సంస్థ అయిన టిసిఎస్



మూడో రౌండ్‌లో కూడా అర్హత సాధించింది. టిసిఎస్ ఓడిపోయింది. విఫలమవ్వడంలో ఘోరమైన చరిత్ర కలిగిన సిఒఇఎంటి అనే సంస్థ గెలిచింది. మరి ఈరోజు సిబిఎస్‌ఇ విద్యార్థులు దేని గురించి ఫిర్యాదు చేస్తున్నారు? సరిగ్గా స్కాన్ చేయని జవాబు పత్రాల గురించి. తప్పిపోయిన పేజీల గురించి. పనిచేయని మూల్యాంకన పోర్టల్ గురించి' అని ఆయన అన్నారు. దేశవ్యాప్త అమలుకు ముందు ఒఎస్‌ఎం వ్యవస్థకు మరింత సన్నద్ధత కోసం కనీసం ఒకటి లేదా రెండు సంవత్సరాలు అవసరమని ఉపాధ్యాయులు సిబిఎస్‌ఇని హెచ్చరించారని, అయినప్పటికీ దానిని హడావిడిగా అమలు చేశారని రాహుల్‌గాంధీ అన్నారు. అందుకే తాను మళ్ళీ అడుగుతున్నానని, సిఒఇఎంపిటి గెలవాలని ఎవరు కోరుకున్నారు? ఈ సంస్థ ఉత్తీర్ణత సాధించే వరకు, అంచెలంచెలుగా ప్రమాణాలను ఎవరు తగ్గించారు? ప్రధాన్ జీ, సిబిఎస్‌ఇ నియమిత ప్రక్రియను అనుసరించాం అని చెబుతున్నారు. అది సమాధానం కాదు, అది జవాబుదారీతనం కాదు. పనిని సరిగ్గా చేయగల ఉత్తమ సంస్థకు కాంట్రాక్టును నిజాయితీగా అప్పగించారా లేదా అన్నదే ప్రశ్న' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. నియమాలను తమకు అనుకూలంగా మలిచిన తర్వాత మాత్రమే అర్హత సాధించగల సంస్థకు 18.5 లక్షల మంది పిల్లల భవిష్యత్తును అప్పగించారని ఆయన అన్నారు. 'ప్రశ్నలు అడిగినందుకు నాపై దాడి చేస్తున్న బిజెపి మంత్రులకు నేను మొదటి రోజు నుంచే స్వతంత్ర న్యాయ విచారణను డిమాండ్ చేస్తున్నాను. దీనిని సిబిఎస్‌ఇ నుంచి సిఒఇఎంపిటికి కేటాయించిన ప్రతి కాంట్రాక్టుకు విస్తరించండి. మన యువతకు నిజం తెలియాలి. మోదీ జీ, సిబిఎస్‌ఇ వైఫల్యంపై మీ మౌనం, విద్యాశాఖ మంత్రిపై చర్య తీసుకోకపోవడం మీరు నిజంగా దేని గురించి పట్టించుకుంటారో దేశానికి చెబుతోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు గురించి కాదు, కేవలం మీ సొంత ప్రభుత్వ మనుగడ గురించే' అని రాహుల్ గాంధీ అన్నారు. మరో కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ మీడియా నివేదికలను ఉటంకిస్తూ, ఈ సంవత్సరం 12వ తరగతి బోర్డు పరీక్షల కోసం ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థను అందించే కాంట్రాక్టర్ల నుండి సిబిఎస్‌ఇ కోరిన ప్రతిపాదనల కోసం అభ్యర్థనలలో సాంకేతిక నిబంధనలను నీరుగార్చిందని ఆ నివేదికలు వెల్లడించాయని అన్నారు.

# ఇడి చర్యలపై కాంగ్రెస్‌ది సంకుచిత వైఖరి

**● సొంత నాయకులను లక్ష్యంగా చేసుకున్నప్పుడు మాత్రమే స్పందిస్తుంది : పినరయ్ విజయన్**



**తిరువనంతపురం :** కాంగ్రెస్ పార్టీపై కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తీవ్ర విమర్శలు చే శారు. బిజెపిని వ్యతిరేకించే పార్టీల నాయకులపై ఇ డి తీసుకుంటున్న చర్యల విషయంలో ఆ పార్టీ సం కుచిత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తమ సొంత నాయకులను లక్ష్యంగా చేసుకున్నప్పుడు మాత్రమే ఆ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తుందని విజయన్ పేర్కొన్నారు. తన నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించిన సోదాలకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి తమను వ్యతిరేకించే పార్టీల పట్ల అది కఠిన వైఖరిని అవలంబిస్తోందని విజయన్ తెలిపా రు. అందులో భాగంగా, అది అనేక ప్రతిపక్ష పార్టీలకు, ఆ పార్టీల నాయకులకు వ్యతిరేకంగా ఇడిని పక్షపాత ధోరణితో ఉపయోగిస్తోందన్నారు. అయి తే, కాంగ్రెస్ పార్టీ మాత్రం తమ సొంత నాయకులపై చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే దీనిపై అభ్య ంతరం వ్యక్తం చేస్తుంని రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న విజయన్ వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఎందుకు మౌనంగా ఉన్నారని అడిగినప్పుడు, ఆ ప్రశ్నను కేరళ ముఖ్యమంత్రినే అడగాలని విజయన్ బదులిచ్చారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విషయంలో ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని లేదా కేసు ఎందుకు నమోదు చేయడం లేదని కాంగ్రెస్ పదే పదే ప్రశ్నించిందని, చివరకు ఆయనపై కేసు నమోదైనప్పుడు వారు సంబరాలు చేసుకున్నారని విజయన్ ఆరోపించారు. తన నివాసాల్లో ఇటీవ ల జరిగిన సోదాల అనంతరం, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, కేజ్రీవాల్ కూడా ఇడి చర్యలను ఖండించారని, అదే సమయంలో కాంగ్రెస్ వైఖరిని విమర్శించారని ఆ సీనియర్ మార్క్సిస్ట్ నా యకుడు తెలిపారు. 'అంతటినీ చూసినప్పటికీ, కాంగ్రెస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదు, ఇది దురదృష్టకరం. బిజెపి తీసుకుంటున్న ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా మనమందరం ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉంది, కానీ కాంగ్రెస్ నాయకత్వం మాత్రం ఈ విషయంలో సంకుచిత వైఖరిని అవలంబిస్తోంది' అని విజయన్ అభిప్రాయపడ్డారు. ఇడి చర్యలకు సంబంధించి మాట్లాడుతూ, తన కుమార్తె వీణాకు చెందిన ఒక ఖాతాను ఆ సంస్థ స్తంభింపజేసిందని, సోదాలు జరుగుతున్న సమయంలో తాను అక్కడే ఉన్నప్పటికీ, తనను మాత్రం ఎటువంటి ప్రశ్నలూ అడగలేదని ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధానిలోని తన అద్దె నివాసంలో సోదాలు పూర్తయిన తర్వాత ఇడి అధికారులపై జరిగిన హింసాత్మక దాడి గురించి ప్రస్తావిస్తూ, నిరసనలు శాంతియుతంగా జరిగేలా చూసేందుకు సిపిఐ (ఎం) నాయకులు తగిన చర్యలు తీసుకున్నారని, ఈ విషయం అందరికీ స్పష్టంగా కనిపిస్తోందని విజయన్ పేర్కొన్నారు. విజయన్ కుమార్తెకు చెందిన సంస్థకు , ఒక ఇసుక తవ్వకాల సంస్థకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఇడి ఈ సోదాలను నిర్వహించింది. తన కుమార్తె ప్రమేయం ఉన్న సిఎంఆర్‌ఎల్ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా, బుధవారం ఇడి కేరళలోని మొత్తం 10 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. వీటిలో బేకరీ జంక్షన్ వద్ద ఉన్న విజయన్ అద్దె నివాసం, కన్నూరులోని ఆయన పూర్వీకుల ఇల్లు కూడా ఉన్నాయి.

**అధికారులపై దాడి తీవ్ర నేరం : సిఎం సతీశన్**

మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఇడి సోదాలు చేసిన తరువాత అధికారులపై దాడులు చేసిన ఘటనపై ముఖ్యమంత్రి విడి సతీశన్ స్పందించారు. ఈ దాడులు తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులపై దాడి చేయడం, వారి వాహనాలను ధ్వంసం చేయడం తీవ్రమైన నేరమని, ఇది పునరావృతం కాకూడదని, ఇదే తమ వైఖరి అని శుక్రవారం విలేకరుల సమావేశంలో సతీశన్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు జోక్యం చేసుకుంటారని, అటువంటి సందర్భాల్లో తాము కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించిన సోదాలను సమర్థిస్తూ సతీశన్ మాట్లాడుతూ, ఒక కేంద్ర సంస్థ ఇప్పటికే నమోదు చేసిన కేసు విచారణలో భాగంగానే ఈ సోదాలు జరిగాయని, ఇది ప్రస్తుతం కొనసాగుతున్న దర్యాప్తు ప్రక్రియ అని వివరించారు. ఈ సోదాలు దర్యాప్తులో ఒక భాగంగానే నిర్వహించబడ్డాయని ఆయన తెలిపారు. 'ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటి? అసలు ఏ పాత్ర లేదు. ఈ సోదాల గురించి రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం సమాచారం కూడా ఇవ్వలేదు. రాష్ట్ర పోలీసులకు కూడా ఎటువంటి సమాచారం లేదు' అని సతీశన్ స్పష్టం చేశారు.

# గాలి వానకు కూలిన బ్రిడ్జి

**● ఆరుగురు కార్మికులు మృతి ● శిథిలాల కింద చిక్కుకున్న మరో ముగ్గురు**
**● ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో ఘటన**

**హమీర్‌పూర్ :** గాలి వానకు నిర్మాణంలో ఉన్న వంతెన భాగం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మరణించారు. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకున్నారు. అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోరకందర్ నుంచి కందౌర్ గ్రామం వరకు బెట్వా నదిపై ఒక బ్రిడ్జి నిర్మిస్తున్నారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో భారీ ఈదురు గాలులతో కూడిన వ ర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కొంత మంది కార్మికులు లిఫ్ట్ యంత్రం కింద నిల్చొని ఉన్నా రు. అయితే గాలి వాన బీభత్సం వల్ల నిర్మాణం లో ఉన్న



వంతెనకు చెందిన ఒక స్లాబ్ కూలిపోయింది. దీంతో ఆధార స్తంభాలు కూడా కూలిపోయాయి. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అధికారులు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఇద్దరు కూలీలను రక్షించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మరణించినట్లు గుర్తించారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

భారత నావికాదళ 48వ వైస్ చీఫ్‌గా...

# అజయ్ కొచ్చర్ బాధ్యతలు స్వీకరణ

**'ఆపరేషన్ సిందూర్' వ్యూహకర్తగా, ఉన్నతస్థాయి నావికాదళ పోరాట సంసిద్ధతకు సారథిగా గుర్తింపు**

**న్యూఢిల్లీ :** భారత నావికాదళ 48 వ వైస్ చీఫ్‌గా అజయ్ కొచ్చర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉన్నత స్థాయి నావికాదళ పోరాట సంసిద్ధతకు ఆయన సారథ్యం వహించారు. ఆయన తన అపారమైన యుద్ధరంగఅనుభవంతో భారత నావికాదళ కేంద్ర కార్యాలయంలోకి అడుగుపెట్టారు. నౌకాదళంలో రెండవ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ వ్యూహాత్మక జలాలను పరిరక్షించే భారతదేశపు మొట్టమొదటి ఏకైక సమీకృత త్రివిధ దళాల థియేటర్ కమాండ్ అయిన అండమాన్ అండ్ నికోబార్ కమాండ్ (ఎఎన్‌సి) కమాండర్–



ఇన్ చీఫ్‌గా పనిచేశారు. గతంలో వెస్ట్రన్ నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా నేవీ కీలకమైన ఆస్తులను దూకుడుగా ముందుకు మోహరించడాన్నిఅమలు చేయడంలో అజయ్ కొచ్చర్ కీలక పాత్ర పోషించారు. వెస్ట్రన్ నేవల్ కమాండర్ తదుపరి చీఫ్‌గా నియమితులైన వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్ స్థానంలో వైస్ అడ్మిరల్ కొచ్చర్ బాధ్యతలు స్వీకరించారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డిఎ) పూర్వ విద్యార్థి అయిన వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ 1988 జులై 1 వ తేదీన భారత నావికాదళంలోకి నియమితులు అయ్యారు. ఫిరంగి, క్షిపణి వ్యవస్థలలో నిపుణుడు అయిన ఆయన 37సంవత్సరాలకు పైగా సాగిన ఆయన విశిష్ట వృత్తి జీవితంలో పలు రకాల కమాండ్, కార్యాచరణ, స్టాఫ్ బాధ్యతలను నిర్వహించారు. ఆయన నాషక్, విభూతి, కిర్పాన్ యుద్ధ నౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు.

# కల్తీ మద్యం సేవించి 12 మంది మృతి

**● మరికొంత మంది పరిస్థితి విషమం**
**● ఘటనలో 8 మంది అరెస్టు**



**పుణె :** కల్తీ మద్యం సేవించి 12 మంది మరణించారు. అస్వస్థత చెందిన మరి కొందరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నది. కల్తీ మద్యానికి సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పుణె, పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కల్తీ మద్యం తాగారు. తీవ్ర అస్వస్థతకు గురై 12 మంది మరణించారు. పింప్రి చించ్వాడ్‌లోని ఫుగెవాడి ప్రాంతంలో ఏడుగురు, హడప్సర్‌లోని ససనే నగర్, కాలేపడల్ ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు చనిపోయారు. అనారోగ్యం పాలైన మరికొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ సంఘటనపై స్పందించారు. సమగ్ర విచారణ చేయాలని పుణె, పింప్రి చించ్వాడ పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తించారని, దీంతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశమున్నదని వివరించారు.

# మణిపూర్‌లో సద్దుమణగని ఆందోళనలు

**● జాతీయ రహదారి 202ను దిగ్బంధించిన నిరసనకారులు**
**● చెదరగొట్టేందుకు బాష్ప వాయు గోళాలను ప్రయోగించిన దళాలు**

**ఇంఫాల్ :** మణిపూర్‌లో ఆందోళనలను సద్దుమణగడం లేదు. తాజాగా ఉఖ్రుల్ జిల్లాలో శుక్రవారం జాతీయ రహదారి 202ను నిరసనకారులు దిగ్బంధించారు. వారిని చెదరగొట్టడానికి భద్రతా దళాలు పలు రౌండ్ల బాష్పవాయు గోళాలను ప్రయోగించాయని అధికారులు తెలిపారు. నాగా వర్గాలు తమ వర్గానికి చెందిన 14 మందిని బందీలుగా పట్టుకున్నారని ఆరోపిస్తూ, తమ ప్రాంతంలో బంద్‌ను అమలు చేస్తున్న షాంగ్‌కై గ్రామానికి చెందిన ప్రజలు, ఇంఫాల్ నుండి ఉఖ్రుల్ జిల్లా కేంద్రానికి వెళ్లే కీలకమైన రహదారిలోని ఒక భాగాన్ని దిగ్బంధించారు. ఈ ఘటనలో ఐదుగురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయని, భద్రతా దళాలు వారికి ప్రథమ చికిత్స అందించాయని అధికారులు పేర్కొన్నారు. నిరసనకారులు భారీ రాళ్లను, చెట్ల మొద్దులను రహదారిపై అడ్డంగా ఉంచి, రోడ్డు మధ్యలో బైఠాయించారు. దీనివల్ల ఉఖ్రుల్ జిల్లా కేంద్రం వైపు అత్యవసర సామాగ్రి, భద్రతా దళాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాగా వర్గాలు 14 మంది వ్యక్తులను అపహరించాయని ఆరోపిస్తూ, రాష్ట్రంలోని కుకీ తెగల అత్యున్నత సంస్థ అయిన 'కుకీ ఇన్పి మణిపూర్', ఈ గిరి



జన వర్గం నివసించే అన్ని ప్రాంతాల్లో నిరవధిక సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చింది. 13న కాంగ్‌పోక్పి జిల్లాలో ముగ్గురు చర్చి నాయకులు మెరుపు దాడిలో హత్యకు గురైన కొన్ని గంటలకే, కాంగ్‌పోక్పి, సేనాపతి జిల్లాల్లో సాయుధ వర్గాలు 38 మందికి పైగా వ్యక్తులను అపహరించి బందీలుగా చేసుకున్నారు. వారిలో 12 మంది నాగా మహిళలు, 16 మంది కుకీలతో సహా మొత్తం 31 మంది విడుదలయ్యారు. అయితే, ఆరుగురు నాగా పురుషులు మాత్రం ఇంకా బందీలుగానే కొనసాగుతున్నారు, వారి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. రాష్ట్రంలోని కుకీ తెగల అత్యున్నత సంస్థ అయిన 'కుకీ ఇన్పి మణిపూర్', తమ వర్గానికి చెందిన 14 మంది వ్యక్తులు ఇంకా నాగా వర్గాల చేతిలో బందీలుగానే ఉన్నారని కూడా పేర్కొంది.

మూడు నెలల్లో తీర్పు ఇవ్వాల్సిందే..

## రిజర్వ్ తీర్పులపై హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** కేసుల విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తుది తీర్పు వెల్లడించాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించింది. తీర్పు ఆలస్యం కావడం వల్ల పిటిషన్‌దారులకు తీవ్ర నష్టం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని అన్ని హైకోర్టులు విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తీర్పు వెల్లడించాలని ఆదేశించింది. రిజర్వ్ చేసిన తేదీ నుంచి తుది తీర్పు కోసం గరిష్టంగా మూడు నెలలు మాత్రమే సమయం తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్యా ఆధ్వర్యంలోని బెంచ్ తాజా ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. హైకోర్టులు బెయిల్ దరఖాస్తుకు సంబంధించిన కేసుల్లో విచారణ అనంతరం తీర్పును అదే రోజు వెల్లడించాలి. ఒకవేళ తీర్పు రిజర్వ్ చేస్తే మరుసటి రోజే తీర్పు ఇవ్వాలి. అలాగే, బెయిల్‌పై తీర్పు వెలువడిన వెంటనే ఈ ఆదేశాల్ని జైలు అధికారులకు త్వరగా అందేలా చూడాలి. బెయిల్, రిలీజ్ ఆదేశాలు పొందిన



వారు వీలైతే అదేరోజు విడుదలయ్యేలా చూడాలి. ఒకవేళ ఆలస్యమైతే కనీసం మరుసటి రోజైనా విడులయ్యేలా చూడాలి. కింది కోర్టులు కూడా ఈ ఆదేశాల్ని పాటించాలి. అదే రోజు తీర్పు వెల్లడించి, సమాచారాన్ని జైలు అధికారులకు తెలియజేయాలి. అండర్ ట్రయల్ ఖైదీలు అదే రోజు అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి విడుదలవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో మూడు నెలలకు ముందే తీర్పు వెల్లడించాలి. హైకోర్టుల్లో తీర్పు కోసం, న్యాయం కోసం వేలాది మంది పిటిషనర్లు ఎదురుచూస్తుంటారు. వారికి త్వరగా న్యాయం అందించడం కనీస కర్తవ్యం అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

అమెరికా–భారత్ భాగస్వామ్యం కంటే

# మెరుగైనది మరొకటిలేదు

## యుఎస్ రాయబారి సెర్జియో గోర్

**న్యూఢిల్లీ :** ముఖ్యంగా హైటెక్నాలజీ, కీలక ఖనిజాల రంగాలలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి భారతదేశం, యునైటెడ్ స్టేట్స్ (యుఎస్) మధ్య ఉన్న భాగస్వామ్యం కంటే మెరుగైన స్థితిలో మరొకటి లేదని, ఇరుపక్షాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఒక శాతం అంశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని యునైటెడ్ స్టేట్స్ రాయబారి సెర్జియో గోర్ తెలిపారు. ఆయన శుక్రవారం ఇక్కడ ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, యునైటెడ్ స్టేట్స్ తన ఎగుమతి నియంత్రణ విధానాలను చురుకుగా రీ కాలిబ్రేటింగ్ చేస్తున్నదని, ప్రస్తుత సాంకేతిక, భౌగోళిక రాజకీయ దృశ్యాన్ని ప్రతిబింబించేలా, వాణిజ్యం, ఆవిష్కరణలను ప్రారంభించడంలో చట్టబద్ధమైన భద్రత ఆందోళనలను సమతుల్యం చేస్తోందని రాయబారి చెప్పారు. భారతదేశం–యుఎస్ సంబంధాల వివిధ కోణాలను గోర్ స్పృశించారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), వాణిజ్యం, పెట్టుబడి. క్రిటికల్ టెక్నాలజీ, ఫార్మస్యూటికల్స్, పరిశోధన, ఆవిష్కరణలలో దీనిని మరింతగా విస్తరించడానికి గణనీయమైన అవకాశాలు ఉన్నాయి. 'మనం ఒక కీలకమైన తరుణంలో సమావేశం అయ్యాము. ఇక్కడ కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ప్రాథమికంగా ప్రపంచ శక్తి సమతుల్యతకు కీలకం. ఈ బాధ్యతను ముందుండి నడిపించడానికి మప భాగస్వామ్యం కంటే మెరుగైన స్థితిలో మరేదీ లేదని నేను నమ్ముతున్నాను' అని ఆయన అన్నారు. ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టె క్నాలజీ (ఐఐటి) లో 'యుఎస్–ఇండియా ట్రస్ట్ ఇనిషియేటివ్ : అడ్వాన్స్ పార్ట్‌నర్‌షిప్ ఇన్ రీసెర్చి అండ్ ఇన్నోవేషన్'అంశంపై సెర్జియో గోర్ మాట్లాడారు. ద్వైపాక్షిక ఎకనామిక్ ఎంగేజ్‌మెంట్‌లో పెరుగుదలను ఉటంకిస్తూ, రెండు వైపుల మధ్య ప్రతిపాదిత మధ్యంతర వాణిజ్య ఒప్పందం దాదాపు పూర్తి కావస్తున్నదని, కేవలం రెండు దశాబ్దాలలో 20బిలియన్ల అమెరికన్ డాలర్ల నుంచి 220 బిలియన్ అమెరికన్ డాలర్ల వరకు ద్వైపాక్షిక వాణిజ్యం పెరిగిందని ఆయన వివరించారు.

## ఒప్పందానికి చేరువలో...

# మరో 60 రోజులు కాల్పుల విరమణ!

కొనసాగిన 'హోర్మూజ్' ఉద్రిక్తతలు

నాలుగు నౌకలపై ఇరాన్ దాడులు

అమెరికా విమానం కూల్చినట్లు ప్రకటన



**దుబాయ్/వాషింగ్టన్ :** అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ముగింపుపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. శాంతి చర్చలు కొలిక్కి రావడం లేదు. అటు కాల్పుల విరమణ ఒప్పందం పదేపదే ఉల్లంఘనలకు గురవుతూనే ఉంది. అయితే కాల్పుల విరమణను మరో 60 రోజులు పొడిగించే దిశగా రెండు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదించాల్సి ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. కాల్పుల విరమణను పాటించలేదంటూ వాషింగ్టన్, టెహ్రాన్ పరస్పరం ఆరోపణలు చేసుకున్న క్రమంలో శాంతి చర్చలకు విఘాతం కలిగింది. ఒప్పందం జరగలేదు కానీ అందుకు చేరువయ్యామని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. టెహ్రాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. హోర్మూజ్‌లో స్వేచ్ఛా వాణిజ్యం, ఇరాన్ యురేనియం నిల్వల అప్పగింత సహా ట్రంప్ చేసిన డిమాండ్లకు ఇరాన్ అంగీకరిస్తేగనుక ఒప్పందం ఖరారు కాగలదన్నారు.

**దాడులు ప్రతిదాడులు**

ఇరాన్, అమెరికా మధ్య శుక్రవారం వైమానిక దాడులు కొనసాగాయి. హోర్మూజ్ జల సంధి సమీపంలో ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో రాజీ కుదిరిందన్న నివేదికలను ట్రంప్ తోసిపుచ్చిన కొన్ని గంటల్లోనే ఈ దాడులు జరిగాయి. ఇదే క్రమంలో అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చేసినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. హోర్మూజ్ జలసంధి వద్ద నాలుగు నౌకలపై కాల్పులు జరిపినట్లు తెలిపింది. ఆ నౌకలు భద్రతా బలగాలతో సమన్వయం లేకుండా పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించాయని తెలిపింది. తెల్లవారుజామున బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్‌లో యుద్ధ విమానాన్ని కూల్చిన ఫొటోను ఎక్స్‌లో పెట్టింది. ఇదంతా అబద్ధమంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ కొట్టిపారేసింది. యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చలేదని పేర్కొంది. అలాగే బందర్ అబ్బాస్‌లోని ఇరాన్ గ్రౌండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఐదో డ్రోన్‌ను ఇరాన్ ప్రయోగించే సమయానికి అక్కడ దాడి చేసినట్లు అధికారి వెల్లడించారు. అమెరికా దాడికి ప్రతీకారంగా కువైట్‌లోని అమెరికా స్థావరంపై దాడి చేసినట్లు ఇరాన్ తెలిపింది. బందర్ అబ్బాస్ సమీపంలో దాడులను ఖండించింది. ప్రాంతీయ సుస్థిరతకు ముప్పు కలిగిస్తున్నట్లు అమెరికాపై మండిపడింది. తెల్లవారుజామున 1.30 గంటలకు వడు పేలుళ్లు సంభవించాయి. తమ దేశంపై క్షిపణులు, డ్రోన్ల దాడి జరిగిందని కువైట్ పేర్కొంది. దేశవ్యాప్తంగా సైరన్లు మోగించినట్లు పేర్కొంది.

**ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు**

ఇరాన్ సైన్యం చమురు వాణిజ్యంపై కొత్త ఆంక్షలు విధించినట్లు అమెరికా వెల్లడించింది. కాల్పుల విరమణను పొడిగించేందుకు, హోర్మూజ్ జల సంధి ద్వారా నౌకల రవాణాకు ఆంక్షలు ఎత్తివేయడం దాదాపుగా ఒప్పందం ఖరారు అయినట్లు చెబుతున్న తరుణంలో అమెరికా చర్చలు చర్చకు దారితీశాయి. ఇరాన్ ముడి చమురు, పెట్రో ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేసే ఎనిమిది నౌకలపై ఆంక్షలు విధించినట్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఆంక్షలు విధించిన నౌకల్లో మార్షల్ ద్వీపాల ఆయిల్ ట్యాంకర్ ఫ్లోరా, కమొరోస్ జెండాగల హుయాన్కాయో, పనామా జెండా ఉన్న ఇల్‌గ్యాప్ ఉన్నాయి.

**మా ప్రభుత్వాన్ని కూల్చేందుకే : ఇరాన్ ఇంటెలిజెన్స్**

ఆర్థిక ఒత్తిడి పెంచి, విభేదాలు సృష్టించి, విద్రోహాన్ని రెచ్చగొట్టి తమ ప్రభుత్వాన్ని కూల్చడమే అమెరికా, ఇజ్రాయిల్ ఉమ్మడి లక్ష్యంగా ఇరాన్ ఇంటెలిజెన్స్ శాఖ ఆరోపించింది. 'మా దేశాన్ని ముక్కలు చేయాలని అమెరికా, ఇజ్రాయిల్ ప్రయత్నిస్తున్నాయి. తాజా యుద్ధంతో వాటి ఉద్దేశం స్పష్టమైంది కానీ, సైనికచర్య ద్వారా అనుకున్నది చేయలేకపోయాయి' అని ఇంటెలిజెన్స్ శాఖ వ్యాఖ్యానించింది. ఆయుధాలు, పేలుడు పదార్థాలు, కమ్యూనికేషన్ సాధనాలు ప్రత్యేకించి స్టార్‌లింక్ పరికరాల స్మగ్లింగ్‌కూ కుట్ర జరుగుతున్నట్లు పేర్కొంది.

**ఒమన్‌కు అమెరికా హెచ్చరికలు – ఇరాన్ ఖండన**

ఇరాన్‌తో కలిసి హోర్మూజ్ జలసంధి వద్ద నౌకల నుంచి టోల్ వసూలు చేస్తే సహించేది లేదంటూ ఒమన్ దేశాన్ని అమెరికా హెచ్చరించింది. అలా కాదంటే ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ ఎక్స్ ద్వారా హెచ్చరించారు. ఇరాన్‌తో కలిసి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా టోల్ వసూలు చేస్తే, ఒమన్‌పై గురిపెట్టాల్సి ఉంటుందని బెదిరించారు. డొనాల్డ్ ట్రంప్ కూడా ఒమన్‌ను గట్టిగా హెచ్చరించారు. మిగతా వాళ్లతో సమానంగా ఒమన్ ఉండాలని, కాదంటే పేల్చివేస్తామన్నారు. అమెరికాకు ఒమన్ మిత్రదేశమే అయినప్పటికీ ఈ తరహా హెచ్చరికలు చేయడం చర్చకు దారితీసింది. హోర్మూజ్ జల సంధిపై ఏ దేశానికి అధికారం లేదని, అందరి కోసం అది తప్పక తెచుకుంటుందని ట్రంప్ నొక్కి చెప్పారు. అవి అంతర్జాతీయ జలాలు... ఒమన్ మిగతావాళ్లలానే వ్యవహరించాలి. కాదంటే మేం వాళ్లను వదలం. ఈ విషయం వారికీ బాగా తెలుసు' అని ట్రంప్ అన్నారు. అమెరికా తాజా హెచ్చరికలపై ఒమన్ ఆందోళన వ్యక్తంచేసింది. టోల్ వసూలు చేసేందుకు తమ వద్ద ఎలాంటి ప్రణాళిక లేదని వివరణ ఇచ్చుకుంది. కాగా, ఒమన్ రాయబారితో ఫోన్‌లో మాట్లాడినట్లు బెసెంట్ వెల్లడించారు. రెండు దేశాల మధ్య బంధం, సత్సంబంధాలు ఇలానే కొనసాగాలని ఆకాంక్షించారు. హెచ్చరికలు అమెరికాకు పరిపాటయ్యాయని తాజా పరిణామంతో ఇరాన్ ఎద్దేవా చేసింది. ఒమన్‌ను అమెరికా హెచ్చరించడాన్ని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి ఇస్మాయిల్ ఖండించారు. ఐరాసకు స్వతంత్ర్య సభ్యదేశాన్ని బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం జరిగిందని దుయ్యబట్టారు.

## పేలిన 'న్యూ గ్లెన్' రాకెట్



పరీక్ష సమయంలో ఘటన

**న్యూయార్క్ :** వ్యాపారవేత్త జెఫ్ బెజోస్ స్థాపించిన 'బ్లూ ఆరిజిన్' అభివృద్ధి చేస్తున్న 'న్యూగ్లెన్' రాకెట్‌కు సంబంధించిన హాట్‌ఫైర్... పరీక్ష సమయంలో పేలిపోయింది. దీంతో ప్రయోగ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ ప్రాంతాన్ని పొగ కమ్ముకుంది. ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. భవిష్యత్ అంతరిక్ష మిషన్‌కు సన్నాహాల్లో భాగంగా ఈ పరీక్ష నిర్వహించారు. ప్రయోగానికి ముందు నిర్వహించే హాట్‌ఫైర్ టెస్ట్‌లో రాకెట్‌ను నేలకే బిగించి ఉంచి ఇంజిన్లు ఆన్ చేస్తారు. పనితీరు, ఇంధన వ్యవస్థలు, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలిస్తారు. ఇదే క్రమంలో పేలుడు జరగడంపై సంస్థ స్పందించింది. ఇదొక అసాధారణ పరిస్థితిగా వర్ణించింది. ప్రాణ నష్టం జరగలేదని తెలిపింది. పరీక్ష వాహనం, పరిసర మౌలిక వసతులకు నష్టం జరిగినట్లు తెలిపింది. అయితే ఎంత నష్టం జరిగిందో చెప్పలేదు. ఈ ఘటనపై ప్రారంభించినట్లు జెఫ్ బెజోస్ వెల్లడించారు. 'చాలా కఠినమైన రోజు. అవసరమైనవి మళ్లీ నిర్మించి ప్రయోగాలు కొనసాగిస్తాం' అని అన్నారు. 98 మీటర్లకుపైగా ఎత్తుతో న్యూ గ్లెన్ రాకెట్ రూపొందింది. భారీ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకలను కక్ష్యలోకి పంపేందుకు సిద్ధమవుతుంది. వాణిజ్య, ప్రభుత్వ అంతరిక్ష రంగాల్లో రాణించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు బ్లూ ఆరిజిన్ పేర్కొంది.

## ఐరాస బ్లాక్‌లిస్ట్‌లోకి రష్యా, ఇజ్రాయెల్ దళాలు



**న్యూయార్క్ :** సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్యసమితి వార్షిక నివేదిక వివాదాస్పదంగా మారింది. 15 ఏళ్ల నుంచి ఐరాస వార్షిక నివేదిక అందిస్తోంది. అయితే అందులో మొదటిసారి రష్యా, ఇజ్రాయెల్ పేర్లు కనిపించాయి. ఈ రెండు దేశాల దళాలను ఐరాస బ్లాక్ లిస్టులో పెట్టింది. ఉక్రెయిన్‌పై రష్యా...పలస్తీనాపై ఇజ్రాయెల్ దురాగతాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నది. ఉక్రెయిన్ బందీలపై రష్యా సైనికుల లైంగిక హింస ఆరోపణలను ప్రస్తావించింది. ఐరాసలోని రష్యా రాయబారి వెసెల్లీ నింబెంజియా ఈ నిర్ణయాన్ని ఖండించారు. తమ దేశంపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ స్పందిస్తూ... తమకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌తో పనిలేదన్నారు. ఐసిస్, హమాస్ వంటి సంస్థలతో సమానంగా తమ సైన్యాన్ని చూపారని మండిపడ్డారు.

## 'జవాబుదారీతనం' ఉండాల్సిందే

**(మొదటి పేజీ తరువాయి)**

కాకుండా వారి కుటుంబాలకు కూడా 'నిజంగా చాలా బాధాకరమైనది' అని నొక్కిచెప్పింది. వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) స్థానంలో ఒక పటిష్ఠమైన, స్వయం ప్రతిపత్తిగల సంస్థను ఏర్పాటు చేయాలని లేదా పునర్నిర్మించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌తో సహా పలు పిటిషన్లను విచారణ జరుపుతున్న సమయంలో న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ మనం 'మన యువతను నిరాశపరచకూడదు' అని పేర్కొంది. యువత ఆందోళనల పట్ల ప్రభుత్వం సీరియస్‌గా శ్రద్ధ వహిస్తోందని, ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి వివరించారు. 'నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకూ అసలు సమస్య ఆగదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇలాంటిది జరిగితే అది 'విద్యార్థులకే కాదు, వారి కుటుంబాలకూ, అందరికీ చాలా బాధాకరమైన విషయం' అని ధర్మాసనం జోడించింది.

వారు దీనిపై ఎంతో భావోద్వేగాన్ని వెలిబుచ్చారు. జూన్ 21న జరుగనున్న నీట్–యుజి రీటెస్ట్ కోసం కొన్ని నూతన యంత్రాంగాలను ఏర్పాటు చేయాల్సి ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా ధర్మాసనానికి తెలిపారు.ఈ విషయంలో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని కోరిన బెంచ్ జూలై 2వ వారానికి విచారణను వాయిదా వేసింది. ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో వైద్య ప్రవేశాల కోసం మే 3న జరగాల్సిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) లేదా నీట్‌ను (ఎన్ఇఇటి)ను మే 12న జాతీయ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) న రద్దు చేసింది. జూన్21న పున: పరీక్షను నిర్వహించనున్నారు. పేపర్ లీక్ ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు జరుపుతోంది. వివరాలలోకి వెళితే...2024న నీట్ ప్రశ్నపత్రాలు తస్కరించబడ్డాయన్న ఆరోపణల అనంతరం సుప్రీం కోర్టు పరీక్షను రద్దు చేయడానికి నిరాకరించింది. కానీ పేపర్ లీక్‌లను ఎదుర్కోవడానికి, రద్దుకు ఒక ప్రమాణాన్ని నిర్దేశించడానికి ఉద్దేశించిన వివిధ ఆదేశాలను జారీ చేసింది.

## 'నైరుతి' మరింత ఆలస్యం

**(మొదటి పేజీ తరువాయి)**

రుతుపవన వర్షపాతం తగ్గుతుంది. భారతదేశంలో జూన్–సెప్టెంబర్ నెలల నైరుతి రుతుపవన కాలంలో కురిసే వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు భారత వాతావరణ శాఖ శుక్రవారం తెలిపింది. ఈ రుతుపవన కాలంలో ఈశాన్య ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ కార్యాలయం పేర్కొంది. 1971 నుండి 2020 వరకు సేకరించిన డేటా ఆధారంగా, దేశవ్యాప్తంగా కాలానుగుణ వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ) 87 సెం.మీ.గా ఉంది.

ఎల్‌పిఎ అంటే, ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా రుతువు వంటి నిర్దిష్ట వ్యవధిలో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుండి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటున లెక్కించడం. 'దేశంలోని చాలా వర్షాధార వ్యవసాయ ప్రాంతాలు ఉన్న రుతుపవన ప్రధాన ప్రాంతంలో నైరుతి రుతుపవన కాలంలో కురిసే వర్షపాతం సాధారణం కంటే తక్కువగా (దీర్ఘకాలిక సగటులో 94 శాతం కంటే తక్కువ) ఉండే అవకాశం ఉంది' అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వాతావరణ శాస్త్ర డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఒక ప్రకటనలో తెలిపారు.

జూన్ నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా, అంటే దీర్ఘకాలిక సగటులో 92 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఒకవేళ రుతుపవన కాలంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో 90 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే, ఐఎండి దానిని 'లోటు'గా వర్గీకరిస్తుంది.

జూన్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ నెలవారీ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. 'జూన్ నెలలో, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలలోనూ, మహారాష్ట్రలోని అక్కడక్కడా కొన్ని ప్రాంతాలలోనూ సాధారణ స్థాయి కంటే అధికంగా వడగాలుల రోజులు ఉండే అవకాశం ఉంది' అని మహాపాత్ర తెలిపారు. రాజస్థాన్, జార్ఖండ్‌లలో మాత్రం సాధారణ స్థాయి కంటే తక్కువగా వడగాలుల రోజులు ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

## సర్ సమస్య కావచ్చు

**(మొదటి పేజీ తరువాయి)**





బాధ్యత అప్పగించాలని సూచించారు. హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్‌పై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్స్‌ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ పైన అందరు అవగహన పెంచుకోవడం, ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రానున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమన్నారు.

**ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేయాల్సిందే**

కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేయాల్సిందేనని, తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తానని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్లు ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని, తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వవద్దన్నారు. పార్టీని మరింత మరోపేతం చేసేందుకు మాజీ పిసిసి అధ్యక్షుల సలహాలు,సూచనలు తీసుకోవాలని సిఎం సూఇంచారు. ఇంఛార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలని సిఎం అన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇంఛార్జ్ మంత్రులు కలవాలన్నారు. నామినేటేడ్ పోస్టులను దాదాపుగా భర్తీ చేశామని, పార్టీ తరుపున ఇప్పుడు వేలాది మంది సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారన్నారు. పార్టీ నాయకులంతా సమన్వయం తో ముందుకు వెళ్లాలని, నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారన్నారు. బూత్ ఎన్‌రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామని, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీతో సన్మానం చేయించామన్నారు.

**కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తగ్గించేందుకు బిజెపి ప్రయత్నం**

కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తగ్గించి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నం చేస్తున్నదని, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల సరళికి నిదర్శనమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. బెంగాల్‌లో 92 లక్షల ఓట్లు తొలగించి అర్జీలు పెట్టుకుంటే 31 లక్షల ఓట్లు మాత్రమే జత చేశారని, ఆ రాష్ట్రంలో ప్రభుత్వం మారడానికి 30 లక్షల ఓట్లు మాత్రమే కారణమన్నారు. బెంగాల్ తర్వత ఫాసిస్టు ప్రభుత్వం టార్గెట్ పంజాబ్, తెలంగాణ అన్నారు. సత్తా గలగిన వారిని బిఎల్ఎలుగా ఎంపిక చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం పై దృష్టి సారించామన్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి, పిఎసి సభ్యులు పొన్నం ప్రభాకర్, ఎస్.ఎ.సంపత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ బిజెపి రాజకీయ దురుద్దేశంతో 'సర్' ప్రక్రియ చేపడుతుందని విమర్శించారు. దేశంలో బిజెపికి అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని వారు ఆరోపించారు. సర్ ప్రక్రియపై ప్రజలు ఆందోళనలో ఉన్నారని పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా ప్రజలు తమ ఓటు హక్కు కాపాడుకునేందుకు చర్యలు చేపట్టనున్నామన్నారు.

## 'లక్ష ఇళ్లు'

**(మొదటి పేజీ తరువాయి)**

మల్కాజిగిరి కార్పొరేషన్‌ల పరిధిలో మొత్తంగా లక్ష ఫ్లాట్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఇందులో అల్పాదాయ వర్గాల (ఎల్ఐజి) కోసం 70వేలు, మధ్యతరగతి (ఎంఐజి) ప్రజల కోసం 30 వేల ఫ్లాట్లను నిర్మించనున్నారు.

**తొలి దశలో 12 వేల ఫ్లాట్లు.. రూ.5 లక్షల సబ్సిడి !**

ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని ప్రభుత్వం దశలవారీగా చేపట్టనుంది. ఇందులో భాగంగా మొదటి విడత ప్రయోగత్మకంగా12 వేల ఫ్లాట్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు హౌసింగ్ బోర్డుకు అనుమతులు మంజూరయ్యాయి. అత్యంత నిరుపేదలు, దిగువ వర్గాల వారికి లబ్ధి చేకూర్చేలా ఎల్ఐజి ఫ్లాట్లకు భూమి యూడిఎస్ ఉచితంగా ఇవ్వడంతో పాటు, నిర్మాణ ఖర్చులో అదనంగా రూ. 5 లక్షల ఆర్థిక సబ్సిడిని కూడా ప్రభుత్వం అందించనుంది. తద్వారా సామాన్యుడికి సైతం ఫ్లాట్ కొనుగోలు భారం భారీగా తగ్గనుంది.

**బోర్డు సొంత నిధులతోనే నిర్మాణాలు**

ప్రభుత్వ బడ్జెట్‌తో సంబంధం లేకుండా హౌసింగ్ బోర్డు తన సొంత నిధులతోనే ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనుంది. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) నిబంధనలకు అనుగుణంగా వీటిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం భూములు ఎంపిక చేసి, టైటిల్ వివాదాలు, ఈసి, రోడ్ల సదుపాయం వంటివి ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించాలని హౌసింగ్ కమిషనర్, క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్‌లను ప్రభుత్వం ఆదేశించింది. సర్వే, నోటిఫికేషన్‌ల జారీ, విధివిధానాల ఖరారు అధికారాలను హౌసింగ్ బోర్డు విసికి అప్పగించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల జి.ఓకు అనుగుణంగా టెండర్లు, ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ జరగనుంది. ఈ ప్రాజెక్టు పూర్తి వివరాలను హౌసింగ్ బోర్డు త్వరలోనే అధికారికంగా ప్రకటించనుందని అధికారులు తెలిపారు.

## రూ.2000 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుందని పేర్కొంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్యోగ జెఎసి నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తొలి విడతగా రూ.2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## ఎక్కువ ఇళ్లు నిర్మిస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాబట్టే తొలి రెండున్నర సంవత్సరాల్లోనే గ్రామీణ ప్రాంతాల్లో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించామన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని చెప్పారు. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు బిజెపి నేతల ముందు బిఆర్ఎస్ నేతలు మోకరిల్లారని మంత్రి ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్రమోదీ, బిజెపి ఎంపి సి.ఎం.సి. రమేష్, కె.కవిత కూడా ప్రస్తావించారన్నారు. కేసుల మాఫీ కోసం బిజెపి నేతల కాళ్లు పట్టుకున్న వారికి పౌరుషం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి హామీ నుంచి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వరకు బిఆర్ఎస్ ఇచ్చిన హామీలు అన్ని మాటలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలపై కెటిఆర్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ధరణి దందాలు, బినామీ వ్యవహారాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందన్నారు. 2014కు ముందు బిఆర్ఎస్ నేతల ఆర్థిక పరిస్థితి ఏమిటి, పదేళ్ల అధికారంలో ఎలా దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసని విమర్శించారు. గ్రామాల్లో బిఆర్ఎస్ పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే మూడు రెట్లు ఎక్కువ ఇళ్లు నిర్మించిందన్నారు.

**క్యూర్ పరిధిలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి**

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్‌లను పరిశీలించి కీలక సూచనలు చేశారు. రాబోయే 40 నుంచి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపట్టాలన్నారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు అనుకూలంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్రూమ్ వంటి విభాగాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, అదే ప్రాంత ప్రజలకు అక్కడే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం తుది డిజైన్‌లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి చెప్పారు.

## 2 లక్షలకు పైగా సిబ్బంది

**(మొదటి పేజీ తరువాయి)**

దిగుబడి వచ్చే అంచనాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 60 ఎల్‌ఎంటిల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 24 ఎల్‌ఎంటిలు, తమిళనాడులో 11 12 ఎల్‌ఎంటిలు, మహారాష్ట్రలో 3 ఎల్‌ఎంటీలు, కేరళలో 2 ఎల్‌ఎంటీల మేర మాత్రమే కొనుగోలు జరిగిందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు గరిష్టంగా 52 ఎల్‌ఎంటీల వరకే కొనుగోలు పరిమితి విధించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఆ పరిమితిని దాటి 60 ఎల్‌ఎంటీల కొనుగోలు చేపట్టిందని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ రైతుల ఉత్పత్తి సామర్థ్యానికి ఇది నిదర్శనమని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కింద ఇప్పటివరకు రూ.11,050 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఖరీఫ్, యాసంగి కలిపిన 2025–26 కొనుగోలు సీజన్‌లో మొత్తం కొనుగోలు కార్యకలాపాలు, రైతు చెల్లింపులు కలిపి రూ.39,300 కోట్లకు చేరుకున్నాయని చెప్పారు. వర్షాలకు తడిసిన 10,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రత్యేకంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు నష్టం లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఉత్పత్తి స్థాయికి అనుగుణంగా ఎఫ్‌సిఐ కొనుగోలు పరిమితులను పెంచాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ కేంద్రం కొనుగోలు తగ్గించడం ఆందోళనకరమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వరి కొనుగోళ్లపై బిజెపి, బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమైనవేనని మండిపడ్డారు.

రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ కొనుగోలు కోటాను పెంచాలని సూచించారు. 'రైతు బజారుకు తీసుకొచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుంది' అని రాష్ట్ర మంత్రులు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, తూడి దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పదిలం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుత ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని వివరించారు.పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మ జీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు.

# వినేష్ ఫొగాట్‌కు ఊరట..

## ఆసియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు అనుమతి

భారత రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు భారీ ఊరట లభించింది. ఆసియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు ఆమెకు అనుమతించింది. ఈ విషయంలో వినేష్ ఫొగాట్‌కు అనుమతిస్తూ ఇప్పటికే ఢిల్లీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు కోర్టు అనుమతించింది. రెజ్లింగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ఆధ్వర్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ జరిపి, వినేష్ ఫొగాట్‌కు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం నుంచి ఢిల్లీలో ప్రారంభం కాబోయే ఆసియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వినేష్ ఫొగాట్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ మేరకు



వినేష్‌కు సుప్రీంకోర్టు బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో "మేం ఈ విషయంలో జోక్యం చేసుకోలేం. మీరు వెళ్లి ఆసియా గేమ్స్ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చు. ఈ దశలో వెనక్కి రావాలని వినేష్‌కు ఆదేశాలివ్వలేం. ఆమె గతంలో దేశాన్ని గర్వపడేలా చేశారు. ఇప్పటికే కోర్టు వినేష్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయంలో ఇంకేం చేయలేం అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నెల 30, 31 తేదీల్లో వినేష్ ఫొగాట్ ఆసియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పాల్గొనబోతుంది. దీనికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది.

అయితే, ఈ నిర్ణయాన్ని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు బెంచ్ తన పరిధి దాటిందని, వినేష్ అనర్హురాలైనప్పటికీ ఆమెకు కోర్టు అనుమతించిందని తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఇదే సమయంలో ఈ పిటిషన్ నేపథ్యంలో వినేష్ ఫొగాట్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది.

## ఈషా సింగ్‌కు తెలంగాణ క్రీడాశాఖ అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన యువ షూటర్ ఈషా సింగ్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించిన ఈషా, ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో రెండు వ్యక్తిగత పతకాలు గెలిచిన తొలి భారత మహిళా షూటర్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఈ టోర్నీలో స్వర్ణ పతకంతో పాటు ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఈషా సింగ్, మరోసారి అద్భుత ప్రదర్శనతో దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నిలిచింది. అదే విభాగంలో భారత షూటర్ సురుచి ఫొగాట్ స్వర్ణ పతకం సాధించడంతో భారత్‌కు డబుల్ విజయోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈషా సింగ్‌ను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన ఈషా పట్టుదల, క్రమశిక్షణ, మానసిక ధైర్యం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎండి డాక్టర్ ఎ. సోనిబాలా దేవి ఐఎఫ్ఎస్ కూడా ఈషా సింగ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు వరుస విజయాలు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని, భవిష్యత్తులో కూడా ఈషా మరిన్ని విజయాలు సాధించి దేశానికి ఒలింపిక్ పతకాలు అందించాలని వారు ఆకాంక్షించారు.

## సెమీస్‌లో చిరాగ్ సాత్విక్ !

సింగపూర్ ఓపెన్‌లో భారత్‌కు శుక్రవారం మిశ్రమ ఫలితాయి ఎదురయ్యాయి. డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్ ఫైనల్లో అదిరే విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. అయితే.. మహిళల సింగిల్స్‌లో పతకం గెలుస్తుందనుకున్న పీవీ సింధు అనూహ్యంగా ఓటమితో ఇంటిదారి పట్టింది. క్వార్టర్స్‌లో వరల్ నంబర్ 1 చేతిలో సింధు కంగుతిన్నది. ఈ సీజన్‌లో అదరగొడుతున్న సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం సింగపూర్ ఓపెన్ టైటిల్ వేటలో దూసుకెళ్తోంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జంట కాంగ్ ఖాయ్ గ్జింగ్ అరోన్ తాయ్ (మలేషియా) జోడీని చిత్తు చేసింది. తొలిసెట్‌ను 19–21తో కోల్పోయిన సాత్విక్ చిరాగ్ రెండో సెట్లో పుంజుకొని ప్రత్యర్థికి షాకిచ్చారు. 21–17తో సెట్‌ను కైవసం చేసుకొని.. నిర్ణయాత్మక మూడో సెట్లోనూ మలేషియా ద్వయానికి సాత్విక్ చిరాగ్ ఏమాత్రం అవకాశమివ్వలేదు. అంతకుముందు మహిళల సింగిల్స్ క్వార్టర్స్లో పీవీ సింధుకు నంబర్ 1 అన్ సే యాంగ్(దక్షిణ కొరియా) చెక్ పెట్టింది. తొలి సెట్లో అటాకింగ్ గేమ్తో ఆకట్టుకున్న సింధుకు యాంగ్ షాకిచ్చింది. 17–21తో కోల్పోయిన తెలుగు తేజం రెండో సెట్లోనూ స్థాయికి తగ్గట్టు ఆడలేదు. ఫలితంగా యాంగ్ 21–14తో పైచేయి సాధించి సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది.




## సైన్స్



### సూర్యుడి సమీపంలో హైపర్‌క్యూబ్!

సూర్యుడి కరోనా ప్రాంతంలో ఒక హైపర్ క్యూబ్ కనిపించిందని, ఇది మనకంటే పూర్వీకులైన ఏలియన్స్ పంపిన వస్తువు కావచ్చని పలు చరిత్రాలు, కథనాలు ప్రచారమవుతున్నాయి. కానీ, అలాంటి వస్తువును ఏ ఒక్క అంతర్జాతీయ ఖగోళ పరిశోధనా సంస్థ కూడా ఇప్పటి వరకూ శాస్త్రీయంగా ధ్రువీకరించలేదు. అంతరిక్ష చిత్రాలను తప్పుగా అర్థం చేసుకోవడం, సైన్స్ ఫిక్షన్ భావనలు కలిసి ఇలాంటి ఒక ఊహాజనిత వార్తను సృష్టించి ఉండవచ్చు. హైపర్‌క్యూబ్ లేదా టెస్సరాక్ట్ అనేది నాలుగు కొలతల గణిత నిర్మాణం. మన భౌతిక ప్రపంచం మూడు కొలతలతో పరిమితం. నాలుగు కొలతల వస్తువు ప్రత్యక్షంగా కనిపించడం ప్రస్తుత భౌతిక సిద్ధాంతాలకు అనుకూలం కాదు. గరిష్టంగా మనం దాని త్రిమితీయ ప్రక్షేపణను మాత్రమే ఊహించగలం. అది నిజమైన '4డి' ఘనవస్తువు కాదని గుర్తుంచుకోవాలి. సూర్యుడి కరోనా అనేది అత్యంత తీవ్రమైన ప్లాస్మా వాతావరణం. అక్కడ ఉష్ణోగ్రతలు లక్షల నుంచి మిలియన్ల డిగ్రీల వరకు చేరుతాయి. బలమైన మాగ్నెటిక్ ఫీల్డ్, అధిక శక్తి కణ ప్రవాహాలు, మరియు నిరంతర ప్లాస్మా చలనం జరుగుతుంటాయి. ఈ పరిస్థితుల్లో ఏ ఘన పదార్థంతో చేసిన వస్తువైనా దీర్ఘకాలం నిలకడగా ఉండటం అసాధ్యం. సూర్యుడి గురించిన అధ్యయనాల కోసం పంపిన అంతరిక్ష మిషన్‌లు కూడా కరోనా లోపల కాకుండా సురక్షిత దూరాల్లో నుంచే పరిశీలనలు కొనసాగిస్తాయి. సూర్యుడిని పరిశీలిస్తున్న ప్రాజెక్టులు పంపిన చిత్రాల్లో కనిపించిన చతురస్రాకార లేదా ఘనాకార దృశ్యాలు ఈ హేతుబద్ధంకాని వాదనకు మూలాలుగా పేర్కోవచ్చు. 'సోలార్ హెలియోస్ఫెరిక్ అబ్జర్వేటరీ' (ఎస్ఒహెచ్ఒ), సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ (ఎస్‌డిఒ) మిషన్‌ల డేటాలో కొన్ని సందర్భాల్లో పిక్సెల్ లోపాలు, డేటా గ్లిచ్‌లు, లేదా ఇమేజ్ ప్రాసెసింగ్ ఆర్టిఫాక్ట్స్ కారణంగా ఇలాంటి ఆకృతులు కనిపించాయి. ఇవి భౌతిక వస్తువులు కావు. కెమెరా సెన్సర్ పరిమితులు లేదా డిజిటల్ ప్రాసెసింగ్ లోపాల ఫలితాలు. అయితే సోషల్ మీడియాలో వీటిని హైపర్‌క్యూబ్ లేదా ఏలియన్ ప్రోబ్‌గా వర్ణించారు. ఇప్పటివరకు ఏ పీర్‌రివ్యూడ్ జర్నల్‌గానీ, ఏ అధికారిక అంతరిక్ష సంస్థగానీ ఈ వాదాన్ని సమర్థించలేదు.

### మనుషులను గుర్తించే వైఫై తరంగాలు!

మనం నిత్యం ఉపయోగిస్తున్న వైఫై తరంగాలు ఎలాంటి ఇతర సాధనాలు లేకుండానే మనుషులను గుర్తిస్తాయా? ఇప్పుడు ఇదే అంశంపై విపరీతమైన చర్చ జరుగుతున్నది. దీనికి అవుననిగానీ, కాదనిగానీ సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే, ఇది ఇంకా పరిశోధన దశలో ఉన్న ఒక శాస్త్రీయ అధ్యయనం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నట్లు ఇది మాయాజాలం కాదు. శాస్త్ర సంబంధమైన అంశమే. మన శరీరం నీరు, కండరాలు, ఎముకలు వంటి భౌతిక పదార్థాల సమాహారం. గదిలో ప్రయాణించే వైఫై తరంగాలు మన శరీరాన్ని తాకినప్పుడు అవి శోషణకు గురై ప్రతిబింబిస్తాయి లేదా దిశ మారుస్తాయి. ఈ మార్పులు కొలిచే విధంగా ఉంటాయి. ప్రతి వ్యక్తి శరీర ఆకృతి, ఎత్తు, కదలిక పద్ధతి, నడక రిథమ్ వేరు కావడంతో సిగ్నల్‌లో ఏర్పడే నమూనాలు కూడా వేర్వేరుగా కనిపిస్తాయి. రౌటర్, రిసీవర్ మధ్య వచ్చే సిగ్నల్ మార్పులను అత్యంత సున్నితంగా రికార్డ్ చేసి, ఆ డేటాను మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లతో విశ్లేషించడం ఇప్పుడు పరిశోధకులు చేస్తున్న సరికొత్త అధ్యయనం. ఈ విధంగా వ్యవస్థ కొన్ని ప్యాటర్న్‌లను వ్యక్తులతో అనుసంధా



నించడం నేర్చుకుంటుంది. నియంత్రిత ప్రయోగశాల పరిస్థితుల్లో గదిలో ఎవరైనా ఉన్నారా? ఒకే వ్యక్తిని మళ్లీ గుర్తించగలమా? అనేది అర్థం చేసుకోగలిగారు. అదే విధంగా గోడల అవతల కదలిక ఉందా వంటి అంశాలను మంచి ఖచ్చితత్వంతో గుర్తించారు. ఇది కెమెరా లేకుండా, ధరించే పరికరాలు లేకుండా సాధ్యమవడం పరిశోధనపరంగా ముఖ్యమైన అంశం. అయితే ఇది ఇంకా ల్యాబ్ స్థాయి సాంకేతికత. వాస్తవ ప్రపంచంలో అనేక మంది ఒకేసారి కదలితే, ఫర్నిచర్ మారితే, లేదా రేడియో శబ్దం ఎక్కువైతే ఖచ్చితత్వం గణనీయంగా పడిపోతుంది. అయితే ప్రైవసీ అంశం గంభీరమైనది. ఈ విధానం కనిపించకుండా పనిచేయగలదు. వ్యక్తి అనుమతి లేకుండా ఉనికి లేదా కదలికను ట్రాక్ చేసే అవకాశముంది. కాబట్టి ఇది సాంకేతికంగా ఆసక్తికర పురోగతి అయినప్పటికీ, వినియోగ విధానం, నియంత్రణలు, నైతిక మార్గదర్శకాలు కీలకంగా మారతాయి.

### చంద్రుడిపై కొత్త సిద్ధాంతం

చంద్రుని రొటేషన్–ఆర్బిట్ లాకింగ్ అంశంపై రాండల్ కార్ల్‌సన్ చేస్తున్న వాదన ఆసక్తికరంగా ఉంది. అదే సమయంలో, కొంత వివాదాస్పదంగానూ మారుతున్నది. చంద్రుడు ఎప్పుడూ భూమి వైపే ఒకే ముఖాన్ని చూపించడాన్ని శాస్త్రీయంగా 1:1 స్పిన్–ఆర్బిట్ కప్లింగ్‌గా పిలుస్తారు. అంటే చంద్రుడు తన అక్షం చుట్టూ ఒకసారి భ్రమణం చేయడానికి పడే సమయం, భూమి చుట్టూ ఒకసారి పరిభ్రమణం చేయడానికి పడే సమయానికి సమానంగా ఉండడం. దీనివల్ల మనకు చంద్రుని మరో వైపు ఎప్పుడూ కనిపించదు. అయతే, కార్ల్‌సన్ అభిప్రాయం ప్రకారం, ఇంత ఖచ్చితమైన సమకాలీకరణ సాధారణ ఖగోళ శరీరాల్లో అంత సులభంగా ఏర్పడకూడదు. ఆయన దృష్టిలో ఇది ఒక అసాధారణ పరిస్థితి. చంద్రుని మాస్ సమానంగా అన్ని దిశల్లో వ్యాపించి ఉంటే, కాలక్రమేణా అది మరింత స్ఫెరికల్‌గా మారి, ఈ స్థాయి టైడల్ లాకింగ్ కొంత సడలిపోవాలి. కానీ చంద్రునిలో అది జరగలేదు. దీనికి కారణంగా ఆయన మాస్ కాన్సెంట్రేషన్లు లేదా మాస్‌కాన్స్ అనే భావనను సూచిస్తారు. చంద్రుని లోపల కొన్ని ప్రాంతాల్లో మాస్ ఎక్కువగా ఉండడం వల్ల, అది భూమి వైపు



నిర్దిష్ట ముఖాన్ని నిలబెట్టుకుంటుందని ఆయన వాదిస్తున్నాడు. అదేవిధంగా, చంద్రుని క్రస్ట్ అసాధారణంగా దృఢంగా ఉండి, ఈ అసమాన మాస్ పంపిణీని నిలుపుకుంటోందని ఆయన అభిప్రాయం. అయితే, ప్రధాన శాస్త్రీయ వర్గాలు టైడల్ లాకింగ్‌ను భూమి–చంద్రుల మధ్య ఉన్న దీర్ఘకాల గురుత్వ పరస్పర చర్యలతో సమర్థంగా వివరించాయి. కార్ల్‌సన్ వాదనలు ఆలోచనకు ప్రేరేపించేవైనా, అవి ఇంకా ప్రధాన శాస్త్రీయ సమ్మతిని పొందలేదని చెప్పాలి.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్




**ప్రజాపక్షం/బోథ్ :** కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా అధ్యక్షుడు భారతాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఎఐటియుసి ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం బోథ్‌లోని శంకర్‌రావు భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు విలాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా పెట్టుబడులు, కార్పోరేట్ శక్తులకు దేశ సంపదను, కార్మికుల శ్రమను దోచి పెట్టడం కోసమే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హరిస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలకు కుదించి 4 కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల నడ్డీ విరుస్తూ 8 గంటల పని దినాన్ని 10 నుండి 12 గంటలకు పెంచే కుట్రలు కుతంత్రాలు బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. 4 కోడ్‌లను రద్దు చేసి పోరాడి సాధించుకున్న 44చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యాచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కాబోతున్నామని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, కార్యవర్గ సభ్యులు ఏ.చంద్రకళ, కీర్తి రమణ, కె.గంగయ్య, కె.గోదావరి, ఎస్.కె. ఉస్మాన్, జె.రుక్మిణి, అలం తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలి

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** ధాన్యం కొనుగోళ్లను త్వరితగిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తాంసి మండల రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాంసి మార్కెట్ పరిధిలో 30 రోజులుగా జొన్నల కొనుగోళ్లు జరగక అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యార్డ్‌లో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మొత్తం 11 తూకం కాంటాలు ఉండగా, అందులో 8 కాంటాలు పాడై కేవలం మూడు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. షెడ్యూల్ ప్రకారం తూకాలు వేయకపోవడంతో రైతులు 30 రోజులుగా మార్కెట్ యార్డ్‌లోనే పడిగాపులు కాస్తున్నారన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో తాంసి మండల రైతుల జొన్నల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కుంటాల రాములు, తాంసి మండల కార్యదర్శి అర్ధాంగి రమేష్, రైతు నాయకులు కార్తీక్, సత్యనారాయణ, అశోక్, మహేందర్, రామన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాల బలోపేతమే లక్ష్యం

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యమని, అందుకు సిపిఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మర భవన్‌లో సిపిఐ వరంగల్ జిల్లా కార్యకర్తల సమావేశం వీరగోని శంకరయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి షేక్ బాష్‌మియా హాజరై మాట్లాడుతూ జూన్ 3,4, 5తేదీలలో నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించాలని జిల్లా సమితి నిర్ణయించిందన్నారు. దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడ్డాయని, దేశంలో మెజారిటీ ప్రజలైన ఎసి, ఎస్టి, బిసి, మైనార్టీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు తీవ్ర ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. గ్రామీణ, పట్టణ బస్తీలలోని యువతకు ఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయి. యువత పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేక, మార్కెటింగ్ సౌకర్యాలు లేక, కొనే నాథుడు కరువై, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల వ్యవసాయ రంగం కుదేలవుతుందన్నారు. విద్యా ఉపాధి రంగాలలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు కల్పించకుండా బిసిలకు వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరాశ, నిస్పృహలతో ఆత్మహత్యలు, నేరాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలపై




అత్యాచారాలు, దాడులు, హత్యలు, చైన్‌స్నాచింగ్‌లకు ఈ నిరుద్యోగ సమస్యే కారణమౌతుందని విమర్శించారు. యువతను మత ఉన్మాదులుగా తయారు చేయడానికి పాఠ్యాంశాలలో చరిత్రకు సంబంధించిన సిలబస్‌లు మారుస్తురన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మేస్తున్నారు. రాజకీయ ఆర్థిక పరిస్థితులను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించుకోవడం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం అవసరమైందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సిపిఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. జూన్ 3న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ శిక్షణ తరగతులను ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శిలు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, కందిక చెన్నకేశవులు, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, దామెర కృష్ణ ల్యాదల శరత్, సుధీర్, ఏకాంబర చారి, రాచర్ల రాజేందర్, బొడ్డుపల్లి సాయిలు, పార్థసారథి, ప్రభాకర్, అనంతరెడ్డి, సాంబమూర్తి, విక్టోరియా, సంద్ర కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న విద్యాశాఖ అధికారులు

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్

**ప్రజాపక్షం/వరంగల్ :** కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ ఆరోపించారు. శుక్రవారం శివనగర్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మండల ఎఐఎస్ఎఫ్ సమావేశంలో శరత్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే గ్రామాలలో టెక్నో, డిజి పేర్ల మీద ప్లెక్సీలను విచ్చలవిడిగా ప్రదర్శిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల, పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. వరంగల్ నగరంలో ఎలాంటి పర్మిషన్లు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఫ్లెక్సీలు కట్టి విద్యార్థులను మోసం చేస్తున్నారని, ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని పర్మిషన్ లేని విద్యాసంస్థలకు నోటీసులు అందించి తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ వరంగల్ మండల నాయకులు అభిరామ్, సూర్యవంశీ, శ్రావణ్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఎఐటియుసిలో చేరికలు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** బిఆర్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి నీట్యాడి నగేష్‌తో పాటు పలువురు కార్మికులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ సమక్షంలో సంఘంలో చేరారు. రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండి భాసీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ కార్మికులకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎఐటియుసి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై సంఘంలో చేరిన నగేష్‌ను, ఇతర కార్మికులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో అందరం కలిసికట్టుగా పోరాడి కార్మిక హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా పెట్టుబడులు, కార్పోరేట్ శక్తులకు దేశ సంపదను, కార్మికుల శ్రమను దోచి పెట్టడం కోసమే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హరిస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలకు కుదించి 4 కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల నడ్డీ విరుస్తూ 8 గంటల పని దినాన్ని 10 నుండి 12 గంటలకు పెంచే కుట్రలు కుతంత్రాలు బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. 4 కోడ్‌లను రద్దు చేసి పోరాడి సాధించుకున్న 44చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డోంగ్రే చందు, నల్ల శివన్న, ఎండి ఇర్ఫాన్, ఎండి ముజీబ్, శ్రీను, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




## సంపన్నులకు ప్రభుత్వ స్థలాలు అప్పగిస్తారా?



### ఎన్ఎస్‌పి ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన

### హెచ్చరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** నిలువ నీడ లేక ఎన్ఎస్‌పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు అక్రమిస్తే ఎందుకు నోరెత్తడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతిగా చట్టంలో రాసి ఉందా అని అలా ఉంటే అధికారులు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్ఎస్‌పి స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణదారుల్లో ఉన్నారని సురేష్ ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్దాక్షిణ్యంగా ఎన్ఎస్‌పి కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు.



ఎన్నెస్పి మేజర్2లో 66 అడుగుల వెడల్పున నాగార్జునసాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వడివిజన్‌లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్ఛగా సాగుతుందన్నారు. ఇప్పటికే కొందరు నిర్మాణాలను పూర్తి చేయగా మరికొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్‌లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. బృందంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు యర్రా బాబు, ఏనుగు గాంధీ, ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## టిజిసిహెచ్‌ఇ చైర్మన్ బాలకిష్టారెడ్డితో ఎపి సెంచూరియన్ విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందం భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్‌ఇ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డితో శుక్రవారం భేటీ అయింది. ఈ బృందంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ డి. శ్రీవేద, అధ్యాపకురాలు డాక్టర్ పౌలమి సిల్, సెంచూరియన్ స్కూల్ ఆఫ్ స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆశిష్ మోదీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తమ విశ్వవిద్యాలయంలో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న పరిశోధనలు, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే ప్రత్యేక కోర్సులను ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డికి వారు వివరించారు.గ్రామీణ యువత,సమాజ అభివృద్ధి కోసం మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అవుట్రీచ్ కేంద్రాల ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సన్నద్ధత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపడుతున్నామని వారు వివరించారు. కాగా టిజిసిహెచ్ ఇ చేపడుతున్న ఉన్నత విద్యా సంస్కరణలు, నైపుణ్యాధారిత కోర్సుల ప్రవేశపెట్టడం, పాఠ్య ప్రణాళికల ఆధునీకరణ తదితర అంశాలపై అవగాహన పొందడమే తమ పర్యటన ప్రధాన ఉద్దేశమని ప్రతినిధి బృందం తెలిపింది.

# న్యూస్‌రూమ్ ఒత్తిడికి 'ధ్యానం' సమర్ధ పరిష్కారం

**● శాంతి సరోవర్ మీడియా సదస్సులో నిపుణుల అభిప్రాయం ● పాల్గొన్న 80 మంది మీడియా ప్రతినిధులు, సంపాదకులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైకిల్, బ్రేకింగ్ వార్తలు, 24 గంటల న్యూస్ డిజిటల్ ఒత్తిడి పెరుగుతున్న ప్రస్తుత కాలంలో జర్నలిస్టులకు ఒత్తిడి నిర్వహణ అత్యంత అవసరమని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో బ్రహ్మకుమారీస్ మీడియా వింగ్ ఆధ్వర్యంలో 'మీడియా, మెడిటేషన్ సామాజిక శాంతి' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 80 మంది మీడియా ప్రతినిధులు, సంపాదకులు, జర్నలిస్టులు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు హాజరయ్యారు.



### మీడియా బాధ్యత కీలకం : కె. శ్రీనివాస్ రెడ్డి

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మీడియా సమాజానికి నాలుగవ స్తంభమని, దీని బాధ్యత ఇతర ప్రజాస్వామ్య వ్యవస్థల కంటే ఎంతో కీలకమైనదని తెలిపారు. మీడియా గనుక తన స్వేచ్ఛను కోల్పోయినా, అసత్య వార్తలను ప్రచారం చేసినా లేదా సమాజంలో విభజన సృష్టించినా సామాజిక వ్యవస్థ బలహీనపడుతుందని ఆయన హెచ్చరించారు. జర్నలిస్టులు రాజయోగ ధ్యానం ద్వారా తమలో శాంతిని పెంపొందించుకుంటే, సమాజంలో కూడా శాంతిని నెలకొల్పగలరని ఆయన సూచించారు.

### అంతర్ముఖ శాంతితోనే సానుకూల మార్పు : బి.కె. కులదీప్ దీదీ

హైదరాబాద్ జోన్ డైరెక్టర్ బి.కె. కులదీప్ దీదీ మాట్లాడుతూ మాటల శక్తి ఎంతో గొప్పదని కొనియాడారు. మీడియా ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి అంతర్ముఖ శాంతి, పవిత్రత ఎంతో అవసరమన్నారు. భగవంతునితో అనుసంధానం కావడం ద్వారా ఆత్మబలాన్ని పెంపొందించుకొని, సమాజంలో సానుకూలతను పంచాలని ఆమె పిలుపునిచ్చారు.

### ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు : డాక్టర్ సచిన్ పరేబ్

ముంబైకి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సచిన్ పరేబ్ జర్నలిస్టులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. నిరంతర ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, రక్తపోటు (బిపి), మెదడు పనితీరు మందగించడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. దీని నివారణకు తగిన విశ్రాంతి, సమతుల్య ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవరచుకోవాలని, ముఖ్యంగా నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్‌లను వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మానసిక, భావోద్వేగ, శారీరక, సామాజిక ఆరోగ్యాల కలయికే సంపూర్ణ ఆరోగ్యమని ఆయన స్పష్టం చేశారు.

### విలువలతో కూడిన కంటెంట్ అవసరం

ప్రత్యేక అతిథి, సీనియర్ జర్నలిస్ట్ గౌరి శంకర్ మాట్లాడుతూ నేటి కాలంలో మనుషులు డబ్బు, పేరు కోసం పరిగెడుతూ మానసిక శాంతిని కోల్పోతున్నారన్నారు. సోషల్ మీడియాలో సరైన నియంత్రణ లేకపోవడం వల్లే ఫేక్ న్యూస్ విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

మౌంట్ అబూ ప్రధాన కార్యాలయం నుండి మీడియా వింగ్ చైర్పర్సన్ రాజయోగి బి.కె. కరుణ సందేశాన్ని వీడియో ద్వారా ప్రదర్శించారు. జాతీయ మీడియా కోఆర్డినేటర్ బి.కె. సుశాంత్ భాయిజీ మాట్లాడుతూ ఆత్మజ్ఞానం, పరమాత్మతో అనుసంధానం ద్వారా పొందే అంతరంగ శాంతి వల్ల ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొని బాధ్యతాయుతమైన మీడియా కంటెంట్‌ను సృష్టించవచ్చని తెలిపారు. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ వర్మ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు 'సత్యం, శివం, సుందరం', 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' సూత్రాలను పాటించాలని, సానుకూల వార్తల ద్వారా సమాజానికి ఆశ కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాజయోగ టీచర్స్ సిస్టర్ అంజలి ఒత్తిడి నిర్వహణపై, సిస్టర్ ఉమా రాణి ధ్యాన విధానాలుప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో హైదరాబాద్ మీడియా కోఆర్డినేటర్ బి.కె. కవిత పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని తగ్గించారు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 90 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 75 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించారని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మరికొన్ని రోజుల తర్వాత ఏకంగా కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటిస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఒక వైపు కోటి 41 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండిందని గొప్పలు చెబుతు, మరోవైపు కొనుగోలు మాత్రం 75 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితం అంటారా అని ప్రశ్నించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామంటూనే ప్రభుత్వం నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని తగ్గించుకున్నారని హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రైతు డిస్కం భయాందోళనపై స్పష్టతనివ్వాలి?

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రైతు డిస్కం ఏర్పాటు ప్రతిపాదన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంల పనితీరు, ఆస్తుల పంపిణీ, రైతులకు విద్యుత్ సరఫరా, ఖర్చు, క్రాస్ సబ్సిడీ, రైతులలో నెలకొన్న అనుమానాలు, భయాందోనళలు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై స్పష్టత ఇస్తూ ప్రభుత్వం ఈఆర్‌సికి కొత్తగా పిటిషన్ ఇవ్వాలని ఆమె కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రైతు డిస్కం ఏర్పాటుపై ఈఆర్‌సి శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ విచారణలో ఆమె రైతు సంఘం తరపున అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ రైతు డిస్కం పనివిధానానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు, రైతు డిస్కంకు బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. '' రైతు డిస్కం ప్రకటన అనంతరం రైతుల మధ్య ఒక ఆశావాహ వాతావరణం ఏర్పడింది. అయితే రైతు డిస్కం ఏర్పాటుపై చాలా సందేహాలు చోటుచేసుకున్నాయి. ఈ డిస్కమ్ ఏర్పాటు అయితే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుందా లేదా అనేది చర్చ చేస్తున్నారు. ఎవరైనా రైతు చనిపోగానే సుమోటాగా తీసుకుని వెనువెంటనే ఆ కుటుంబాన్ని అన్ని రకాలు ఆదుకోవడం, సహాయ సహకారాలు అందిన దాఖలాలు లేవు. అందు కోసం రైతు సమస్యలు అన్నింటిని చిన్నవైనా సరే పరిష్కారం అవ్వటానికి చర్యలు తీసుకుంటాం అని స్పష్టంగా పేర్కొనాలి. అసలు పిటిషన్‌లో సప్లై కాస్ట్ ఎంత అవుతుందనే వివరాలు లేవు. పవర్ ప్రొక్యూర్‌మెంట్, అలకేషన్ గురించి వివరాలు లేవు. డిపిఆర్‌ల కంటే ట్రాన్స్‌ఫార్మర్లకు ఎల్‌టి సైజ్ మీటర్లు బిగిస్తామంటున్నారు. వీటికి సంబంధించి కూడా స్పష్టత లేదు. నియోగదారుల సమస్యల పరిష్కార ఫోరాలు రెండు ఇస్తామని ప్రకటించారు. అవి రెండు కూడా కరెక్ట్ కాదు పెద్ద ఎత్తున ప్రతి జిల్లాకు ఒకటి పెట్టగలిగితేనే రైతు వెనువెంటనే జిల్లా కేంద్రంలో సమస్యలు చెప్పుకోవటానికి వీలు ఉంటుంది. దానికి సంబంధించిన ఆలోచన కూడా ఉండాలి. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలలో వచ్చే లాభాల్లో సబ్సిడీతో పాటు ఉద్యోగుల జీత భత్యాలు చెల్లిస్తున్నారు. రైతు డిస్కమ్‌లో వీటికి సంబంధి ఆంచిన వివరాలు లేవు'' అని పశ్య పద్మ కమిషన్ ముందు తన అభిప్రాయాన్ని వివరించారు.



జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను రాంచీ కాంకేరోడ్డులోని ఆయన నివాస, కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కె. రాజు,జార్ఖండ్ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ మహతో కమలేష్ తదితరులు.

## 'పెద్ది' టిక్కెట్ ధరల పెంపు పిటిషన్ వాపస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' సినిమా టిక్కెట్ ధరలను తొలి ఏడు రోజుల పాటు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ మైత్రీ మూవీ మేకర్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులను మరోసారి ఆశ్రయించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ నిర్మాణ సంస్థ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. ప్రభుత్వం తమ వినతిపత్రాలపై నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించగా, టిక్కెట్ ధరల పెంపు అంశంపై ఇప్పటికే పలు కేసులు, కోర్టు ధిక్కరణ వ్యవహారాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. సినిమా విడుదల జూన్ 4న ఉండటంతో పిటిషన్ ప్రయోజనం ఉండదని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొనగా, అధికారులను నేరుగా సంప్రదించేందుకు స్వేచ్ఛ ఇస్తూ హైకోర్టు పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇచ్చిన న్యాయమూర్తి జస్టిస్ ఎస్. చలపతిరావు కేసును కొట్టివేస్తూ తుది ఉత్తర్వులను జారీ చేశారు.

# రూ.15 లక్షల సుపారీతో పథకం ప్రకారం హత్య

- ప్రధాన కుట్రదారులతో సహా పలువురు అరెస్ట్ అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ హత్యకేసు ఛేదించిన హైదరాబాద్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ హత్య కేసును హైదరాబాద్ సిటీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన కుట్రదారులతో పాటు హత్య అమలు చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ వెల్లడించింది. విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు ఆయన వెల్లడించారు. ఈ నెల 23వ తేదీ ఉదయం మసాబ్‌ట్యాంక్‌లోని నివాసం నుంచి ఈతకు వెళ్లేందుకు బయలుదేరిన అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్‌ను ఓ స్కార్పియో వాహనం వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. తొలుత ప్రమాదంగా భావించిన ఈ ఘటనపై పోలీసులు సిసిటివి ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను పరిశీలించగా ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా తేలింది.పోలీసుల దర్యాప్తులో వక్ఫ్ ఆస్తులు, నిర్వహణ వ్యవహారాలకు సంబంధించి నిందితుల కుటుంబం, మొయిజుద్దీన్ మధ్య చాలా కాలంగా వివాదాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ కేసుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరాభవాలకు మొయిజుద్దీన్ కారణమని భావించిన ముజాహిద్ ఆలమ్ ఖాన్ అలియాస్ బాబా, అతని తండ్రి మహబూబ్ ఆలమ్ ఖాన్ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. రూ.15 లక్షల సుపారీతో ఈ హత్యకు ప్రణాళిక రూపొందించగా, మొదట స్కార్పియో వాహనం కొనుగోలుకు రూ.2 లక్షలు అందించినట్లు దర్యాప్తులో బయటపడింది. జనవరి నెల నుంచే నిందితులు మొయిజుద్దీన్ ఇంటి వద్ద, ఆయన తరచుగా వెళ్లే ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడు కిషన్ అలియాస్ పప్పును హర్యానాలోని పానిపట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా ప్రధాన నిందితుడు ముజాహిద్ ఆలమ్ ఖాన్‌తో పాటు పలువురిని జూబ్లీహిల్స్, ఎంజిబిఎస్ ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. హత్యలో ఉపయోగించిన స్కార్పియో వాహనం, రూ.10.10 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యను అమలు చేసిన అభిజీత్ అలియాస్ నాని వాహనం నడిపినట్లు, వినయ్ వాహనం సమకూర్చి పథక రచనలో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. మరికొందరు నిందితులు ఇప్పటికే పలు క్రిమినల్ కేసుల్లో కూడా నిందితులుగా ఉన్నట్లు వెల్లడించారు. మిగతా పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, కేసుకు సంబంధించిన మరిన్ని సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును అబిడ్స్ ఎసిపి పి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాంపల్లి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్‌ఐ ఆదిల్ రియాజ్ ఖాన్, ప్రత్యేక బృందాలు ఛేదించినట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు పేర్కొన్నారు.

### టిపిసిసి ఉపాధ్యక్షులు అలమ్‌ఖాన్‌పై కాంగ్రెస్ బహిష్కరణ వేటు

టిపిసిసి ఉపాధ్యక్షులు ముజాహిద్ అలామ్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ చేస్తున్నట్లు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపి మల్లు రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మొయినోద్దీన్ హత్య కేసులో అలామ్ ఖాన్‌తో పాటు ఆయన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు.ఈ హత్య అంశాన్ని క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించి ఆయనపై కాంగ్రెస్ బహిష్కరణ వేటు వేశామని ఆయన వివరించారు.



## మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్‌సి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌సి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో అంశంపైన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక స్థాయిలో తలెత్తుతున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలన్నారు. దళితులు, గిరిజనులు, బిసి వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కట్టుబడి పనిచేస్తోందన్నారు. విగ్రహాల ప్రతిష్టాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జిహెచ్‌ఎంసి, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల మనోభావాలను కూడా గౌరవించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు నెలకొంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (వెల్ఫేర్) సభ్యసాచి ఘోష్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరి, ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, హైదరాబాద్ డిసిపి II కాజల్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, ఎసిఎల్‌బి జి. జితేందర్ రెడ్డి, ఎస్‌పిడిడి విసి , ఎండి(ఎఫ్‌ఏసీ) హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థ పాఠశాలకు ప్రత్యామ్నాయ భవనం కల్పించాలి: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తార్నాకలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల శిథిలావస్థ భవనంలో కొనసాగుతుండటంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రత్యామ్నాయంగా విజయ డెయిరీ ఆవరణలో ఖాళీగా ఉన్న రెండు క్వార్టర్లను కేటాయించే అంశంపై ప్రభుత్వం ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడాన్ని తప్పుబట్టింది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తగిన ఏర్పాట్లపై సత్వర నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. లేకపోతే తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. 1961 నుంచి కొనసాగుతున్న ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినుల భద్రతకు ముప్పు ఏర్పడిందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విజయ డైరీకి చెందిన భూమిలో ఉన్న రెండు గదులను పాఠశాలకు ఇవ్వాలన్న వినతి పత్రంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పుడున్న భవనం శిథిలావస్థకు చేరిందని ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించేలాగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ చలపతిరావు స్పందిస్తూ.. పిల్లల విద్యా హక్కు, భద్రతకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వినతిపత్రాన్ని పరిశీలించి ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సానుకూల నిర్ణయం తీసుకొని పక్షంలో తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హాజరు కావాలని ఆదేశించాల్సి వస్తుందన్నారు. విచారణను వాయిదా వేశారు.

# ఓట్ల తొలగింపుల కుట్రలు అడ్డుకోవడమే లక్ష్యం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కీలక శిక్షణ కార్యక్రమం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ టిపిసిసి మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమంలో బూత్‌లేవల్ ఏజెంట్ల (బిఎల్‌ఎ)కు పిలుపునిచ్చారు. గాంధీ భవన్‌లో ఎస్‌ఐఆర్, బిఎల్‌ఎ2లపై కాంగ్రెస్ పార్టీ కీలక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, కార్యదర్శి సచిన్ సావంత్, శిక్షణ విభాగం చైర్మన్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి పాల్గొన్నారు. టిపిసిసి మాస్టర్ ట్రైనీలకు ఎఐసిసి శిక్షణ విభాగం నుంచి వచ్చిన నిష్ణాతులైన ట్రైనర్లు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఎఐసిసి నుంచి వచ్చిన సౌరబ్, నిశాంత్, అనూష తదితరులు మాస్టర్ ట్రైనీలకు బూత్ స్థాయి బాధ్యతలు, ఓటర్ల జాబితా పరిశీలన, బిఎల్‌ఎల పాత్రపై అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు అనంతరం నియోజకవర్గ స్థాయిలో బిఎల్‌ఎలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ లో సంస్థాగత నిర్మాణాన్ని దేశంలోనే అత్యంత పకడ్బందీగా అమలు చేశామని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో నిర్వహించాం. దాదాపు 90కి పైగా నియోజకవర్గాల్లో బిఎల్‌ఏల నియామకాలు పూర్తయ్యాయి. జిల్లా, మండల కమిటీల ఏర్పాటు కూడా దాదాపు పూర్తి అయింది అని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది ఓట్ల తొలగింపుతో రాజకీయ పరిస్థితులు మారిపోయాయని ఆయన ఆరోపించారు. అక్కడ 93 లక్షల ఓట్లలో 60 లక్షల ఓట్లు తొలగించిన ఘటనలు వెలుగు చూశాయి. బిజెపి కుట్రల వల్ల అక్కడ ప్రభుత్వమే మారిపోయింది. తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాకుండా ప్రతి ఓటును కాపాడుకోవాలి అని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం అత్యంత కీలకమైందని, క్షేత్రస్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త దీన్ని సమర్థంగా అమలు చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. దేశంలో బిజెపి విషపూరిత రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఓటర్ల జాబితాల పరిరక్షణలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఒకే కార్డులో 'యూనిఫైడ్ వెల్ఫేర్' కార్డు

రూపొందించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణరావు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ఒకే కార్డులో పొందుపరిచే విధంగా యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డును రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణరావు అధికారులను ఆదేశించారు. 'యూనిఫైడ్ స్మార్ట్ కార్డు' ద్వారా పౌరులకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే కార్డుతో అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి సంబంధించి వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న స్మార్ట్ కార్డు విధానాన్ని అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో రామకృష్ణరావు శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు పారదర్శకతను పెంపొందించడం, డిజిటల్ సేవలను ఒకే వేదికపై అందించడమే యునిఫైడ్ స్మార్ట్ కార్డ్ ఉద్దేశమన్నారు. ఒకే కార్డును అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధి పొందే విధంగా కార్యాచరణను రూపొందించాలన్నారు. రేషన్,పెన్షన్, మహాలక్ష్మి, తదితర అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఒక్క కార్డుతో అనుసంధానం చేయాలని, తద్వారా ప్రజలకు అందించే సేవలను సులభతరం చేయాలన్నారు. ప్రజల డేటా, భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి రానున్న పది రోజుల్లో తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, పెన్షన్ డేటా, ఆరోగ్య ప్రొఫైల్ వంటి సమాచారం కూడా ఈ కార్డుకు అనుసంధానం చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని రామకృష్ణరావు ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్యకార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానీయా, శైలజా రామయ్యర్, యోగితారాణా, క్రిస్టియాన జెడ్ చొంగ్తు, 'సిజిజి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రవిగుప్తా, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, రఘునందన్ రావు, సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ జి.ముకుందరెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఆర్ టిసి ఎం.డి. నాగి రెడ్డి, సంయుక్త కార్యదర్శి అనుదీప్ తదితర అధికారులు పాల్గొన్నారు.




## పారిశ్రామికవాడలో హిల్ట్ పాలసీపై సమావేశం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిఐఎ భవనంలో హైదరాబాద్ ఇండస్ట్రీయల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్(హిల్ట్) పాలసీ గూర్చి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇడి పవన్‌కుమార్, జెడ్ఎం బి మధు, కమిషనర్ ప్రభాకర్‌లు హాజరై హిల్ట్ గూర్చి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించడానికి, పరిశ్రమలను నగరానికి వెలుపలికి తరలించడానికి ప్రవేశ పెట్టిన పాలసీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి, సిఐఎ ప్రెసిడెంట్ డిసిరెడ్డి, టిఫ్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, రోషిరెడ్డి, జలధర్‌రెడ్డి, తాటి శ్రీనివాస్, దస్తగిరి, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి నగర్ కాలనీ కంపౌండ్ వాల్‌కు అనుకుని ఉన్న ఎన్ఎఫ్‌సి టిఐఎఫ్ గ్రౌండ్‌లో చెట్లు అధికంగా ఉండడంతో పాములు బెడద ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కాలనీవాసులు విన్నవించగా ఆయన ఎన్ఎఫ్‌సి అధికారులను సంప్రందించి చెట్లను తొలగించాలని సమస్యను తెలిపారు. దీనికి స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు ప్రజలకు లేకుండా చూడాలి

### మాజీ చైర్‌పర్సన్ పావనిజంగయ్య యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మిషన్ భగీరథ డిఈ మహేందర్ అధికారితో ఫోన్ ద్వారా చర్చించడం జరిగిందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఘట్‌కేసర్ సర్కిల్ 6వ డివిజన్ పరిధిలోని గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ మంచినీరు రాకపోవడంతో సంబంధిత డిఈ మహేందర్ అధికారులతో ఫోన్ ద్వారా చర్చించగా ఘనపూర్ గుట్ట సమీపంలో పంప్ హౌస్ మోటర్ పాడైపోయిందని తెలిపారు. మోటర్‌ను తొందర్లో రిపేర్ చేసి మధ్యాహ్నంలోగా ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని డిఇ మహేందర్ అధికారి తెలిపారని ముల్లిపావని జంగయ్య యాదవ్ అన్నారు.

## బీరువా తాళం విరగ్గొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లోని ప్రజయ్‌హోమ్స్‌లో బిల్లా అంజనేయులు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. గత నాలుగు రోజుల క్రితం తన భార్య, చిన్న కూతురు కలిసి మీయాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి అంజనేయులు ఉద్యోగానికి వెళ్లాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి రాగా ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి బట్టలు అన్ని చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 80 గ్రాముల బంగారు ఆభరణాలు, కొంత నగదు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని జీనోమ్‌వ్యాలీ పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ గురువయ్య తెలిపారు.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం - 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ఆరేళ్ల అమాయక బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి మేడ్చల్ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిఆర్పీఫ్ అరుంధతినగర్ ప్రాంతంలో నివసించే ఆరేళ్ల మైనర్ బాలికపై 2024 డిసెంబరు 1న అత్యాచారం జరిగినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితుడు ఉత్తరప్రదేశ్‌రాష్ట్రం ఆలహాబాద్‌కు చెందిన పర్వేష్ యాదవ్(25)గా గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి దర్యాప్తులో నిందితుడు నేరం ఒప్పుకోవటంతో తగిన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో హాజరుపరచిన దరిమిలా రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుండి చర్లపల్లి కేంద్ర కారాగారంలో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిపై పోక్సో కోర్టు సుదీర్ఘంగా విచారించిన అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించారు.



## ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన ఆర్‌డిఒ వాసుచంద్ర

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని కొండయపల్లి గ్రామంలో గ్రామసభలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన ఆర్‌డిఓ వాసుచంద్ర ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం భూమి సేకరించడానికి ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం దోమ తహసాల్దార్ గోవిందమ్మతో కలిసి గ్రామస్తుల నుండి వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి రియల్ ఎస్టేట్ రంగం కీలకం

### నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు, వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సావనీర్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, పురోగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరాన్ని రాబోయే పదేళ్లలో ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కార్యాచరణ కొనసాగిస్తుందని తెలిపారు. ఫ్యూచర్ రెడీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, ఎఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కు ఉపయోగపడే స్మార్ట్, పర్యావరణహిత నిర్మాణాలపై బిల్డర్లు దృష్టి పెట్టాలని సూచించారు. 2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక అమలు చేస్తోందని తెలిపారు.

బిల్డర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు డా. సత్యం శ్రీరంగం, నర్రా నాగేశ్వర రావు, నారెడ్కో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పూర్వ అధ్యక్షుడు హరిబాబు, తెలంగాణ అధ్యక్షుడు కె.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కాళీ ప్రసాద్, గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం. ప్రేమ్ కుమార్, టిబిఎఫ్ అధ్యక్షుడు సి. ప్రభాకర్‌రావు, చైర్మన్ వద్దేపల్లి రంగారావు, వైస్ చైర్మన్ బి.లక్ష్మి నారాయణ, అధ్యక్షుడు కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.వి. ప్రసాదరావు, ట్రెజరర్ సిహెచ్.రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు వేలువోలు శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు 2 బిహెచ్‌కె ఇళ్లు

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్






**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బాధితులకు 2 బిహెచ్‌కె ఇళ్లు కేటాయించేందుకు తెలంగాణా ప్రభుత్వం దేశంలోనే మొట్ట మొదటి సారిగా నిర్ణయం తీసుకోవటం గర్వ కారణమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కల్సి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 25వ తేదీన తహసీల్దార్లు వివిధ సంబంధించిన ప్రభుత్వ శాఖాధికారులతో తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయటంలో జాప్యం తగదన్నారు. పోలీసు శాఖ సైతం పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలన్నారు. మేడ్చల్ జిల్లాలో ఒక్కరే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉండటం వల్ల పలు అట్రాసిటీ కేసుల్లో వారి అభిప్రాయాలు తీసుకోవటంలో జాప్యం ఏర్పడుతున్నందున మరో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ డివిఎంసి కమిటి ద్వారా తగిన చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కోరారు. తప్పనిసరిగా మూడు నెలలకో సారి డివిజన్ స్థాయిలో సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలన్నారు. సఫాయి కర్మచారిల గురించి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, సఫాయి కర్మచారిలకు అందించే పిపిఈ కిట్, ప్రొటెక్టివ్ కిట్లను క్రమం తప్పకుండా అందేలా మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు కలెక్టర్ ద్వారా లేఖలు రాస్తామన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిఈఓను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను దత్తత తీసుకొందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతంగా న్యాయం చేకూరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్న ఆయన దానికి కారణాలను ప్రశ్నించి ఏవైనా సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకొని రావాలన్నారు. నిబంధనల మేరకు అట్రాసిటీ కేసులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అయిన వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న 2 బిహెచ్‌కె ఇళ్లతో పాటు అదనంగా ఉపాధి, పెన్షన్ అందేలా రెవెన్యూ అధికారులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, డివిఎంసి సభ్యులు, డిఆర్ఓ మాలతి, ఆర్డీఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్ తదితర జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్

### సర్పంచ్ జి.శేఖర్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహణ నవాబుపేట మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌కు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (MAMS) హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందం ఈ క్యాంప్‌లో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముఖ్యంగా ఎముకలు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, మెడ నొప్పి, కండరాల సమస్యలు, చేతులు కాళ్ల నరాల బలహీనత వంటి అనేక వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. అలాగే అవసరమైన వారికి సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్, ఎక్స్‌రేలు, రక్తపరీక్షలు వంటి వైద్య పరీక్షలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భం గా సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మెడికల్ క్యాంప్ కార్యాలయంలో ఉపసర్పంచ్ ధీరత్ రెడ్డి, వార్డు సభ్యులు, వైద్యులు మానవ్ గుప్త, ఆర్యన్ కుమార్, పిఆర్ఒ కావ్య, సౌర్యా, మెడికల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, సుధీర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, భీమ్ రెడ్డి,యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లుతో పొంచి ఉన్న ప్రమాదాలు

### తిమ్మారెడ్డిపల్లి , నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఘటనలు



**ప్రజాపక్షం/నవాబుపేట్:**నవాబుపేట మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రహదారుల పక్కనే రక్షణ లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడంతో పాటు వైర్లు కూడా బయటకు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజు ఈ మార్గంలో రైతులు, ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండగా, పశువులు కూడా ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో సంచరిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ షాక్ ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, ప్రమాదకర వైర్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తొద్దు

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకాలు సకాలంలో పూర్తి చేసి నిర్ణీత సమయానికి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని మూడుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుగుణాబాయి. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటి తహసీల్దార్ భిక్షంలతో కల్సి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు మంచి నీరు, నీడ, మరుగు దొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించటంలో ఏ మాత్రం నిర్లక్ష్యం కనపరచవద్దన్నారు. తూకంవేసే ప్రక్రియలలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుం డా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. తూకం పూర్తి కాగానే ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## మాతా, శిశువుల సమగ్ర అభివృద్ధిలో బాధ్యతాయుతంగా ఉండాలి : శారద

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గర్భిణీ అయిన నాటి నుండి శిశువు రెండేళ్లు వచ్చే తొలి 1000 రోజులు బంగారు భవిష్యత్తుకు పునాది వంటిందని, మాతా శిశువుల సమగ్ర అభివృద్ధి విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి శారద అన్నారు.

ప్రారంభ బాల్య సంరక్షణ మరియు అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులోని బాపూజీ సెక్టార్‌లో జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాల ద్వారా శిశువు 1000 రోజులు చేరే వరకు బాలల సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ మరియు పిల్లల సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలోని భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రత, మానసిక, శారీరక అభివృద్ధి అంశాలపై శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించటంతో పాటు తల్లిదండ్రులకు సరైన మార్గదర్శకం చేస్తామన్నారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రాల్లో పోషకాహార ప్రదర్శనలను, తల్లి దండ్రులకు సమావేశాలు, పిల్లల ఆటపాటల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పిల్లల అభివృద్ధికి అవసరమైన పోషణ, ఆరోగ్యం, ప్రారంభ విద్య, నేర్చుకోవటం, స్పందనాత్మక శిశు సంరక్షణ, భద్రత, రక్షణ, తల్లి దండ్రుల శ్రేయస్సు లాంటి ఆరు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. అదే విధంగా గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవటం, తల్లిపాల ప్రాధాన్యత, స్పందనాత్మక పేరెంటింగ్, ఆటల ద్వారా నేర్చుకోవటం, బాలామృతం వినియోగం, హోమ్ విజిట్స్ ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## రేపు రైతులకు ఆదాయ రహస్యాల శిక్షణా కార్యక్రమం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఎదులాబాద్ డివిజన్ పరిధిలో అంకుషాపూర్ గ్రామంలోని పిట్టల ఆర్గానిక్ ఫార్మ్‌లో ఈ నెల 31వ తేదీ ఆదివారం ఒకరోజు ప్రత్యేక సేంద్రియ వ్యవసాయ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పిట్టల శ్రీశైలం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌లో తక్కువ భూమితో అధిక ఆదాయం ఎలా పొందాలనే అంశంపై రైతులకు, యువతకు, మహిళా రైతులకు ప్రాయోగికంగా అవగాహనకల్పించనున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సాగు ఖర్చులు, తగ్గుతున్న లాభాల నేపథ్యంలో చిన్న స్థలంలోనే ఆదాయవంతమైన వ్యవసాయం ఎలా చేయాలనే దానిపై ఈ శిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ముఖ్యంగా పావు ఎకరంతో నెలకు రూ.30వేల వరకు ఆదాయం సాధించే విధానాలు అనే అంశంపై ప్రత్యక్ష నమూనాలతో వివరణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో ఒకే బెడ్‌పై ఐదు రకాల పంటల పెంపకం, పంట వ్యర్థాలతో సులభంగా కంపోస్టు తయారీ లిక్విడ్ కంపోస్టు పద్ధతులు, బయోచార్‌తో గ్రోత్ ప్రమోటర్ తయారీ, రేయిస్డ్ బెడ్ నార్మాణం పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అనేక అంశాలను ప్రాక్టికల్ డెమోతో చూపించనున్నారు. రైతులు ఎదుర్కొంటు న్న సమస్యలపై ప్రత్యక్ష చర్చలు కూడా నిర్వహించనున్నారు. నిపుణులు పిట్టల శ్రీశైలం శిక్షకుడుగా వ్యవహరించనుండగా, సమన్వయ బాధ్యతలను పిట్టల తెలంగాణ కోకిల నిర్వహిస్తున్నారు. కోర్సు ఫీజు ఒక్కరికీ రూ.1000గా నిర్ణయించగా ముందస్తు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశం కల్పించనున్నట్లు శ్రీశైలం తెలిపారు.




## దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

### కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :**ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం ద్వారా దోమల రహిత నగరంలా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని ఎంఎంసి కీసర సర్కిల్ డిప్యూటి కమిషనర్ వసంత అన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న తరహాలోనే చంద్రపురికాలనీ చెన్నాపురంలో డ్రై డేలో పాల్గొన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం దోమలను ముందస్తుగానే నివారించటం అవసరమన్నారు. దీనివల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులను అరికట్టవచ్చన్నారు. తాము శాఖాపరంగా క్రమం తప్పకుండా అన్ని ప్రాంతాల్లో నూ ఫాగింగ్ చేస్తుంటామని, కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లటం చేస్తుంటామన్నారు. అనంతరం సిబ్బంది, కాలనీవాసులతో కల్సి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, తిరుపతిరాజు, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చేవెళ్ల నియోజకవర్గ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కాలే యాదయ్య, సాధారణ కుటుంబం నుంచి ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లో కి వచ్చిన ఆయన, ప్రజల నమ్మకాన్ని సంపాదించి నేడు ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాలే యాదయ్య, నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్లు, విద్యుత్ సౌకర్యాలు, పాఠశాల భవనాలు వంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తూ ప్రజలకు మౌలిక వసతులు అందిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్న ఆయన, రైతు భరోసా, పంట నమోదు, సాగునీటి సమస్యల పరిష్కారంపై అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అనేక కుటుంబాలకు భరోసాగా మారారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఉన్న వారికి చెక్కులు అందించి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. యువతకు ఉపాధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో స్వయంగా పాల్గొంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందించడం ఆయన నాయకత్వానికి నిదర్శనం.

## టిజి ఈసెట్ -2026లో పూజిత 22వ ర్యాంక్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** టిజి ఈసెట్ 2026లో మౌలాలి సమీపంలోని ఎంజె కాలనీకి చెందిన ప్రాంతానికి చెందిన దశరథ రాములు, కళ్యాణిల కుమార్తె తనుకు పూజిత ఇంటిగ్రేటెడ్ ర్యాంక్‌లో 22వ స్థానంతో ప్రతిభ చాటింది. అదే విధంగా బ్రాంచ్ ర్యాంక్‌లో 10వ స్థానం సాధించింది. పూజిత కంప్యూటరింగ్ ఇంజనీరింగ్ డిప్లోమాలో అభ్యసించి ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 200 మార్కులకుగాను 145 మార్కులతో ర్యాంక్ సాధించటం పట్ల పలువురు అభినందించారు.

## సెల్ఫీ మోజులో చెట్టును ఢీకొన్న కారు — యువకుడు మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అతి వేగంగా కారును నడుపుతూ సెల్ఫీ వీడియో తీస్తున్న క్రమంలో కారు రోడ్డు దిగి చెట్టుకు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు స్విఫ్ట్ కారులో పెట్రోల్ కోసం కొల్తూర్ గ్రామానికి వెళ్లారు.

ఆ బంకులో పెట్రోల్ లేకపోవడంతో తిరిగి అనంతారంవైపు వస్తుండగా పద్మిని డైరీ సమీపంలోకి రాగానే కారు నడుపుతున్న దినేష్‌రెడ్డి కారును వేగంగా, అతి నిర్లక్ష్యంగా నడుపుతూ మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీస్తుండగా కారు రోడ్డు కిందకు దిగి అదుపుతప్పుతుండగా పక్కన కూర్చున మహ్మద్ రెహన్ హ్యాండ్‌గేర్ వేశాడు. దీంతో కారు స్పీడుగా వెళ్లి చెట్టును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ముందు కూర్చున మహ్మద్ రెహన్ తలకు, ముఖాని కి బలమైన రక్త గాయాలు అయ్యాయి. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు తగిలాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు మహ్మద్ రెహన్‌ను ఆర్‌విఎం ఆస్పత్రి కి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ గురువయ్య తెలిపారు. బక్రీద్ పండగ పూట మహ్మద్ రెహన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

## నాగారంలో నవజాత శిశువు లభ్యం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నవజాత శిశువు మృతదేహం లభ్యమైన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోలు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం విజయపురి కాలనీధోబీఘాట్ సమీపంలో 2 రోజుల నవజాత శిశువును ఉందని డయల్ 100 ద్వారా తిరుమలశెట్టి సోమరాజు సమాచారం అందించారు. శిశువును తెలుపు రంగు కవర్‌లో వదిలి వెళ్లారని మృత దేహం దుర్వాసన వస్తున్న శిశువును అంబులెన్స్‌తో కలసి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
30-05-2026
www.prajapaksham.in

‘ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా విడుదలకు సిద్ధమైంది. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలు ముంబాయి, భోపాల్ వంటి నగరాల్లో నిర్వహించారు. ’

# రీల్

## ట్రెండింగ్‌లో ‘మా ఇంటి బంగారం’ ట్రైలర్




త్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘మా ఇంటి బంగారం’. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని జూన్ 19న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. పదహారు మిలియన్‌లతో ట్రెండింగ్‌లో ఉండటం చాలా సంతోషంగా ఉందని సమాంత అన్నారు. మా ఇంటి బంగారం ట్రైలర్ అందరికీ నచ్చింది కాబట్టి ట్రెండింగ్‌లో ఉందని భావిస్తున్నారు ‘మా ఇంటి బంగారం’లో ప్రతీ ఎమోషన్ ఉంటుంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉంటుంది. యాక్షన్, డ్రామా, కామెడీ అన్ని అంశాలుంటాయి. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి. అభిమానులంతా గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది’ అని అన్నారు.

## ఇండస్ట్రీ పరువు తీయొద్దు

### దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి



ఇటీవల సినిమా ఈవెంట్స్, ఇతర వేదికలపై చిత్ర పరిశ్రమలో సమస్యల్లో ఉన్నాం, ఇబ్బందులు పడుతున్నాం అంటూ ఫిలింమేకర్స్ చెప్పడం చూస్తున్నాం. ఇలా టాలీవుడ్‌లోని కొందరు ప్రతిసారీ చేస్తున్న వ్యాఖ్యలపై దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి స్పందించారు. సినిమా అనేది అద్భుతమైన మీడియం అని, దాన్ని బాధల వేదికగా మార్చొద్దని ఆయన సోషల్ మీడియా పోస్ట్ చేశారు. ఏ రంగంలో అడుగుపెట్టాలన్నా కష్టాలు, ఒత్తిడులు, లాభనష్టాలు ముందే అంచనా వేసుకుని, అర్థం చేసుకుని వస్తారని, సినిమా ఇండస్ట్రీ కూడా అంతేనని మధుర శ్రీధర్ రెడ్డి తన పోస్ట్ లో పేర్కొన్నారు. మంచి చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుందని ఆయన అన్నారు. బిజినెస్‌లోనైనా రిస్కులు, ఒత్తిడులు, నష్టాలు సహజం. వాటిని ముందే అర్థం చేసుకుని రంగంలోకి వస్తారు& సినిమా కూడా అంతే. నిజంగా పరిస్థితులు అనుకూలంగా లేవనిపిస్తే సినిమాలు తీయకండి. ఇండస్ట్రీ నుంచి బయటకు వెళ్లిపోండి. కానీ ప్రతిసారి మైకు ముందు వచ్చి సమస్యలు సమస్యలు& అంటూ ఏడవడం వల్ల ఇండస్ట్రీ పరువు మాత్రమే పోతుంది...ఇదేదో ప్రపంచ సమస్య అయినట్టు& భారతదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభం అయినట్టు. సినిమా ఒక బిజినెస్& ఛారిటీ కాదు! సిన్సియర్‌గా సినిమాలు తీయండి. వర్కౌట్ అయితే ఉండండి& వర్కౌట్ కాకపోతే బయటికి వెళ్లి వేరే బిజినెస్ చేసుకోండి. ఒక సినిమాలో నష్టం వస్తే& ఆ నష్టాన్ని తట్టుకునే శక్తి ఉంటే ఇంకో సినిమా తీయండి. లేకపోతే ఆగిపోండి. మీ సమస్యలు, మీ కంపెనీ సమస్యలు, మీ వ్యక్తిగత సమస్యలు అన్నీ కూడా సినిమా ప్రాజెక్ట్‌పై రుద్దకండి. నిమా ఒక అద్భుతమైన మీడియం. దాన్ని బాధల వేదికగా మార్చొద్దు. సిన్సియర్‌గా సినిమాలు తీయండి& ప్రతి మంచి సినిమాకి ప్రేక్షకుల్లో ఒక మంచి స్థానం తప్పకుండా ఉంటుంది. అన్నారు.

## 10న ‘భైరవ ద్వీపం’ రీ–రిలీజ్

గత కొన్ని నెలలుగా తెలుగులో రీ–రిలీజ్ ట్రెండ్ మళ్లీ మొదలైంది. ఒకప్పుడు తెలుగులో పాత సినిమాలు రీ–రిలీజ్‌లు అనేవి ఎక్కువగా ఉండేవి. శాటిలైట్, డిజిటల్ ఎంట్రీతో వీటి దూకుడు తగ్గింది. తాజాగా తెలుగులో పాత సినిమాల రీ రిలీజ్ అనే ట్రెండ మళ్లీ మొదలైంది. ఈ మధ్య పాత సినిమాలను రీ మాస్టర్ చేసి 4కే లో మరోసారి విడుదల చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆ కోవలో ఇప్పటికే మురారి, పోకిరి, జల్సా, ఘరానా మొగుడు, బిల్లా, చెన్నకేశవ రెడ్డి, ఖుషీ,సింహాద్రి, తొలి ప్రేమ, బిజినెస్ మేన్ వంటి చిత్రాలు రీ రిలీజ్‌లో మంచి వసూళ్లనే సాధించాయి. తాజాగా నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన ఎవర్ గ్రీన్ క్లాసిక్ ‘భైరవ ద్వీపం’సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న ఈ చిత్రాన్ని రీ–రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాను లెజెండ్రి దర్శకుడు సింగీతం శ్రీనివాస రావు తెరకెక్కించారు.ఈ సినిమాలో రోజా హీరోయిన్ గా నటించింది.





## ఆగస్టు 14న ‘ప్రపంచ’ వ్యాప్తంగా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ మూవీ



సూర్య – వెంకీ అట్లూరి కలయికలో రూపొందుతోన్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 14న ఘనంగా థియేటర్లలో విడుదల కానుం ది. బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భావోద్వేగాలు, హాస్యం, హృదయాన్ని తాకే కుటుంబ అనుబంధాలతో ఈ సినిమా ప్రేక్షకులకు పూర్తి స్థాయి వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. సార్/వాథి, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస విజయవంతమైన చిత్రాలను అందించిన దర్శకుడు వెంకీ అట్లూరి, మరోసారి బలమైన కుటుంబ విలువలు, హృద్యమైన కథనం కలిగిన ఒక ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌ను అందించబోతున్నారు. ఈ చిత్రంలో మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బంగ్లాన్ కళా దర్శకుడిగా పనిచేస్తున్నారు. తమిళనాడులో ఈ చిత్రాన్ని థింక్ స్టూడియోస్ విడుదల చేయనుండగా, రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. సూర్య, మమి తా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు నటిస్తున్నారు.ఈ చిత్రానికిసంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి, కూర్పు: నవీన్ నూలి, కళ: బంగ్లాన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యలమంచిలి గోపాల కృష్ణ (నాని), ఫైట్ మాస్టర్: వి వెంకట్.

## నార్త్ అమెరికాలో... జూన్ 3న ‘పెద్ది’




రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా విడుదలకు సిద్ధమైంది. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలు ముంబాయి, భోపాల్ వంటి నగరాల్లో నిర్వహించారు. ఇప్పటికీ అభిమానులలో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ సినిమా ఇండియాలో జూన్ 4న విడుదల కానుంది. కాని నార్త్ అమెరికా లో మాత్రం ఒక రోజు ముందే ..అంటే జూన్ 3న ప్రిమియర్ షోలు వేసుకున్నారు. నార్త్ అమెరికా లో నెలకొన్న క్రేజ్ నేపథ్యంలో అక్కడ భారీగా టికెట్స్ అమ్ముడు పోయినట్టు నిర్మాతలు చెబుతున్నారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు ఇప్పటికే శ్రోతలను ఆకట్టుకుంటున్నాయి. ‘పెద్ది’ సినిమా బ్యానర్‌పై సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తోంది.

## సస్పెన్స్ థ్రిల్లర్‌గా ‘రెడ్ బ్యాగ్’



డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి, మెమరీ మేకర్స్ బ్యానర్ మీద ‘ది రెడ్ బ్యాగ్’ అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహ సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రీసెంట్‌గా రాశీ పాత్రకు సంబంధించిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది.తాజాగా హీరోయిన్ రాధ్య పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆమెను చూపించిన తీరు, గన్ను పట్టుకున్న విధానం, చేతిలో ఉన్న ఆ వస్తువు ఇలా అన్నీ హైలెట్ అవుతున్నాయి. పవర్ ఫుల్ లుక్‌లో రాధ్య అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తొలి సినిమానే అయినా, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు. త్వరలోనే టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ చేయనున్నారు



## ఏఐటియుసి నేత వివిఎస్ మూర్తి మృతి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఏఐటియుసి సీనియర్ నాయకులు కామ్రేడ్ వివి ఎస్ మూర్తి (83) గురువారం రాత్రి 10 గంటలకు ఆకస్మికంగా గుండె పోటుకు గురై తుది శ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన బిఎస్ఎన్ఎల్‌లో 35 ఏళ్లు పని చేసి అసిస్టెంట్ మేనేజర్ హోదాలో 2002లో పదవీ విరమణ చేశారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణా సర్కిల్ సెక్రటరీగా, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ టెలికామ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆంధ్ర సర్కిల్ కార్యదర్శిగా, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ పెన్షనర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శిగా, ఏఐటియుసి ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, ఏఐటియుసి రాష్ట్ర కమిటి నిర్వహించే కార్మిక బాట మాసపత్రిక సంపాదకులుగా 2014 వరకు పని చేసారు. విశాలాంధ్ర, మన తెలంగాణా, ప్రజాపక్షం దినపత్రికలకు వివిధ అంశాలపై ప్రత్యేక వ్యాసాలను అందించారు. 2016లో విజయవాడ నునండి హైదరాబాద్ దమ్మాయిగూడలో కొంత కాలం నివాసం ఉన్న ఆయన కుమారుడు ఉంటున్న సాకేత్ కాలనీలో ఉంటున్నారు. మూర్తి మృతి విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసూఫ్, కప్రా ఏరియా నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, ఏఐటియుసి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ప్రధాన కార్యదర్శి ఏఎస్ బాలరాజ్, ఉపప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటియుసి జాతీయ నాయకురాలు బివి విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఉజ్జిని రత్నాకరరావు, ప్రేమపావని, కార్యదర్శి ఎఎన్ కరుణకుమారి, తదితరులు ఆయన నివాసానికి వెళ్లి పార్థీవదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాయంత్రం ఆయన పార్థీవదేహాన్ని గాంధీ వైద్యకళాశాలకు కుటుంబ సభ్యులు, బంధువులు, కార్మిక నేతలతో కల్సి అందచేసారు.

## 3400 అదనపు మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

వడగాలులకు సంబంధిత మరణాలను విశ్లేషించింది. ఈ అధ్యయనం ఫ్రాంటియర్స్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ అనే జర్నల్‌లో ప్రచురితమైంది. దేశంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) నుంచి సేకరించిన జిల్లా స్థాయి మరణాల రికార్డులు, 2024 జనాభా అంచనాలను విశ్లేషించి పరిశోధకులు ఈ నివేదికను రూపొందించారు. ఈ అధ్యయనానికి సంబంధించిన విషయాలను పరిశోధకులు పీయూష్ నారంగ్, అశోక్ గాడ్గిల్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్త అధ్యయనాలు వేడికి సంబంధిత మరణాలు పెరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ భారత్‌లోని పలు జిల్లాల్లో వడగాలులు మరణాలను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై సరైన సమాచారం అందుబాటులో లేదన్నారు. ఈ నేపథ్యంలో నమోదైన అదనపు మరణాలు డేటా ఆధారంగా పరిశోధకులు ఈ నివేదికను రూపొందించారు. గత కొన్ని రోజులుగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మించిపోయా యి. ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలో తీవ్రమైన వడగాలులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే ముఖ్యంగా దేశవ్యాప్తంగా సంభవించే మొత్తం ఎండ మరణాల్లో సింహభాగం ఐదు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. ఉత్తర్ ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోనే అత్యధికంగా మరణాలు నమోదవుతున్నాయని తెలిపింది. ఐదు రోజుల వడగాలుల సమయంలో ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే సుమారు 8,100 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని చెప్పింది. అదే సమయంలో అహ్మదాబాద్, జైపూర్, సూరత్ వంటి జిల్లాల్లో ఒక్కోసారి 250కి పైగా అదనపు మరణాలు సంభవిస్తున్నాయని తమ నివేదికలో పరిశోధకులు పేర్కొన్నారు.

### ముప్పు తీవ్రతను బట్టి నిధులు

‘ఒకే రోజు తీవ్రమైన వేడి కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని మేము అంచనాకు వచ్చాము. ఐదు రోజుల వడగాలుల వల్ల దాదాపు 30,000 మరణిస్తారు. ఎండల వల్ల తీవ్రంగా నష్టపోతున్న ఐదు రాష్ట్రాలు దేశ జిడిపికి అందిస్తున్న వాటా కేవలం 29 శాతం. కానీ మరణాల భారంలో వీటి వాటా 66 శాతంగా ఉంది. అంటే వెనుకబడిన రాష్ట్రాలపై వాతావరణ మా ర్పుల ప్రభావం 2.3 రెట్లు ఎక్కువ పడుతోంది. అందుకే నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ , వాతావరణ మార్పులపై ప్రణాళిక కింద ఇచ్చే కేంద్ర నిధులను కేవలం జిడిపి ఆధారంగా ఇవ్వకుండా, ముప్పు తీవ్రతను బట్టి ఇస్తే బాగుటుంది‘ అని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

### 100 జిల్లాల్లోనే మూడో వంతు ప్రజలు

ఇదిలా ఉండగా, దేశంలో కేవలం కొన్ని ప్రాంతాల్లోనే ఈ తీవ్రమైన వడగాల్పుల ముప్పు ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒక ఐదు రోజుల పాటు తీవ్రమైన హీట్ వేవ్ వస్తే సంభవించే అదనపు మరణాలలో 44 శాతం మరణాలు 100 జిల్లాలోనే నమోదయ్యే అవకాశం ఉందని ఈ అధ్యయనం గుర్తించింది. ఇక్కడ ఇంకో మూడో వంతు ప్రజలు నివసిస్తున్నారు. మైదాన హీట్‌వేవ్‌గా ప్రకటిస్తారు. అదే సమయంలో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే వాటిని ’తీవ్రమైన వడగాలులు’గా వర్గీకరిస్తారు. ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీల దాటిన వేళ ఈ అధ్యయనం ప్రభుత్వానికి మేలుకొలుపు అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## దూసుకెళ్లిన గుజరాత్ టైటాన్స్

(మొదటి పేజీ తరువాయి)

బౌండరీలతో చెలరేగగా గుజరాత్ పవర్ ప్లేలో 69 పరుగులు చేసింది. క్రీజునంటుకున్న ఈ జోడీని విడదీసేందుకు పరాగ్ బౌలర్లను మార్చినా లాభం లేకపోయింది. 30 బంతుల్లో అర్థ శతకం అందుకున్న గిల్ను అనుసరిస్తూ సుదర్శన్ యాభైతో స్కోర్ వేగం పెరిగింది. అయితే.. విజయానికి 48 పరుగులు అవసరమైన వేళ సుదర్శన్ హిట్ వికెట్గా వెనుదిరిగాడు. బ్రిజేశ్ ఓవర్లో బౌండరీకి పంపిన సుదర్శన్ అనూహ్యంగా బ్యాట్ జారిపోయి వికెట్లకు తాకడంతో ఔటయ్యాడు. జడ్డూ ఓవర్లో బౌండరీతో ఈ సీజన్లో శతకం సాధించిన గిల్ను ఆర్చర్ ఎల్బీగా వెనక్కి పంపాడు. అప్పటికే గెలుపు వాకిట నిలిచిన గుజరాత్ సుందర్(16) వికెట్ కోల్పోయింది. బట్లర్(9 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ రాహుల్ తెవాటియా(17 నాటౌట్)లు గెలిపించారు. దాంతో.. ఉసూరుమంటూ రాజస్థాన్ ఇంటిదారి పట్టగా.. ఆర్సీబీతో టైటిల్ పోరుకు సిద్ధమైంది గుజరాత్.

**వైభవ్ విధ్వంసం**

ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన వైభవ్ సూర్యవంశీ(96) క్వాలిఫయర్ 2లో గర్జించాడు. తొలి రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని ఈ చిచ్చరపిడుగు తన స్టయిల్ విధ్వంసంతో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. టెన్నిస్ ఫోర్ ఆర్మ్ షాట్లతో అలరించిన ఈ కుర్రాడు. రవీంద్ర జడేజా(45 నాటౌట్)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నాలుగు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్నా భారీ స్కోర్కు పునాది వేశాడు. రషీద్ ఖాన్ వేసిన ఆఖరి ఓవర్లో ఫెరీరా(38 నాటౌట్) నాలుగు సిక్సర్లతో విరుచుకుపడగా రాజస్థాన్ ప్రత్యర్థి ముందు రెండొందలకుపైగా లక్ష్యాన్ని నిలిపింది.

## రైతు డిస్కం వ్యవసాయానికి ఎండ్రిన్

(మొదటి పేజీ తరువాయి)

రైతు డిస్కంను ఏర్పాటు చేయాలిని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు.

**ఉచిత విద్యుత్తును రద్దు చేసేందుకు రైతు డిస్కం ప్రతిపాదన : బిఆర్ఎస్**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యేక రైతు డిస్కం ఆలోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతన్నలకు అందుతున్న 24 గంటల ఉచిత విద్యుత్తును రద్దు చేసేందుకే ప్రత్యేక రైతు డిస్కం ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందని బిఆర్ఎస్ పేర్కొంది. ఇఆర్‌సి ముందు బిఆర్ఎస్ తరపున మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి తమ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన ‘రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ’ నిజానికి రైతుల ప్రయోజనాల కోసం కాదని, రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్‌ను క్రమంగా ఎత్తివేసి విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు రూపొందించిన కుట్రలో భాగమని వారు ఆరోపించారు. రైతు డిస్కం పేరుతో ఏర్పాటు చేస్తున్న సంస్థ రైతులను చీకట్లలోకి నెట్టే ‘ఉరి డిస్కం’గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న మూడో డిస్కమ్ ప్రతిపాదన వెనుక అసలు ఉద్దేశ్యం రెగ్యులర్ ఆదాయం వచ్చే వినియోగదారులను ఒక వైపు, సబ్సిడీ పొందే రైతు కనెక్షన్లను మరోవైపు వేరు చేసి, భవిష్యత్తులో ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేయడమేనని అన్నారు. ఇది విద్యుత్ వ్యవస్థను విభజించి రైతులను ఒంటరిగా చేసే ప్రమాదకర చర్య అని ఆయన పేర్కొన్నారు.

**రైతు డిస్కమ్‌తో వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టే టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతులను నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయంపై ఎండ్రిన్ చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరించారు. తెలంగాణ రైతుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రతిపక్ష పార్టీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి : చామల**

రైతుల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తారని, ఉచిత విద్యుత్తును దశల వారీగా ఎత్తివేసే ప్రమాదం ఉందని రైతు డిస్కం ఏర్పాటు విషయంలో ప్రతిపక్ష పార్టీలు ఊహాజనిత ఆరోపణలు చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్‌డిఎస్ఎస్ పథకంలో కూడా రైతులకు మీటర్లు పెట్టాలన్న అంశమే లేదని ఆయన చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్తును ప్రారంభించిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రైతు డిస్కం ఏర్పాటుపై జరిగిన ఈఆర్‌సి బహిరంగ విచారణలో ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కామ్‌ను తీసుకువస్తున్నట్లు తెలిపారు. 2014లో ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ రెండు సంస్థలు భారతదేశంలోనే ఏ గ్రేడ్‌లో ఉండేవని, ప్రస్తుతం సి గ్రేడ్ (52వ స్థానానికి) పడిపోయిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రెండు సంస్థలను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఉచిత విద్యుత్తుతో పాటు మరో ఐదు విభాగాలు తీసుకుని ప్రత్యేక రైతు డిస్కామ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 2014లో రాష్ట్ర విద్యుత్తు బకాయిలు రూ.1595 కోట్లు ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2023 వరకు రూ.31,698 కోట్లకు పెరిగాయన్నారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక రైతుబిడ్డగా రైతులకు నిరంతరం నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించడానికి రైతు డిస్కామ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతు మోటార్లకు మీటర్లు పెడితే మమ్మల్ని ఉరివేయండని, లేకపోతే రైతు డిస్కామ్‌ను వ్యతిరేకించే వారికి ఉరివేయాలని అన్నారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీకి ఉందని గుర్తు చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com